# ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక






4 అణాలు
28-7-54

ANDHRA PATRIKA ILLUSTRAT



సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

సంపుటము 47
సంచిక 46
28.7-54

# సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

జయ ఆషాఢ బహుళ త్రయోదశి బుధవారం



"వెలుగునీడలు"

—ఫోటో : పాలకుర్తి నారాయణరావు (బందరు)

## విషయానుక్రమణిక

ముఖచిత్రం: "పరివర్తన" తో
ఎ. నాగేశ్వరరావు.



లోపలి కవరు చిత్రం:-
విశ్రాంతవేళ — ఫోటో: టి. కె. యస్. ఈశ్వరబాబు, మద్రాసు.
వెనుకవైపు కవరు చిత్రం:-
'గీత' కారుడు — ఫోటో: ఎస్. వి. కె. పర్వతాలు, ఉంగుటూరు.

### పంచతంత్రం - గమనిక

కారణాంతరాలవల్ల పంచతంత్రం-లబ్ధనాశం ప్రస్తుతానికి ప్రచురించలేక పోతున్నందుకు చింతిస్తున్నాం. తిరిగి త్వరలోనే - నాలుగైదు వారాలలో ప్రచురణ సాగించగలం.

—సంపాదకుడు.

# దసరా సంచిక

## పిల్లలకు ప్రత్యేకాకర్షణ

## కథలు, గేయాలు, చిత్రాల రచనలో పోటీ

రాబోయే 'విజయదశమి' పండుగకు (1954 అక్టోబరు 6 వ తేదీ) ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక పిల్లల ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. బాల బాలికలకు ఉల్లాసం, విజ్ఞానం కలిగించే చక్కని కథలు, గేయాలు, వ్యాసాలు, బొమ్మలతో పత్రిక ఆకర్షణీయంగా తయారవుతుంది.

బాల బాలికల రచనాశక్తిని, చిత్రలేఖనాశక్తిని ప్రోత్సహించడానికిగాను పోటీ పెడుతున్నాము. ఈ పోటీలో ఒక మంచి కథకు, ఒక మంచి పాటకు, ఒక మంచిబొమ్మకు బహుమతులివ్వబడతాయి.

ఈ సందర్భంలో రచనలు, చిత్రాలు పంపదలిచేవారు ఈ క్రింది అంశాలను గుర్తుంచుకోవాలి.

* పదిహేనేళ్లలోపు బాల బాలికలు మాత్రమే ఈ పోటీలో పాల్గొనవచ్చును.
* కథలు, గేయాలు, బొమ్మలు, స్వతంత్రమైనవై ఉండాలి.
* కథలు గేయాలు కాగితానికి ఒకేవక్క సిరాతో స్పష్టంగా వ్రాయాలి.
* బొమ్మలు రంగులలో కాని, రంగుకాగితం మీద కాని సిరాలతో వ్రాయబడినవి పనికిరావు. ఇండియన్ ఇంక్ తోగాని పెన్సిల్ తోగాని వ్రాసి పంపాలి.
* రచనలు, బొమ్మలు **1954** ఆగస్టు **21** వ తేదీలోగా మాకు చేరేవిధంగా పంపాలి.
* రచయితలు, చిత్రకారులు తమ పూర్తిపేరు (ఇంటిపేరు కూడా) వయస్సు, చిరునామా అన్నీ వివరంగా రచనలూ చిత్రాలతోపాటు వ్రాసి పంపాలి.
* స్వీకరించబడని రచనల్ని, బొమ్మల్ని తిప్పి పంపాలని కోరేవారు చాలినంత స్టాంపులూడా చేర్చి పంపాలి.
* కవర్లపైనా లేక రేపర్లపైనా "ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక దసరా పోటీకోసం" అని స్పష్టంగా వ్రాసినవి మాత్రమే పోటీకి స్వీకరించబడతాయి.

# కాలక్షేపం

తపముల్ సేయుము దేవతాతటిని (...)
చెంతన్ నిల్తుమో కాక; - దా(...)
ర పరత్వంబున నుందుమో; - వివిధ
శాస్త్రశ్రవ్య కావ్యామృతం
బుపభోగింతుమొ; - యేమి సేయను
హితం బూహింపగా లే, మని
త్యపు లోకంబున మానవుల్
మితని మేషాయుష్యులై యుండగన్.

తా॥ గంగానదియొడ్డున తపము చేసికొనుచు ఉండెదమా? లేదా, భార్యాలోలులమై యుందుమా? లేదా, అనేక శాస్త్రములలోని అమృతమును, విని ఆనందించదగిన కావ్యముల అమృతమును అనుభవించెదమా? ఏమి చేస్తే హితకరమో శ్రేయస్కరమో ఊహింపజాలము. మితముగా కొలది నిమషములు మాత్రమే ఆయుష్కాలమును కలిగియుండుటవల్ల మానవులు యీ అనిత్యపు లోకములో ఉత్తమ మార్గమేదో ఊహింపజాలకున్నారు.


"మోక్షపట్నం పోదమంటే మార్గమేది అన్నయ్యా?" అనేది ప్రశ్న. ఎన్ని యుగాలు గడచినా, ఎన్ని తరాలు వెళ్ళినా, తరించే మార్గమేదో తెలిసికోవడం తరం కాకుండా ఉంది. "లోకకల్యాణం, లోకకల్యాణం" అని కల్యాణపు కలవరింత మాత్రం ఎక్కడ చూచినా వినిపిస్తూ ఉంటుంది. కాని, యుద్ధాలూ సంగ్రామాలూ సాగుతూనే ఉన్నాయి. "ఢాం! ఢాం!" అని ఫిరంగులు బాంబులు దగ్గరా మందుగుండుసామాను బాణాసంచువలె. అగ్రరాజ్యాలవారు మహోగ్రంగా కాలుస్తూనే ఉన్నారు. హిట్లరుతో పోరాడి మహాసంగ్రామం ఎందుకు చేశారయ్యా అంటే, వాళ్ళ తత్వాన్ని నిర్మూలించడానికి. నిరంకుశ నియంతల అధికారాన్ని అంతమొందించుటకు. లోకకల్యాణం నిమిత్తమే రాకెట్లుకూడా తారాపథంలోకి వదిలేట్లుగా కాల్చారు. అయితే హిట్లరు చెప్పిన మాట కూడా అదే—"లోకకల్యాణం కోసమే నేనుకూడా విమానాలు కొల్లప్రమాణాలు (...)కుండా నిర్మిస్తున్నాను" అన్నాడు. ఆ విమానాలమీదనుంచి భూలోకానికి శాంతిదేవతను దింపుతానన్నాడు. ఈనాడు అమెరికావారు ఆటంబాంబులను నిర్మించుట కూడా లోకకల్యాణంకోసమే అంటున్నారు. లోకకల్యాణం అంటే బ్రహ్మాండమైన బాణాసంచుతో భూనభోంతరాళములు బద్దలయ్యేడి ప్రేలుడు పదార్థములతో మహోత్సాహంగా వాహనాలతో విమానాలతో దారుణజ్వాలా తోరణాలతో అగ్నిసాక్షిగా పూర్తికావలసిన శుభకార్యం అన్నట్లుగా అన్వయింపబడుతోంది.

శుభం అనేది కొన్నికోట్లమంది జనుల చావుతో సిద్ధించవలసినదేనా? అనే సందేహం కలుగకమానదు. పదిమందితో చావు పెళ్ళితో సమానం అని వాదించడం కూడా పరిపాటి అయింది. యుద్ధంలో శత్రువును సంహరించిగాని, శత్రువును సంహరించుటకుగాని, ప్రాణాలు విడిచినటువంటివానికి వీరస్వర్గం లభిస్తుంది అనే ఆశతో, సమరరంగములోనికి శలభతండములవలె ఉరికి శత్రువుల నరికి స్వర్గమున కరుగుచున్నామని మురియుచుండెడివారు మూర్ఖులా? బుద్ధిలో మనకంటె ప్రాజ్ఞులా?

అయితే వీరులు తరించేది వీరస్వర్గం. వారు కోరేది స్వర్గంకాని మోక్షంకాదు. సకల సౌఖ్యములకూ, ఐహిక భాగ్యభోగ్యములకూ, యీ లోకము యోగ్యమైయుండవలెనని వీరులు కలవరించి, కలవరించి, కత్తిపట్టి, బద్ధకంకణులై, యుద్ధసన్నద్ధులై, మనోరథసిద్ధికై రక్తాభిషేకాలు చేసి ప్రాణాలు సమర్పించి "ఓం ప్రాణాయ స్వాహా!" అన్నారు. ధర్మరాజులవారు కూడా రాజ్యం కావాలన్నారు. "నాకీ రాజ్యము కావలెనంటె నాకో! నీతో నేగన్న దైవకే?" అని ఎన్నడూ వాదించలేదు. సిరి కావాలన్నారు.

"సిరి నా కేలందువా? గ్రాసవాసో
దైన్యంబులు దప్పు నాయరయు నీ చుట్టా
లకున్ గావునన్"

అన్నారు. "సిరి నాకు ఏల అనెదవా! అది లేకపోతే, నేను కనిపెట్టి చూడవలసిన నా చుట్టుప్రక్కల నన్నాశ్రయించుకొనియున్న జనులకు అన్నవస్త్రములు కూడా లేనటువంటి దైన్యం ఏర్పడుతుంది." అని ధర్మరాజు వాదించాడు. దీనిని బట్టిచూస్తే, భారతయుద్ధంఎందుకు చేయవలసి వచ్చిందో బోధపడుతోంది. "సిరి నాకేలందువా?" అనే ప్రశ్నలోనే బోధపడుతోంది. ధర్మరాజులవారు సిరికై చేసిన యుద్ధం అని చెప్పవలసివస్తోంది. అదికూడా ఎందుకయ్యా అంటే, వారిని ఆశ్రయించుకొనియున్న జనులకు అన్నవస్త్రముల దైన్యం కలుగకుండా ఉండే నిమిత్తమే యని చెప్పినది ఉత్తమాటకాదు. అన్నవస్త్రాలకు లోపంలేకుండా చూడాలిఅంటే అర్థమేమిటి? తన పరిజనులకు నిలువనీడగాని ఇల్లు వాకిలిగాని అక్కరలేదని నొక్కి వక్కాణించుట నేలవిడిచి సాముచేయుట వంటిది. మనిషి అయినతర్వాత దేహం అనేది ఏవిధంగాఉంటుందో, ఒక అస్థిపంజరంలో జీవుడు ఏవిధంగా మకాము చేసిఉంటాడో, అదేవిధంగా యీ దేహానికి కూడా ఒక కొంప, ఒకగూడు ఉండాలి. తడుక, కూడు, గూడు, గుడ్డ అన్నీ కావాలి. ఇల్లూ వాకిలీ అనేది ఏర్పడినతర్వాత యిల్లాలు కావాలి. జోడుకుదిరి గూడు చేరితే, గృహస్థు పిట్టసం, గృహస్థుపాడగడం, రెక్కలురాని పిల్లలకు ఎక్కడినుంచి అయినా ఆహారం తీసికొని రావాలనే సంసారభారం, యివన్నీ ఏర్పడతాయి. భార్యను పోషించాలి. బిడ్డలను పోషించాలి. ఇవన్నీ యీషణత్రయాలన్నారు. ఈ ఈషణత్రయాలతో శోషించి పోతున్నదీ లోకం - అటువంటి సంసారభారం అంతా నెత్తిమీదవేసికొని మోస్తూ,



# వర్షాయామిని

## బైరాగి

మేఘాల మోహాలు ముసురుకొను నీ రేయి.
వీడి క్రొమ్ముడి చెదరి క్రమ్ముకొన్నవి కురులు
నల్లత్రాచులవోలె ఒళ్లు మాలిన ఇరులు
చూపులందని పొరల చీల్చిమూగినమరులు
ప్రాతతలపులు గుబులుకొన్నవీ పయ్యెరల
ఉగ్ర తావులు కొసరి విసిరిచను నీ రేయి.
మేఘాలమోహాలు ముసురుకొను నీ రేయి.

ఆకాశ దీపాలు ఆరిపోతున్నాయి
తెగినముత్తెపుసరులు జారిపోతున్నాయి
లేగనుల నీలాలు కారిపోతున్నాయి
దెసల చెక్కిలినంటి కారుకాటుకచాయ
నొసటివ్రాతలు చెరిగి చెమరుకొను నీ రేయి.
మేఘాల మోహాలు ముసురుకొను నీ రేయి.

మెరుపు మెరిసినచోట తెరచి మూసినతలుపు
చిమ్మచీకటి బాట చేరనీయదు మలుపు
ఈ రేయి మీటినది ఏనాటిదో పిలుపు
గతులతీగెలనూపి, స్మృతుల గాయము రేపి
వెతల క్రొంజివురులను పసరుకొను నీ రేయి.
మేఘాల మోహాలు ముసురుకొను నీ రేయి.

# ★ కాలక్షేపం ★

భవసాగరంలో పడి యీదుతూ, అతిథికి అభ్యాగతికికూడా యథాశక్తిగా సత్కారం చేస్తూ, వాకిట్లోకి వచ్చిన బిచ్చగానికి, కుంటివానికి, గుడ్డివానికి తన శక్తి కొలదీ దానం ధర్మం చేస్తూ, గృహస్థాశ్రమం నిర్వహిస్తే, అంతకంటే పరమోత్కృష్టమైన జీవితం యింకొకటి యిలలో కలదా! అని అల్లసాని పెద్దన వంటి పెద్దలుకూడా బల్లగుద్ది చెప్పినట్లుగా పద్దెములు వ్రాశారు.

"బధిర పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి జటి పరివ్రాజ కాతిథి క్షపణ కావధూత కాపాలికా ద్యనాథులకు."

"పండిన పెరటి కల్పకము వాస్తవ్యుండు" [illegible]

చిట్టచివరకు అత్తరుబొట్టువలె ఘుమాయించే ఒక్క మాటలో కట్టుదిట్టంగా అన్నారు.

"గార్హస్థ్యమునకు సరియే?" అని సవాలు చేశారు.

కనుక, సుఖంగా సంసారం చేస్తూ, జీవిత సాగర పారంపారం తెలిసికొని తరించవచ్చునని వాదించినవాళ్లంతా, ఫిల్ములవలె తిరుగుచున్న "సంసారం" ప్రచారంలోకి ప్రసిద్ధిలోకి రావాలనే భావంతో ప్రకటనచేసెడి ఫిల్ముకంపెనీ భాగస్వాములవంటి వాళ్ళు కారు.

కాని, "నాతరమా భవసాగరమీదను నళినదళేక్షణ రామా!" అనే ఆర్తనాదం అఖిలప్రపంచ రేడియో ప్రోగ్రాము లాగున [illegible] నుంచి వినిపిస్తోంది. సంసారంలో యీదుతూ ఆవలిఒడ్డు కన్పించక ఈవలిఒడ్డు కన్పించక ఇహసౌఖ్యం కన్పించక పరసౌఖ్యం కన్పించక "రెంటికిం జెడిన రేవడనైతి"నని విలపించి "కన్నీర్నించు లోలోపలన్" అనే విషయం, విషయ సౌఖ్య కటు కషాయం త్రాగి కాషాయవస్త్రముల దాల్చిన వారి వేషంలోనే కన్పిస్తుంది.

వేశ్యాలోలుడై, తిరిగి తిరిగి, మనస్సు విరిగి విరాగియైన వేమనయోగి, ఆటవెలదిని విడిచి, తన ఆటవెలదులతో లోకంలోని అజ్ఞానాటవిని ఛేదించాడు. నశ్వరమైన జీవితంలో అనశ్వరమైన దిదిగో "విశ్వదాభిరామ వినుర వేమ" అన్నాడు. వేశ్యవాటికలోనుంచి పరిపక్వం అయినాడు. సంసారం అనేది బురదకావచ్చు.

"కుటుంబ జంబాలపటలమగ్నమాదృశ గృహమేధి మండలంబు నుద్ధరింపగ నౌషధ మొండు గలదె?" అనేది అసలైన ప్రశ్న.

"కుటుంబ జీవితం అనేది ఒక బురదగుంట. దానిలో మునిగియున్న మావంటి గృహమేధిమండలమును ఉద్ధరించుటకు తగిన ఔషధ మేదైనా ఉన్నదా?" అని ప్రవరుడనబడు విప్రవరుడు ఒక సన్యాసితో మొఱపెట్టుకున్నాడు. కాని ఆ సన్యాసి అంతకుపూర్వమే "గార్హస్థ్యమునకు సరియే?" అని స్తోత్రం చేసి, సుఖదుఃఖ మిశ్రమం అయిన గృహస్థాశ్రమం తీపీ కారమూ కలిసిన గరం గరం లడ్డూ పకోడీ, అన్నట్లుగా లొట్టలు వేస్తూ వర్ణించాడు. నిజంగా సంసారం అంటే ఎటువంటిదో సన్యాసి కేమి తెలుసు? ప్రసవవేదన గొడ్రాలి కేమి తెలుసు? కనుక, సంసారంలో ఉండి ఆ బండిని గుండె పగిలేటట్లు లాగుతున్న పురుషపుంగవు

(49-వ పేజీ చూడండి)

"మీ గడియారంలో ఎనిమిది గంటలయితే ఆరుగంటలే కొట్టిం దేమిటి?"

"ఆరుని రెండుపెట్టి గుణించి నాలుగు తీసేయండి."

"అదేం? మరి అలాంటి గడియారం ఎందుకు కొన్నారు?"

"మా అమ్మాయికి లెక్కలు నేర్పడానికి."

—వి. వి. సూర్యనారాయణ, బందరు.

# గోల గోవిందుడిది. వేడుక వెంకన్నది!

నలుగురూ ఆ ప్రశ్నాలు చూసి ఎందుకు నవ్వుతారో నాకు తెలియదు గాని, మా లక్ష్మీకాంతం మామయ్య ఉన్నాడే, ఎవరికీ తోచని సరికొత్త సంపాదనా మార్గాలు కనిపెట్టడంలో అఖండుడు. లేకపోతే ఊకదంపుడు సొసైటీకి ఉచిత సలహాదారుగా యిన్నాళ్ళు ఎలా పని చేస్తాడూ?

అవాళ ఆ సంఘ సభ్యులంతా సాయంకాలం చల్లగాలి సమావేశంగా పల్లచెరువు మెట్లదగ్గిర కలుసుకున్నారు. అందులో ప్రతి వ్యక్తినీ చూస్తే ఈపాటికి మనిషి పాళంగా చాకలాడికి ఉతుక్కి వేసి బాగుండు ననిపిస్తుంది. ఒక చక్కని షేవింగు, ఒకజత మంచి బట్టలూ, ఒక పన్నెండణాల లైట్ టిఫినూ, ఒకే ఒక మూడు గుణ్ణాల మార్కు బీడీ - పాపం యిలాంటి చిన్న చిన్నవే వాళ్లు కోరేవి, వాళ్లకి లభ్యమవనివీ. దానిగురించే నిత్యం చర్చ, ఎప్పుడూ వేట. డబ్బు సంపాదనలో వివిధమార్గాల అన్వేషణకి వీళ్ళందరికీ మా లక్ష్మీకాంతం మామయ్య గౌరవనియంత. మన్ని సరస్వతి పరిసరాలకి రాకుండా చేసుకుంది, పోనీ దాని అత్తగారంటారే, ఆ లక్ష్మీకైనా దయలేకపోయిందా?' అని వాళ్ళ నిరంతర సందేహం.

మా మామయ్య ఎత్తయిన రాయిమీద కూర్చున్నాడు. కొంత కిందుగా సూర్నారాయణా, పెరుమాళ్ళూ, సుబ్బారాయుడూ కూర్చున్నారు. పెరుమాళ్లు అన్నాడు.

'అవ లింతదూరం వస్తాననుకోలేదు. నిన్న ఆశచూపిన ఆకరణం పనో పొమ్మన్నాడు. నాలుగు రూపాయిలు లేకుండా యింటికెళ్ళి అక్కయ్యకీ పిల్లలకీ మొహం ఎలా చూపించను? తిరగలేక కాళ్ళు పడిపోయాయి'

'అక్కయ్య! అక్కయ్యకూ నీకూ ఏం సంబంధం? నీ యిష్టం వచ్చినచోటికి నువ్వు పోయి నీ పొట్ట పోషించుకుంటావ్. నాలా నీకు కుమ్మరిపురుగులాంటి పెళ్లాం లేదుగా?' సుబ్బారాయుడు తన దుఃఖం తను వెళ్ళబోశాడు. మామయ్య నవ్వేడు.

"అందుకేరా తమ్ముళ్లూ! ఆలోచించకుండా అదికి ముందు పెళ్ళికి ఎగబడకూడదు. జరిగిందానికి విచారించనూ కూడదు. అన్నట్టు ఏడుకొండలు ఏడీ, పదిరోజులై కనిపించనే లేదూ!"

ఇంకా ఆమాట పూర్తికాకుండానే ఏడుకొండలూ, అంజనేయులూ అక్కడికి రావడం అందరూ చూశారు. ఎప్పుడూ కనిపించని చిరునవ్వు, తమలపాకులు వేసుకున్న పెదిమలూ, పెదిమల మధ్య కొత్త ఖరీదయిన సిగరెట్టూ - మామయ్య మనస్సు ఎందుకో చివుక్కు మంది.

"ఏంరోయ్ ఏడుకొండలూ! బలే జల్సాగా ఉందే యవ్వారం - ఏమిటి కథ?" అందరూ వాడి చుట్టూ మూగేరు. అంజనేయులు చెప్పేడు.

"ఏదో(రా, నాలుగురోజులు ఊకీగా వెళ్లడానికి వాడికి అదృష్టం కలిసొచ్చింది. నువ్వే చెప్పరా భాయ్" చేతులన్నీ ముందుకు చాచబడ్డాయి. చేతుల్లో సిగరెట్లు వచ్చాయి. అందరినోటికీ తలో దమ్మూ అందింది. ఏడుకొండలు మొదలుపెట్టేడు. అందరూ ఆతృతగా వినసాగేరు.

## అవసరాల రామకృష్ణరావు

"ఈ మధ్య పత్రికలకి సేల్సు తగ్గిపోయాయి కదటా - అందుకని చందాదారుల్ని ఎక్కువ చెయ్యడానికి పత్రికలవాళ్లు చిన్న యిన్స్యూరెన్సు పాలసీ అవలంబించారుట. ఇవన్నీ నాకు తెలీనే తెలీదు. మా యింట్లో అప్పటికి తిండిలేకపోయినా "వసంత" రెగ్యులర్ గా చదువుతారు. అదీ నా పేరునే వస్తుంది. సరే ఆ సంగతి అలా ఉంచండి. ఈమధ్య పదిరోజులు నేను రాలేదు, ఎందుకనుకున్నారు?"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి వచ్చినంత దెబ్బ తగులతే! ఆమధ్య నేనూ మురళీ సైకిలుమీద వస్తున్నాం. ఓ ఎర్రగ్గిపుల్ల ఎదురైంది. ఆ డౌన్లో కాస్త స్పీడుగా తొక్కాం. దాంతో దాసన్నపేట తురకల చెరువుదగ్గిర సైకిలు బోల్తాపడింది. వాడికి ఆట్టే దెబ్బ తగల్లేదు. లేచి, సైకిలు చూసుకుని 'అయ్యబాబోయ్ నా సైకిలు చెయిను జారిపోయిందే' అన్నాడు. 'ఉండరయ్యా సైకిలు చెయినేమిటి, నా వెన్నుపూసే జారిపోయింది!' అన్నాను నేను. అంత గట్టిదెబ్బ తగిలింది. వారం రోజులు తిరక్కుండా 'వసంత' పత్రికవాళ్ళు ఏభైరూపాయిలు పంపించారు!"

"అదేమిటి? ఎందుకూ?"

"చెప్పేనుగా! చందాదారుల్లో ఎవరికే ప్రమాదం జరిగినా, ప్రమాదాన్ని అనుసరించి పత్రికలవాళ్లు డబ్బిచ్చుకుంటారని!"

అందర్నీ తోసుకుని మామయ్య ముందుకొచ్చేడు.

"అన్ని పత్రికలవాళ్లూనా?"

"ఆహా(' మామయ్యకి ఏం ఉపాయం తోచిందో పిడతలాంటి ఆ చిన్న బుర్రలో ఏం మెరుపు మెరిసిందో తెలీదు. లేచి సంతోషంతో గంతులు వెయ్యడం ప్రారంభించాడు. అందరూ ఆశ్చర్యంతో చూశారు.

"ఒరే సుబ్బారాయుడూ నీకేం కావాలిరా?"

"ఎందుకూ?"

"అదికాదు. ముందు చెప్పవోయ్ కనుక వస్తే, సామ్యవస్తే నువ్వు ముందేం కోరుకుంటావ్?'

"మలబార్ హోటల్లో కొత్తగా చేరిన సర్వరికి కాళ్లు విరిగేలా ఆర్డరు ఇయ్యాలి!"

"ఓస్ యింతేనా, నువ్వురా పెరుమాళ్లూ?"

"ఒక మలయా జెర్కిన్, ఒక లినెన్ పేంటూ యివి రెండూ చాలు. ఇవే ఉంటే ఆనాడు గంగాభాయి నన్నంత నీచంగా చూచునా?"

"నీకోయ్ సూర్నారాయణా?"

"ఎందుకు మేష్టారూ అక్కర్లేని జరగని ఆశలూ? వెంటనే ఓ పావలా చాలు; లేవ గడ్డానికి లేవ అరకప్పు కాఫీకిని."

లక్ష్మీకాంతం మామయ్య నవ్వుతూ చప్పట్లు కొట్టేడు.

"సెభాష్. చిన్నదైనా, పెద్దదైనా మీ కోరికలు తప్పకుండా ఫలిస్తాయి. ఎండిపోయిన మన చెరువులు నిండుతాయి. ఇక కష్టాల రొదతో మనకి ఊపిరి సలపదు"

మామయ్య సరదా చూస్తే అందరికీ ఆశ కలిగింది.

"ఎందుకు యింకా మమ్మల్ని చంపుతారు? డబ్బు సంపాదించే ఆ కిటుకు ఏమిటో కాస్త త్వరగా చెవిని వెయ్యండి మేష్టారూ."

"ఇంకా మీకు తోచలేదా? ఇప్పుడు యీ ఏడుకొండలు చెప్పినదాన్ని బట్టి నాకు

# ★ గోల గోవిందుడిది వేడుక వెంకన్నది! ★

ఏం తోచకుంటుందో యింకా మీకు అవగాహన అవలేదా? ఓరి వెర్రి దద్దమ్మల్లారా! అందుకే చరిచిన పిడకల్లా ఎప్పటికీ వేసినచోటునే ఉన్నారు. కొంచెం మదుపూ, కాస్త అదుపూ ఉంటే ఎంత సొమ్మైనా సంపాదించవచ్చు. ఏడుకొండలు చెప్పింది విన్నారుగా. ప్రమాదాలకి గురిఅయిన చందాదార్లకి పత్రికలు సొమ్మిస్తాయనీ! మనలో ఎవరో ఒకర్ని అన్ని పత్రికలకీ చందా కట్టిద్దాం!

"సొమ్మో?"

"మొట్టమొదట ఆమాత్రం చిన్న పెట్టుబడిఅయినా పెట్టగలగాలి మరి. దానికీ చందాలు వేసుకుందాం. ఆ వ్యక్తి ప్రమాదానికి గురైతే కావలసినంత సొమ్ము! అందరం హాయిగా పంచుకుందాం!"

"ప్రమాదంలో తల దూర్చడానికి ఎవరు ఒప్పుకుంటారూ?"

"ఇదుగో - యింతకన్న దరిద్రపు ప్రశ్న మరొకటి లేదు. అందుకే మీతో నే ఏది చెప్పను. తిండిలేక శరీరానికీ బుర్రకీ ఏవిధమయిన కాంతీ లేక మనందరం యించుమించు ఆత్మహత్యకి సిద్ధంగా ఉన్నాం. బోలెడు డబ్బు వస్తాంటే చిన్న ప్రమాదానికి ఒప్పుకోలేమూ? నాగరికత బలిసిన యీ యిరవైయ్యో శతాబ్దంలో, యింత పట్నంలో ప్రమాదాల కేం లోటూ?"

మామయ్య చెప్పింది అంతో యింతో అందరికీ నచ్చింది. కాని చూసి చూసి అపాయంలో ఎవడు యిరుక్కుంటాడూ? చిన్న కాగితంమీద ఒక శ్రీ, అయిదు సున్నాలూ వేశారు. శ్రీ ఎవరికొస్తే వాడు కాలో చెయ్యో విరుచుకోవాలి. లాటరీ వేశారు. శ్రీ, ఆంజనేయులికి వచ్చింది. వాడు చస్తే ఉండనని పేచీ. ఆఖరికి వచ్చిన డబ్బులో నాలుగో వంతు వాడు తీసుకోడానికీ మిగిలింది అందరూ పంచుకోడానికీ మావయ్య అతికష్టపడి ఒప్పించాడు.

మూడు వారాలు కాబోలు అతికష్టపడి సొమ్ము సంపాదించి ఆంజనేయులు పేర కాస్త పేరుప్రఖ్యాతులున్న పది పత్రికలకి చందా కట్టించారు. సుబ్బారాయుడు యింట్లోంచి రెండు వెండిగిన్నెలు ఎత్తుకొచ్చి అమ్మేశాడు. మా మావయ్య తన పాత సైకిలు ఒకరిక్రింద తనఖా పెట్టేడు. ఏడుకొండలు సినిమా హాల్సదగ్గర కాసి ముందుగా టిక్కెట్లు కొని లాభాలకి అమ్మి కొంత సొమ్ము సంపాదించేడు. మొత్తం మీద భవిష్యత్తుపై బ్రహ్మాండమైన ఆశ పెట్టుకుని నాళ్ళు కలిసికట్టుగా పడ్డ పాట్లు ... అంటూ ఉన, వాళ్ళకి ఎవరికైనా జాలి వెయ్యకమానదు. యథాప్రకారం ఆనాడు సాయంకాలం ఊకదంపుడు సొసైటీ అత్యవసర కార్యక్రమంలో పాల్గొంది.

"ఇంకా ఎన్నాళ్లు చేస్తావురా ఆంజనేయులూ? త్వరగా కానియ్యి"

"ఎలాగ మేష్టారూ, అనుకున్నంత సులభమా?"

"ఎప్పుడో ఒకప్పుడు తప్పదుగదా - అయినా ఎంతసేపూ? సరిగ్గా సాయంకాలం నుంచి రష్‌గా ఉన్నప్పుడు కరాచీ స్టోర్సు ఎదురుగుండా మెయిన్‌రోడ్డుమీద అయిదు నిముషాలు కళ్లు మూసుకు నిలబడు. ఏ కారో, గుర్రబ్బండీయో జాయ్‌గా మీద నుంచి ఎక్కేస్తుంది. మన సొమ్ము దక్కేస్తుంది. అంతేగా?" ఆంజనేయులు శరీరం వైపు ప్రేమతో చూసుకుంటూ అన్నాడు.

"ముల్లు గుచ్చుకుంటే ఓర్చదే యీ సుకుమార శరీరం? చూస్తూ చూస్తూ ఎలాగండీ?"

"అయిదు నిమషాలపాటు యీ శరీరం నీది కాదనుకో—మరు క్షణంలో లక్ష్మి నీ ముందు వాలుతుంది. మనం తిండికి లేక ఎంత బాధపడుతున్నామో ఆలోచించుకో. నీ చేతిలో డబ్బు పడ్డాక నీ గౌరవం, నీ హోదా ఊహించుకో. అన్నట్టు నువ్వు యిష్టపడుతున్న మా ఎదురింటి అమ్మాయి పేరేమిటి?"

"ఎవరూ? ఆ జిలుగు వెలుగుల తేనె చినుకా? పేరు వెంకటమ్మ"

"ఇంకేం? ఆ వయ్యారి కాల్‌గేట్ వేవీ పౌడరు కొనుక్కుందామని, చేత హేండు బ్యాగ్ ధరించి మోడరన్ స్టోర్సులోకి వెడదామనుకుంటోంది. అన్నట్టు ఆ అమ్మాయికి చిన్న తమ్ముడు ఉన్నాడుకదూ, నీ కాబోయే బావమరిదిగాడు! వాడు ఎలాగా అక్క కొంగు వదల నే వదలడు. అక్కతో బజారుకి వచ్చాడు. తిన్నగా ఉండక ఓ సినిమా బండీ వెనకాతలపడ్డాడు. పక్క సందునుంచి అతి స్పీడుతో కారు వస్తోంది. వెంకటమ్మ వెనక్కి తిరిగి హడలిపోయింది. కారు ముందు తమ్ముడు. "హా సోదరా, ఏకోదరా, లంబోదరా! నిన్ను రక్షించు వాడు లేడా? ఓ దిక్పాలకులార! ఓ జన సమూహములార! చూచుచు ఊరకుందు రేల?" అని విలపించింది. నువ్వు గంట స్తంభం ఎదురుగుండా అరకట్ట జాడీబీడీలు అరువు తీసుకుంటున్నావ్. అప్పుడు ఈ కేక - ఈ కుసుమకోమల వనిత దీనాలాపన వినిపించింది, ఏం చేస్తావ్?"

"ప్రాణం పోతేపోయింది, వెళ్లి అపూర్వ సాహసం ప్రదర్శించి, ఆ బావమరిదిగాడ్ని చెవిపట్టుకుని యివతలకి యీడ్చుకురా నూ?"

"భేష్! లక్షలు విలువచేసే మాట అన్నావ్ ఇంకేం! అలాంటి నిక్కని ఊహా చిత్రించుకో. దబ్బగా మీదనుంచి ఏ కారో వాలుమొగ్గ వేస్తుంది. పెద్దాసుపత్రిలో జాయిన్ చేయించి అయిదు నిముషాల్లో బాగుచేయించుకుంటాం. ఆ తర్వాత చూడు కనీసం అయిదు వందలు! పత్రికలు దివాళా తియ్యాలి!"

ఆంజనేయులు ఏమంటాడో అని అందరూ అతి ఆతృతతో వాడి ముఖం వైపు చూశారు. వాడు మాట్లాడలేదు. మావయ్య అంతటితో వదిలిపెట్టలేదు.

"ఈ రాత్రి జాగ్రత్తగా ఆలోచించు. కొద్ది ఓర్పు, కాస్త నిశ్చయం చాలు. నీమీద మేమందరం ఆధారపడి ఉన్నాం. ఆశలు పెట్టుకున్నాం. పుస్తె, పూసా అమ్మి చందాలు కట్టేం - నిన్ను ప్రార్థిస్తున్నాం"

అందరూ దీనంగా వాడి వైపు చూశారు.

"ఇన్ని కబుర్లు చెబుతున్నారు గాని సాగదీసి లెంపకాయకొడతానంటే మీలో ఎంతమంది ఎదురుగుండా వస్తారు? అందరి శరీరాలూ అంతే. ఆలోచిస్తాను, నామీద మాత్రం ఎక్కువ ఆశలు పెట్టుకోకండి"

ఆంజనేయులు చరచరా వెళ్ళిపోయాడు. అయిదు నిమిషాలు ఎవరినోటా మాటలేదు. తరువాత ఏడుకొండలు అందుకున్నాడు.

"చూస్తే యీ వెధవ మనకి ఎగనామం పెట్టేలా ఉన్నాడు."

"ఈ సంగతి మనం అనుకోకముందు, అంటే యీ చందాలు మనం కట్టకముందు ఆంజనేయులకి జరిగిన ప్రమాదాలు యిన్నీ అన్నీ కావు. వెధవ, మూడుసార్లు అయ్యకోనేట్లో మునిగి బతికేడు. మొన్న మొన్న ములగచెట్టుమీంచి పడి నడ్డి పచ్చడైంది. మనం యీ విషయం మొదలుపెట్టిం దగ్గర్నుంచీ జబ్బూ చిదీ ఎరగడు. వారం, వారం వచ్చే పత్రికలు హాయిగా చదువుకుంటున్నాడు."

"వీడు మన ఆశలు ఎలాగా నట్టేట్లో కలిపేడు. నావల్లగాదని యించుమించు స్పష్టంగా చెప్పేడు. ఆఖరికి కుక్కతోకతో గోదావరి యీదాలా ఉంది!'

మావయ్యకి అపజయం లేదు. ఏ ఆశతోనో ఆ చిన్న కళ్ళు మిలమిల మెరిశాయి!

'కుక్కంటే జ్ఞాపకం వచ్చిందీ, కుక్క కరుస్తే దానికేమైనా ఉందా ఏడుకొండలూ!"

"ఎందుకులేదూ? ప్రమాదం హెచ్చుతగ్గుల్ని అనుసరించి ప్రతిఫలం ఉండనే ఉంది. కుక్క కరుస్తే యింతనీ, కముకు

దెబ్బ తగిలితే యింతనీ, పన్ను విరుగుతే యింతనీ కానీకటి ఏర్పాటా, మరొకటా?"

ఇంకేం మా లక్ష్మీకాంతం మావయ్య చెయ్యవలసిన అన్ని ప్రయత్నాలూ చేయించాడు. తాసిల్దారుగారి కుక్కని ఎప్పుడూ విప్పే ఉంచుతారు. అది కొత్తవాళ్ళ రక్తం చవిచూడకుండా వదలదు. ఆంజనేయుల్ని ఒకనాడు అక్కడికి ఒక మిషతో రప్పించడానికి ఏర్పాటయింది. అనుకున్న ప్రయత్నం ఎంతవరకూ జరిగిందో చూడ్డానికి ఆ వేళకి మా మావయ్య అక్కడికి వెళ్లేడు. ఇంకేముంది? సింహంలాంటి కుక్క మావయ్యని వెంటబడిగిలి అరంగుళం ముక్క ఎడం కాలి గుత్తిదగిర ఊడదీసింది. మర్నాడు ఆస్పత్రిదగ్గిర అందరూ కలుసుకున్నారు.

"ఎంత పనిజరిగింది మేష్టారూ? ఆ దగుల్బాజీకి కుక్క యిలాంటిదని ముందే తెలుసుట. అరుపు వినగానే ఎదురుగుండా చింతచెట్టు ఎక్కేశాడు. ఇంతకీ ప్రాప్తం!"

అయిదురోజుల అనంతరం లక్ష్మీకాంతం మావయ్య ఆసుపత్రినుంచి కుంటుకుంటూ యివతల పడ్డాడు. ఆసుపత్రి గేటుదగ్గిరే పరుగు పరుగున ఊరకదంపుడు సొసైటీ మెంబర్లందరూ, అతి సంతోషంతో పరిగెత్తుకువచ్చారు. పిరుమాళ్ళు మొహం పెట్రొమాక్సు లైటంత చేసుకుని అన్నాడు.

"విన్నారా మేష్టరూ? శరీరాన్ని ఎంత కాపాడుకున్నా అదృష్ట లక్ష్మిని ఎవరు అడ్డగలరూ? ఇవాళ మనం లేచిన వేళ ఎంత మంచిదో! ఆంజనేయులు లారీకింద పడ్డాడు! పెద్దాసుపత్రిలో ఉన్నాడు!"

వాడు కావాలని పడ్డాడా ప్రమాదవశాత్తూ పడ్డాడా అని ఎవరూ అడగలేదు. ప్రమాదవశాత్తూ అని అందరికీ తెలుసు. లారీకిందపడి బ్రతికే ఉన్నాడా అని మా మావయ్య అడగలేదు. వాడిప్పట్లో చావడని మావయ్యకీ తెలుసు.

"ఎంత చల్లని, తియ్యని కబురు విన్నారా! మనదగ్గిర సొమ్ములేదుగాని యింత సంతోష సమయంలో ముందు టీపార్టీ చేసుకుని తరువాత సినిమా పార్టీ జరగవలసిన మాట! సరేలెండి, మన అదృష్టవశాత్తూ కాస్త గట్టిదెబ్బే తగిలిందా?"

"గట్టిదెబ్బేమిటి, మా చెయ్యి ఎగిరిపోతే? పెద్దాసుపత్రిలో జాయిన్ చేశారు. ప్రస్తుతం ఒంటిమీద తెలివిలేదు, మూలుగుతూ పడుకున్నాడు"

ఆ వరసని ఆంజనేయులు రెండు వారాలుపైగా ఆసుపత్రిలో ఉన్నాడు. మిత్రబృందం రెండు మూడుసార్లు వెళ్ళినా వాడ్ని కలుసుకోడానికి కుదరలేదు. ఆఖరికి రేపు డిస్చార్జి చేస్తారనగా మావయ్యా, శిష్యులూ వాడ్ని ఆసుపత్రిలో కలుసుకున్నారు. అతనికి దూరపు చుట్టముట, ఓ తలపండిన ముసలావిడ దగ్గిరుండి సేవ చేస్తోంది. మావయ్య మొదలుపెట్టేడు.

"ఏం ఆంజనేయులూ, చాలా పెద్దదెబ్బ తగిలిందిటా? నిజంగా నీగురించి విచారించని రోజులేదు."

ఆంజనేయులు కళ్లు విప్పేడు. ఏమిటో ఆశ్చర్యంగా కళ్లు పెట్టేడు.

"మీరు ఎవరూ అని అడుగుతున్నాడు" అంది కూడా ఉన్న అవ్వ. ఆమాట వినేసరికి ఎవరికీ ప్రాణాలు లేవు.

"అదేమిటి ఆంజనేయులూ? నేనూ, లక్ష్మీకాంతాన్ని. ఇదుగో వీడు ఏడుకొండలు. మనందరం స్నేహితులం కామూ? నువ్వు మమ్మల్ని మరిచిపోడమేమిటీ? ఆశ్చర్యం! ఎలాఉందీ వంట్లో? మేం జ్ఞాపకానికి వచ్చామా?"

"లే - దు" అన్నట్టు సంజ్ఞ చేశాడు వాడు.

"అదేమిటి అవ్వగారూ! మేము ప్రాణస్నేహితులం"

"ఏమో బాబూ, స్వయంగా తోచిందో, ఏ వెలితక్కువ వెధవలయినా చెప్పి పెట్టేరో యిట్టే కారుకింద పడ్డాడు. అతి కష్టం మీద శరీరం దక్కిందిగాని ఆ దెబ్బకి తట్టుకోలేక బుర్ర చెడింది. బొత్తిగా లేని వాళ్ళం - ఈ స్థితిలో ఏ పత్రిక వాళ్ళకి దయగలిగిందో ఎనిమిదివందలు పంపించారు. విశాఖపట్నం వెళ్ళి బాగు చేయించుకోవాలి"

ఇంత హీనస్థితిలో మావయ్య ఊరుకోలేకపోయాడు. జరిగిందంతా 'గజేంద్ర మొర'లా అవ్వకి చెప్పుకున్నాడు. కూడా వచ్చిన శిష్యులు తాళం వేశారు.

"వాడు చెప్పందే నా చేతిలో ఏముంది నాయనా, నేనేం చెయ్యగలనూ? అయినా యిలాంటి వాటిలో రాతకోత ఉంటాయంటారు, చూపించండి. నేనుగాని మా అంజిగాడుగాని ఎవళ్ళకీ యింత పిసరు అన్యాయం చెయ్యడం ఎరగం" మావయ్యకి కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. ఆఖరుసారి గద్గదకంఠంతో అన్నాడు.

"చూడమ్మా ఆంజనేయులూ, ఒక్కసారి నన్ను చూసి గుర్తించు. నేనూ లక్ష్మీకాంతాన్ని - మనం నల్లచెరువు మెట్లదగ్గిర కలుసుకునేవాళ్లం కదూ?"

ఆంజనేయులు మొహం చిట్లించాడు. కోపంగా చూశాడు.

"వాడికి కోపం తెప్పించకూడదని డాక్టరుగారు అన్నారు. మీరెవరో వాడు ఎంతమాత్రం గుర్తించలేదు. మళ్ళీ కలుసుకోవచ్చు వెళ్లండి."

ఇంకా వాళ్ళని వర్ణించడమెందుకు? అందరూ వెళ్ళిపోయారు. ఈ కథ యిక్కడితో ఆగిపోతే అంతమే లేదు. తరువాత జరిగింది వినండి. వాళ్లలా వెళ్ళనిచ్చి ఆంజనేయులు లేచి కూర్చున్నాడు.

"ఎంత చక్కగా చెప్పావే మామ్మా!" అన్నాడు సంతోషంగా.

"లేకపోతే? ఇంత దెబ్బ నీకు తగులితే ఆ వెధవలు పంచుకుతింటారా? అసలు మా నాయన బతుకుతాడనుకున్నారా?" కనుకొలుకులు వత్తుకుంది.

"నువ్వన్నట్టు విశాఖపట్నం పోదామే మామ్మా, కిళ్ళీకొట్టు పెట్టుకుంటాను". ఓరి ఆంజనేయులు, ఎంత దురాలోచనరా నీది! అయ్యో లక్ష్మీకాంతం మావయ్య, నీ తెలివంతా ఏమైపోయిందయ్యా!

(వోడ్ హౌస్ ఆధారంగా)

★

# బదిలీతో కదిలిన సత్యం

## ఘట్టి కృష్ణమూర్తి

పాతర్లపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అక్కణ్ణించి బదిలీ అయ్యారని సోదరులంతా వొక టీపార్టీ యేర్పాటుచేశారు. ఈ యేర్పాటులో ప్రధాన భూమికలు శతభిషం, పూర్వాభాద్రలవే అవాలి. దానికి ప్రబలమైన కారణంకూడా లేకపోలేదు; అది వారి శంభానుశాక్రమంలో వెలువడుతూ వుంటుంది.

కొత్తవారు వచ్చేవరకూ వేచి వుండకుండా ఇప్పుడే ఛార్జి వప్పగించి నాలుగు రోజులపాటు విశ్రాంతి తీసుకోవాలనుకున్నారు ప్రధానోపాధ్యాయులు కాశయ్యగారు.

అసిస్టెంటు హెడ్‌మాస్టరు, ముందు ఛార్జీ వొప్పగింత చేసుకోవలసినవారూ అయిన చైనులుగారొక సందేహం వెలిబుచ్చడంతో స్టాఫులో దుమారం లేగింది.

అసలీ కార్యక్రమం ఇప్పుడే ప్రారంభం కావడంలోని ఆంతర్యం యేమిటో తెలుసుకోవాలనే తపాతపా మిగతావారికి కల్గడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకనంటే దీనికంతకూ సంధాతలు, సంచాలకులు అయినవారుకూడా పై యిద్దరే అనే అనుమానం వారికున్నది.

ఎంతో కున్నితంగా మెలగిన వారికైనా వారలాటివారిని గ్రహించడం దుస్తరం. బాహ్యవేషాల పటాటోపం అనండి, ఆధ్యాత్మికచింతనలో వారికిగల అకుంఠిత దీక్షా ప్రభావం అనండి. ఏదో వొక శక్తి సంఘానికిగల పరిశీలనావధులను దాటించి వారికి రక్షగా వుంటున్నది. అది యేదీ కాదు; అందరితో మంచిగావుండి అవసరం వొచ్చినప్పుడు సందూలం తడుముదామనే అసాధ భూతితత్త్వం వారిలో గూడుకట్టుకొని వున్నదని వారికి సన్నిహితులైన కొందరు తీవ్రవాదులు నినదిస్తూవుండడం కూడా యీమధ్య పరిపాటైపోయింది.

అదనుకోసం అణగివున్నవారిలో కొందరు యీనాడే 'మాటల కూపుల మాటలు' విప్పుకొంటున్నారు.

వీరందరికీ అధినేతగా వుండవలసిన కాశయ్యగారిది అదోక విచిత్రమైన ప్రకృతి. వారి కళ్ళల్లో కురిసేది కరుణరసమో కార్పణ్యమో కనుగొనాలంటే యెవ్వరి తరమూ కాదు. వారసలు యెదటి వ్యక్తితో కళ్లు విప్పి మాట్లాడరు. పళ్ళు బిగించే పరిస్థితి వచ్చినా, వొళ్లు మరచిపోక విషయాంతరంలోకి మళ్ళించి, పెదవులపై పారాడే వాడి నవ్వుల పిలికలతో ఇట్టే సమాధినిష్ఠులు కాగలరు; లేదా, నిరంతరం వారికి కూ స్తభూషణమై వుండే భగవద్గీతను తెరచి "యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ" అని అస్యాక్రాంత మనస్కులై ఆకాశం చుంబించే ఆధ్యాత్మిక వెల్లువలో తెప్పలా తేలిపోగలరు.

వారికా స్థితి రానే రాకూడదు; వచ్చిందా యింక భూప్రజల భూషణ దూషణలతో నిమిత్తం లేదు. అవన్నీ అనిత్యమైన శరీరానికి మాత్రమే తాకుతయ్యని వారి ఆత్మవిశ్వాసం. ఏదైనా క్లిష్ట సమస్యలకు పరిష్కారం కావలసివచ్చినప్పుడు, డబ్బువిషయంలో లెక్కలు తేల్చవలసివచ్చినప్పుడు తరచుగా వారికిలాటి సమాధినిష్ఠ కలుగుతూ వుంటుంది.

మరి, వీరికీ శతభిషం పూర్వాభాద్రలగారలకూ గల ఆంతర్యం యెక్కడ అంటే నలుగురియెదటా సమాధి కలిగించే సంగతులేవో గుర్తించి వాకచక్యంతో దాటించుకుపోవడంలోనే అంటారు కొందరు మనస్తత్వపరిశీలనా నిష్ణాతులు.

అసలు కార్యక్రమం మొదలవాలి, ముందుగా మాట్లాడవలసినవారెవరు? ఒకరు పేరుపెట్టి నిర్దేశించకపోయినా ఆ హక్కు స్థానాన్నిబట్టి శతభిషంగారికే సంక్రమించాలి న్యాయంగా. ఇదివరకు చాలా సభల కధ్యక్షత వహించి వాక్సమత్కృతి కంటే మిన్నయైన అధికారపాటవంతో ప్రజానీకాన్ని ఉర్రూతలూగించిన వారికి, అయిదు పచ్చీల అసందర్భపు సభ్యత్వంగల యీ సమావేశాన్ని నిర్వహించుకురావడం వొక లెక్కలోది కాదు.

కుర్చీలోనించి లేచి గుండెలు సవరించుకుని, ఉత్తరీయం సారించుకుని సమగ్రమైన వాక్పటిమను కూడదీసుకుంటూ "సోదరులారా!" అన్నారు.

వారి యీ సంబోధన యెంత గంభీరంగా వున్నదంటే, తొలి మేఘపు తొలి గర్జనకు బెదరిన లేళ్ళ పదుపులా యీ సభ అంతా తనమీదకే చూపులు పరపివుంచాలన్నంత శక్తివంతంగా వున్నది. కాని అనుకున్న దానికి విపరీతం జరగడంలో శతభిషంగారి గొంతానికి దెబ్బ తగిలినట్లయింది—

అయినా తనంతటివాడు తనుగదా! అందరూ యిటు చూడడానికి బదులు వారిలో వారు ఏదో నిర్లక్ష్యంగా సంప్రదించుకోవడంతో మరోమారు గొంతు సవరించుకొని, ద్విగుణీకృతమైన స్వరగాంభీర్యంతో తిరిగి అన్నారు. "సోదరులారా" అని.

అంతవరకూ ఆటు వేపుకే తలతిప్పి యేదో పట్టుదలగా వాదిస్తున్న పరశురామం ప్రతివచనం పలకటంతో అందరూ యిటు తిరిగి చూశారు.

ఉన్నవాడు ఉండలేక యిలా అన్నాడు పరశు. "ఆమాట వింటే పాడు మహా చెడ్డ కంపర మెత్తుకొస్తుంది సుమండీ! ఎవరో రాజకీయనాయకుడు ఎలక్షను ప్రచారం ప్రారంభించినట్టుగా వుంటుంది." అని— ఆమాట యెకాయెకీ అనకుండా ప్రక్కవాళ్ళతో అన్నాడు. ఆయనా అందుకుని "ప్రస్తుతం మన వ్యవహారం అంతకంటే భిన్నంగా లేదుకదా" అనటం విన్నాడు శతభిషం. ఆగ్రహావేశాన్ని అణచుకుని నుంచున్నందుకు లాంఛనంగా యేదో వొకటి చెప్పాలి కనక యిలా మొదలెట్టాడు—

శతభిషం: ఈ సమావేశం యెందుకేర్పాటైనదో మీకు తెల్సు. గత అయిదారు సంవత్సరాలనించీ మన పాఠశాలను కడు సమర్థతతో నడిపించి, ఇంతటి వున్నతికి తెచ్చి, ఇప్పుడు కొన్ని ప్రత్యేక కారణాలవల్ల మరో గ్రామానికి బదిలీఅయి వెళ్లుతున్న హెడ్‌మాష్టరు కాళయ్యగారిని మన అందరి తరఫునా అభినందిస్తున్నాను. వారితో కలిసి పనిచేసే భాగ్యం కల్గినందుకు గర్విస్తున్నాను.

పూర్వాభాద్ర: శతభిషం గారన్న దానితో మనస్ఫూర్తిగా యేకీభవిస్తూ తిరిగి త్వరలోనే మన హెడ్‌మాష్టరుగా రిక్కడికి చేరుకోగలరని ఆశిస్తున్నాను.

పరశు: వెళ్ళుతున్నందుకు విచారంగానే వున్నది. అయినా తప్పని పరిస్థితి, ఏం జేస్తాం మరి?

గౌతమ: నాకూ చాలా విచారంగా వున్నమాట ఖాయం, కాని మన చేతుల్లో యేమీ లేదుగదా!

గోవిందం: ఉన్నంతలో యథాశక్తి అందరమూ కలిసివుండాలనిమాత్రమే నాకు తెల్సు. ఆపైన అంతా దైవాధీనం—

ఇంతవరకూ నిల్చునేవున్న శతభిషంగారు కాళయ్యగారి సరసనేవున్న కుర్చీలో కూర్చున్నారు.

మారీచ: అసలు నేనీ సందర్భంలో మాట్లాడా లనుకోవడంలేదు, ఉన్నవన్నీ పెద్దలే సెలవిచ్చేశారు గనక. కాని బాల్య చాపల్యం నన్ను ముందుకు నెట్టుతోంది. మీకందరికీ కోపంగా వుంటుందంటే మానేస్తాను.

శత: ఇంక చాల్లే వూరుకో!—అధికార కంఠంతోనూ, చొరవని పురస్కరించుకునీ అన్నాడు.

"అతి ఊరుకొన్నా నే నూరుకోలేను, అయ్యా! ఇప్పుడో కాసేపో ఆగి ఛార్జీ వొప్పగించుకోవాల్సిన వాణ్ణి నేను కనక కొన్ని ఆంతరంగిక విషయాలు అడక్క తప్పడంలేదు" అన్నారు చైనులుగారు పట్టుదలతో మొహం బిగించి. ఏదైనా వివాదగ్రస్తమైన విషయం వచ్చినప్పుడు వారి మొహం సహజంగానే రంగు ఫిరాయిస్తూ వుంటుంది!—

"మరి యిప్పుడు బహిరంగంగా యేకరువు పెట్టడంలో మీ వుద్దేశ్యం?" అంటూ బాధ్యతగల వ్యక్తిలా ప్రశ్నించాడు పూర్వాభాద్ర. మెడలోవున్న బిళ్ళమడత ఉత్తరీయం సవరించుకుంటూ కళ్లు పెద్దవి చేసి అందరివంకా కలయజూశాడు. చైనులుగారిలా సమాధానం చెప్పారు—

చై: క్షమించాలి, సోదరు లనుకొన్నట్లు నాకేమీ దురుద్దేశంలేదు. తిరిగి మరొకరికి సమాధానం చెప్పవలసినవాణ్ణి కనక ఖచ్చితంగా తేల్చేసుకోవాలనుకుంటున్నాను. డబ్బుతో కూడిన వ్యవహారం గెవరు పైన వేసుకుంటారు?

శత: మీ నెత్తిన ఇప్పుడేమీ కొండంత బరువు పడలేదు దేనికీ కంగారు?

చై: కొండలూ, బండలూ మోయగల తాహతులేదు కనకనే—

"నికరంగా వచ్చిన లాభమేమిటో లెక్క జెప్పమనండి!" అని వ్యవహారం తేల్చెయ్యాలనే ధోరణిలోనే అన్నాడు పరశు. కాని కట్టెలు యెగసనదోసినట్టయింది. ఎలాగో సర్దుకోవాలని పూర్వాభాద్ర అన్నాడు—

పూర్వా: వచ్చిన లాభానికీ ఖర్చుకీ సరే పోయింది. కాకపోతే ఇంకో యాభైయేదుం బావలా మాత్రం వసూలు కావలసివున్నది. అది రాగానే స్కూలుకింద జమకట్టేయగల్ను. దీని కింత రభసచేసుకుని యిక్కణ్ణించి వెళ్ళబోయేవారిని యింత హైరానపెట్టడ మెందుకూ? అంతగా అయితే ఆ యాభై నామీద పడేయండి!

గౌతమ: మీరు తగ్గండి మహాశయా! ఇది మన సొంత సొమ్మైతే యిష్టం వచ్చినట్టు సొసలాయించుకోవచ్చు. ఎవరి జేబులో వున్నా యిద్దరూ కలిసి కాఫీ సేవించవచ్చు.

పరశు: అవును, ఇది సంస్థ తాలూకుది అందులోనూ పిల్లల పుస్తకాలకని వసూలుచేసి కంపెనీవా రిచ్చిన పర్సెంటేజిలో మిగిల్చింది. ఇందులో గారడీలు, బురిడీలు పనికిరావండి సార్!—రహస్యం బైటపెట్టాననే ధీమా అతని మొహంపై ముద్ర వేసినట్టుగా కనబడింది—

చై: అందుకే నేనింత ఘట్టిగా అడగడం జరిగిందనుకోండి! లెక్కలు తేలకుండా వాకిట్లోకి వెడితే కాకిని పొడిచినట్టు పొడుస్తారా, మరేమైనా వున్నదా? ఏం ఖర్చు వెలిగించామని రొమ్ము విరుచుకు చెప్పమంటారు?


శత: మీరు రొమ్ములు విరుచుకోనవసరం లేకుండానే మేం చెప్పకోగలం. అది మాకు వదిలెయ్యండి!

చై: అయితే మీకే ఛార్జి వొప్పగించుకోండి!

పూ: వల్లకాదు, సీనియర్ యల్. టి. వుండగా వారు వప్పగించుకుంటే యెవరికి నామర్దా అంటారు?

మా: చిత్రం చిత్రం! మీ నిఘంటువులో యీనాటినించీ కొత్తపదాలు చేరుస్తున్నట్టున్నారు?

—వెంటనే సమాధినిష్ఠులయిన కాళయ్యగారి నుద్దేశించి వారికి వినబడాలన్నంత



"యెలుతురంతామేసి
యేరు నెమరేసింది"

ఫొటో: బి. అప్పారావు - మద్రాసు

# ★ బదిలీతో కదిలిన సత్యం ★

బిగ్గరగా యిలా అన్నాడు గోవిందం—"ఇంతకీ యిదంతా మన కంఠశోషేనా? వారు చెప్పేదేమైనా వున్నదా?" అని.

పరశు: అవునండోయ్, అసలు వారిని మర్చిపోయి మనలో మనం తన్నుకులాడు తుంటున్నాం.

సై: ఎవ్వరు చెప్పినా నే నడిగినదానికి ప్రత్యుత్తరం సక్రమంగా రాకపోతే యీ బాధ్యత పైన వేసుకు నేమాట నున్న—

"ఇంత చిన్న విషయాని కిలా బిర్రబిగి యడం నాకు నచ్చలేదు" అన్నాడు పూర్వాభాద్ర. ఎక్కౌంట్లు అడిగితే దాని నంత తేలికగా తీసిపారెయ్యా లనుకుంటే యెవరికి వొళ్లు మండదు? ఆ కోకలో నే యిలా అందుకున్నాడు మారీచ—

మా: మీకు ఏనాడు ఏది నచ్చింది? అయినా అడ్డమైన లెక్కలూ వద్దన్నా పైన వేసుకుని వివరాలు చెప్పమంటే అంత తత్తరబిత్తర లాడతా రెందుకూ? కొకుల్ని కాటి గద్దలకు వేసినట్టు కుర్రకుంకలదగ్గిర వసూలుచేసి జమా ఖర్చులు చెప్పమంటే జానెదేవ్ అంటాలేం?

శత: సోదరుడు తొందరపడి మాట్లాడు తున్నాడు.

మా: తొందర మాటలు నావి కాదు, మీవి.

పరశు: ఇంతసేపణ్ణించీ మనం మల్లా గుల్లాలు పడుతున్నా వారు మాట్లాడకపోవ డానికి కారణం?—ఈ మాట కచ్చగానే అడిగాడు—

మా: మరేముందిలే, చిత్తుకాయితాల బుట్టలో పడ్డ చెత్త బిల్లుల సంగతి అయి వుంటుంది—యీ మాటకు వెనకటి చరిత్ర కొంత వుండడంవల్ల కొందరు పకాలున నవ్వారు. శతభిషం ఉగ్రుడై మందలించ బోయాడు.

శత: మీరంతా బాధ్యత అనేది తెల్సు కోకుండా కుర్రతనంగా మాట్లాడుతు న్నారు. ఎవ్వరితో మాట్లాడుతున్నారో కూడా గుర్తించడంలేదు—

పరశు: తెల్సుకునే వున్నాం మహాశయా! తమ దయవల్ల ఇంకా మా కంత మైమరపు రాలేదు—అంటూ కొళయ్యగారివంక జూశాడు. ఇంక లాభం లేదనుకొన్నారో యేమో ఆయనా ఉపక్రమించారు—

కాళ: అయ్యా, నాదొక మనవివున్నది.

మా: వినుడు! వినుడు!!

కాళ: గౌరవసభ్యుడు నిజంగానే బాల్య చాపల్యంతో భాషిస్తున్నాడు. దీనిని వగులుకుని త్వరలో అభివృద్ధికి రాగలడని నా ఆశ.

గా: శతమానం భవతి శతాయుః.

కాళ: ఇందాకణ్ణించీ పరధ్యానంలో వుంటున్నందువల్ల మీ మాటలు అంతగా పట్టించుకోలేకపోయాను. అసలు విషయం—చైనులుగా రడిగిన లెక్కలసంగతి సబ బైనదే అంటాను. కాని దాని కింతకీ బాధ్యులెవరో మీరూ ఆలోచించాలి. నాకు అంతరంగికు లైనటువంటి శతభిషం, పూర్వాభాద్రలగారల నే అందుకు నియమిం చాను. జమాఖర్చులు తయారుచేసి అట్టే పెట్టారు. ఇంకా చాలావరకూ వసూలు కావలసివున్న దని పూర్వాభాద్ర చెప్పినట్టు గుర్తు—ఇద్దరికీ మాట తభావతు రానే వచ్చింది, అది వారి సమాధిఫలితమో, లేక తగినంత ముందుజాగ్రత తీసుకోకపోవడం వల్లనో-ఏమైనా కప్పెట్టుకోక తప్పదుగా! పూర్వాభాద్ర ఆ మాటనే పునశ్చరణ చేసు కుంటున్నాడు.

పూర్వా: చాలా దొక్కడండీ, యూభై రెండుంబావల.

పరశు: గొప్ప సత్యమిది, గొప్ప సత్య మిది తెలుసుకోండయా! తెలుసుకోం డయా!!

శత: వేళాకోళాలకీ వెక్కిరింతలకీ ఇది బజారు మీటింగ్ కాదు భాయీ!

మా: చిత్తం, అర్థమౌతూ నేవుందిగా, ఇర వయ్యోశతాబ్దపు ఇనపచదువుల మీటింగ్, అని.

గా: తెలియక అడుగుతున్నాను, దేవర వారు ఆగ్రహించకండి! బల్లపైనున్న బిల్లుకాయితం బుట్టలో పడడం, దాని స్థానే మరొక సంఖ్యతో కొత్తజాబితా అవతరించడం యెలా సంభవించిందంటారు? అంటూ సత్యాన్ని సరాసరి బైటపెట్టించా లనే తలంపుతో సూటిగా అడిగాడు. అనం తరం కాళయ్యగారు మాట్లాడారు. కాని అది అడిగినదానికి సమాధానం మాత్రం కాదు—

కాళ: అవన్నీ పరిజూసుకుని సమాధాన పడవలసినవాణ్ణి నేను, నీకెందుకయ్యా యీ కంఠశోష? అయినా మనకిప్పుడు మాటల్తో పనేమిటి? చేతలు కావాలి!

పరశు: చేతులు కాలుతున్నై మహాను భావా, నీతుల చెట్లనించి ఆకులు తుంపుకు రండి!

కాళ: ఇంతకాలం కలిసి విడిపోతు న్నందుకు నాకూ విచారంగానే వున్నది. కాని యేం జేస్తాం?—వారిలో వున్న విశే షమే అది. వారి ధోరణి వారిదే గాని యెదటివారి మాట విన్పించుకోరుగా!—

చై: నే నడిగినా లెక్కలు చూపకపోవడం నాయెడల పెద్ద అపచారంగానే వున్నది.

పరశు: లెక్కలు చెప్పకపోవడం ఇక్కడి వారి కొక ఆచారంగా ఉన్నట్టున్నది—అయితే యేదో వొక దృఢ నిశ్చయానికి రావాలి గనక ముందు వచ్చేసి తరవాత ఇలా అన్నారు చైనులుగారు—

చై: అది తేలనిదే నేను ఛార్జీ వప్పగించుకోనే మాట సున్న.

గో: అసలు వారు అప్పగించే మాటమున్నా.

మా: ఈపళాన అప్పగిస్తే మనం విప్పలేమొక పన్నా — అనగానే శతభిషంతో యేదో జనాంతికంలో గొణిగి ప్రకాశంగా యిలా అన్నాడు కాశయ్యగారు—

కాశ: లేకపోతే ఆ వొచ్చే ఆయనకే స్వాగతం చేసిపోతాను.—వెంటనే ఆయనగారికి వందపలికే బాధ్యత పైన వేసుకుని—

శత: కనక మన హెడ్‌మాష్టరుగారు వెళ్తున్నందుకు నేనెంతో హృదయభారంతో వీడ్కోలిస్తున్నాను— అన్నాడు.

పూర్వా: మీరందరూ కూడా అలాగే అనుకుంటారని భావిస్తున్నాను.

పరశు: అందరి మాటా అలా వుంచమని విన్నవిస్తున్నాను—మాట చిన్నదే అయినా వ్యక్తిత్వం ప్రదర్శించాలని అన్నట్టున్నాడు.

గౌతముడు ఊరుకోక అంతం కాబోయే కథాభాగానికి బిందువును కూర్చినట్టుగా ఇలా అంటించాడు—

గౌ: పుస్తకాల ఎకౌంటులో సుస్తీ చేసినందుకు విలపిస్తున్నాను.

చై: ఇదంతా యిలాగే కొనసాగితే నేనూ మరొకచోటికి బదిలీ చేయించుకోక తప్పదని విన్నవిస్తున్నాను.

శత: ఇంకా మాట్లాడవలసిన అంశాలు లేవు కనక సభ ముగించాలని ప్రార్థిస్తున్నాను—అందుకు యెవ్వరూ వొప్పుకోకపోవడంవల్ల పరశురాం అసలు విషయంలోకి దిగాడు. మిగతా అందరూ తర్జన భర్జనల రూపంలో తుదివరకూ సంభాషణలు సాగించుకు పోతున్నారు.

పరశు: అసంపూర్తిగా ముగించి లేచిపోవడం సభా మర్యాదకాదని పాయింటాఫ్ ఆర్డర్ లేవదీస్తున్నాను.

మారీ: అయిదువందలకు పైగా పుస్తకాల ఎకౌంటులో లాభం మిగిలివున్నా వార్షికోత్సవం విరమించడానికి కారణమేమిటో తెల్పమని నిగ్గదీస్తున్నాను.

చై: దాని వివరాలకోసమే నేనింతసేపట్నించీ అఘోరిస్తున్నాను.

పరశు: ఈ సంవత్సరం మిగులు నూటపాతిక మాత్రం వున్నదని, వార్షికోత్సవానికి కనీసం అయిదువందలయినా ఖర్చవుతుందంటున్నారు. ప్రస్తుతం చందాలకు బయల్దేరినా మనయెడల సానుభూతితో గ్రామత్యావచ్చే దేమీలేదని వార్షికోత్సవం విరమించామంటూ పెద్దలు చెప్పే కారణాలు, తేక కుంటిసాకులు ఎవ్వరినీ వొప్పించలేవంటాను. చేసిన ఖర్చు లేవో లెక్క జూపకపోతే, ఇంటా బయటా కూడా చాలమందికి తిక్కరేగడం ఖాయమని హెచ్చరిస్తున్నాను—

గో: అసలు పిల్లలదగ్గర్నుంచి వసూలైన యీ మొత్తంలో మిగిలిన లాభంనించి వాళ్లకేమైనా దక్కిందా? పెన్సిలు ముక్కైనా ప్రైజుగా కొనియిచ్చారా? ఇదికూడా రసీదుల్లేని వసూళ్ళల్లో కలిసి అజాపజా లేక అడుగున పడిపోవలసిందేనా?

పూర్వా: మీ రనుకుంటున్నదంతా వట్టి భ్రమ. గిట్టనివాళ్ళ దుష్ప్రచారం ఫలితమే. అందులో దమ్మిడీ యెవ్వరూ పంచుకోలేదని ఒట్టు వేసుకు చెబుతున్నాను.

చై: అయినప్పుడు అకౌంట్లు చూపించడానికి యింత రాద్ధాంత మెందుకు? అదేదో నా మొహాన పారేస్తే ఛార్జీ వొప్పగించుకుందునుగదా!

శత: పుస్తకాలకని వసూలు చేసినంత మాత్రాన నూటికి నూరుపాళ్లూ వారిచ్చిన పర్సంటేజిలో మిగులుతుం దనుకోవడం పొరపాటు. ఛార్జీలు, లగేజి, ఇవ్వన్నీ సరి జూసుకోవద్దూ? మిత్రుడు పూర్వాభాద్ర అన్నట్లు గిట్టనివాళ్ళు కొందరు – దీనిలో సంబంధంలేని అసంబంధంగాళ్లు కూడా - గోరంతలు కొండంతలు చేసి చెబుతూ వుంటారు.

పరశు: అయ్యా మీరన్న లగేజీలకే ఒకప్పుడు నూటపది ఖర్చైనదని బల్లమీద బిల్లు పెట్టి వ్యవహారం ఆలోచిస్తూ వుండడం కొందరు చూశారు. మొన్నాటికల్లా దానిని చింపి చిత్తుకాయితాల బుట్టలో వేసి - ఆ మొత్తానికి మరో అరవైయైదు అధికంగా కలిపి ఇంకొకటి తయారు చేయించడంలోని ఆంతర్యం ఏమైవుంటుందంటారు. మా కళ్లే మమ్మల్ని మోసం జేశాయంటారా?

మారీ: దమ్మిడీ అయినా పంచుకోలేదని దేవుడిపైన ఒట్టు వేసుకు చెప్పినవారు దీనికేమంటారూ...

గో: మరేమంటారులే "ప్రమాదో ధీమతామపి"— ఇక్కడికి రాబోయేవారెవ్వరో ముందుగానే తెల్సుకుని కొందరు వారి సానుభూతి సంపాదించడానికి కనీసం రెండురోజులలో ఉత్తరం వ్రాస్తున్నట్టు గాలిగాడి తాజా వర్తమానం! ఇది నిజమే అయితే 'యింటిగుట్టు లంకకి చేటన్నట్టు, ఇక్కడి వివరాలన్నీ వారికి వ్రాయడం నకిలీ పరిపాలనకు వకాలత్తు యిప్పించుదామనేనా? మరేదైనా వున్నదంటారా?

మారీ: బోర్డువారు ఇక్కడికి వేస్తూ కిరీటం లేని రాజుగా వ్యవహరించమని తమ కాదేశించినటు వారే వొక సందర్భంలో తమ నోటితో ఛలోక్తిగా చెప్పకున్నారు కూడా.

గో: అయితే మధ్య మనం నలిబలి అయిపోవడ మెందుకూ? మన పాత్ర లేమిటో కూడా నిర్ణయం చేసుకోవడం ఉత్తమం కాదూ?

శత: మైకంనించి తేరుకున్నట్టు—సోదరులు పొరబడుతున్నారు. ఆయనకీ నాకూ దాదాపు పదేళ్ళ పరిచయం వున్నది. ఇక్కడ తగిన యేర్పాట్లు చెయ్యమని నాకు ముందుగా వ్రాశాడు. దానికి సమాధానం మాత్రమే నా వ్రాత.

కాశ: అబ్బా, ఉన్నట్టుండి యెంత దూరం పోతున్నారయ్యా? దేనికి, మనలో మనకీ లకలుకలు?

పరశు: అంతేలెండి. యూనిఫారంగా జరిగినదానికి వొక్కడు కాదంటే మాత్రం అయ్యేదేముంది? కాకపోతే నోరూరుకోక......

చై: అడుగుతూవుంటాను. ఇలాంటి సంస్థల్లో బాధ్యత వహించేకంటే యేదో వొక మారుమూల గ్రామం పోయి తగినంతలో పనిచూసుకుంటూ కృష్ణా, రామా అనుకోవడం మేలు.

గో: ఎక్కడికి పోయినా యింతే మహానుభావా! నా గడ్డిపరకంత అనుభవాన్ని పురస్కరించుకుని చెప్పగల్గిం దేమంటే, కొలిముల్లేని యీ కార్ఖానాల్లో సమ్మెటపోటులూ సుత్తిదెబ్బలూ సర్వదా పరిపాటైపోయినయ్యని—

మారీ: బాగా అన్నావోయ్ భావకవీ! కాగాపోగా కితాబుల లెక్కలు ఏమి తేల్పవట్టు?

పరశు: సరిగా ఆన్సర్ వచ్చేదాకా మనం చెప్పిందే నిజమనుకుందాం.

చై: నాకూ అదే తోస్తున్నది.


పరశు: పైవారొచ్చి అడిగేదాకా పాతేస్తారు, ఆపైన నుయితేస్తారు. ఈలోగా మనకీ కొంత సామగ్రి పోగౌతుందిగా!

శత: ఎప్పటిలాగే యివ్వాళ కూడా గలభా చేసి, వారికింత నిరుత్సాహం కలిగించి కింకపర్చినందుకు నేనెంతో విచారిస్తున్నాను.

పూర్వా: నేనూ చాలా పరితపిస్తున్నాను.

పరశు: పాత సమస్యలే పాతుకుపోయినప్పుడు మనుషుల్లో కొత్తతరహా తెలావస్తయ్? యుగాలు గడచినా మనమింతే!

★




సీరియల్

"శారద"

## 40

శేఖరం కవరింగ్ గోల్డు వ్యాపారం పెట్టి మామగారికి స్థిమితం కలిగించాడు. పెట్టుబడి వృద్ధిచేస్తే బాగుంటుందనే ఆశ పుట్టించాడు ఒక్క సంవత్సరంలో. అయితే స్టాకు మాత్రం కదలలేదు; అంతా లెఖ్ఖల్లో కనిపిస్తోం దింతకీ. సరోజనిని అడిగి కొంత డబ్బు తీసుకుని అదే అమ్మకంగా కనపర్చాడు. మామగారెంత తెలివిగలవాడైనా, కూతురు ఇచ్చే డబ్బు సంగతి ఆయనకి అందకుండా చేశాడు శేఖరం. బందరులో అతనికి శీను అని ఓ స్నేహితుడున్నాడు. శీను, జూనియర్ పైల్వాను; వస్తాద్ గోవింద్ శిష్యుడు.

గురువుగారంటే శిష్యుడి కెంత గౌరవం వున్నా, తనకి తెలిసిన విషయాలు అవి 'రహస్యం' అనేసరికి ఇంకెవరికో ఒకరికి చెప్పకపోతే తల పగిలిపోతుందన్న మన స్తత్వం అతనిది. తనగురువు దగ్గిరున్న చక్కని అమ్మాయినిగురించి శేఖరానికి చెప్పాడు. వస్తాదు ఆమెనింక ఆట్టే రోజులు భరించలేడని శిష్యుడికి తెలుసు.

శేఖరం ప్రశ్నించాడు, "అమ్మాయి ఎవరు? ఎట్లా వుంటుంది?"

శీను చెప్పాడు "నేను రెండుమూడుసార్లు చూశాను బ్రదర్. ఎంత బావుంటుందో చెప్పలేను. ఆమెని—అక్కడ ఇంకెవరితోనూ పోల్చటం చాలా అన్యాయం. మిగతా జీవాలన్నీ, అలవాటయిన యంత్రాలు—నవ్వులో, నడకలో, మాటలో, అన్నింట్లోనూ. ఈమె అట్లా కాదోయ్! ప్రతి నిమిషం కొత్తగా వుంటుంది. మనస్సు వెన్నపూస. చాలా అడకువగా వుంటుంది: అట్టే మాట్లాడదు. ఎప్పుడైనా నవ్వుతుంది చాలా మెల్లిగా. నేను కుస్తీకి తయారీ తింటూవుండబట్టి గాని, లేకపోతే...నా.."

శేఖరం—సిగరెట్టు గొలుసుకట్టుగా తాగుతున్నాడు. "ఏవూ రేమిటి?" అని ప్రశ్నించాడు.

"ఏవూరైతే నీకు కావలసిందేమిటి?...నీవంటివాడి చేతుల్లో పడితే మహారాణిలా రాణిస్తుంది. కాకే ఒక్క చిక్కు"

"ఏమిటది?" శేఖరం నిరాశపడుతూ అడిగాడు.

"అప్పుడే గుడ్లు తేలేస్తావేం? డబ్బు సాధించని దేదైనా వుందా? వస్తాదు గోవిందు ఆమెని ఓ పట్టాన వొదలడు; డబ్బుకి గంజాయులాడైనా, సరే ఆమెని ఎట్లాగో తన వశంలోనే వుంచుకోవాలని మహాతాపత్రయ పడుతున్నాడు. మొగుడైతే ఏమోగాని, వుంచుకున్నవాడి దరిద్రంలో భాగానికి ఆమె వొప్పుతుందా?"

"అయితే—ఆమెకోసం ఎంత డబ్బయినా సరే ఖర్చుపెట్టిస్తానోయ్!..."

"అయితే ఇక ఇంద్రలోకమే! ఆ తర్వాత మేం కనపడతామా నీకు?"

"పోరా గురుద్రోహి! నిన్ను మర్చిపోయినా పాపంలేదు"

"గురువూ లేదు గంపాలేదు. వస్తాదుకు కుస్తీలో గౌరవమే తప్ప, ఇంక మిగతా వ్యవహారాలలో అంత ఛండాలుడులేడు; పెళ్ళాం బిడ్డలు ఉసూరుమని ఏడుస్తున్నారు; వాళ్ళ ఘోష చెప్పనలవి కాకుండా వుంది. ఈ వ్యవహారం వొదిలిపోతే—వస్తాదు ఒకదారి కొస్తాడని నా నమ్మకం. అదంతా సరే. ఓ పదిరూపాయలుంటే పారెయ్యి, చేబదులు"

"తీసుకోవోయ్. చేబదులనడ మెందుకు, మన్యా అదో మోసం!" అన్నాడు శేఖరం పదిరూపాయిల కాయితం ఇస్తూ.

మూడోనాటికి శేఖరం పద్మని బెజవాడకు తీసుకువచ్చేశాడు. ఆమెని మరొకంట బడకుండా సత్యనారాయణపురంలో ఒక ఇంట్లో చేర్చాడు. పనిమనిషిని ఒకదాన్ని కుదిర్చాడు. ఇంటికి కావల్సిన సమస్తం ఇచ్చాడు.

వ్యాపారం నిమిత్తం తను బందర్‌లోవున్నట్టు మామగార్ని నమ్మించటానికి అతని కాట్టే కష్టం అనిపించలేదు. కాని భార్యను నప్పించటం సాధ్యంకాకుండావుంది. "మీరు మళ్ళీ ఏదో చేస్తున్నారు. కొంప తీస్తారండి" అంది సరోజని.

"ఇంక బందరు వెళ్లనులే. మరి దగ్గిరవుండి పనిచేయించాల్సి వచ్చింది. లేకపోతే అంత జాగ్రత్తగా సరుకు బెజవాడ చేరదేనా?" అన్నాడు శేఖరం.

"ఏం సరుకు?" అంది సరోజని.

"ఇంకేం సరుకు? నకిలీ సరుకు."

"నగలా" అంది భార్య, అనుమానంగా.

"అవును. అవును. నువ్వెందుకే జబ్బుతోవుండి, వాట్లు అలవాటు చేసుకుంటావూ? మొదలకండా పడుకో, నీకేమీ ద్రోహం

చెయ్యనులే నేను. నీ కష్టమానం అదే తాపత్రయం!" అంటూ శేఖరం గదినుండి నిష్క్రమించాడు.

యధార్థంగా సరోజనికి శరీరంలో అస్వస్థత ఎక్కువైపోతోంది. దానికి కారణం మనోవ్యాధి. ఇట్లాగే ప్రాణంపోతే బాగుంటుందని ఆమె వూహా. దీన్ని తండ్రి గుర్తించకపోలేదు. మందు లిప్పిస్తున్నాడు. మందులు రోజుకోరకం మారుస్తున్నారు.

సుదర్శనం ఆశౌధికొగ్గె వుండికూడా, మనోవ్యాధితో, ఎల్లప్పుడూ పిచ్చెత్తినట్టు, కూతురు గదికీ తనగదికీ మధ్య తిరుగుతున్నాడిప్పుడు.

## 41

శేఖరం ఇప్పుడు సర్వకాల సర్వావస్థలయందు పద్మదగ్గిరే వుంటున్నాడు. ఆమె ఇల్లు చిన్నసైజులో ఇంద్రలోకంలా తయారైంది. అయితే ఏం? దాన్లో ఎక్కడో ఏదో లోపం కనిపిస్తోనే వుంది. శేఖరం యింట్లో వున్నా, ఆమె రోజులో ఎక్కువభాగం తన కూతురు లక్ష్మిని ముద్దాడడంలో గడుపుతుంది. లక్ష్మికింకా మాటలు రాలేదు. తై-తక్క-తై అని పడుతూ లేస్తూ నడుస్తూ సదా గోలచేస్తూవుంటుంది. అదొక్కటే—ఆ పాపమాత్రమే ఆమెకి నిజమైన ఆనందం. మిగతాఅన్నీ ఆమెదృష్టిలో కృత్రిమాలు, మిథ్య. ఆమెజాగ్రత్తగాఖర్చు పెడ్తూ డబ్బుదాస్తోందికూతురుకోసం. కూతుర్ని కొన్నాళ్లు పోయినాక ఎవరికన్నా అప్పజెప్పి ఈ వాతావరణంనుంచి శాశ్వతంగా తప్పించాలి. దానికి తగినవాడు భాస్కరావే. కాని అతనిదగ్గిరకి తను వెళ్ళడం ఎలాగ? ధైర్యంలేదు. తన ధైర్యాన్నంతా కూడదీసుకునికూడా, ఆనాడు, సినిమాహాల్లో అతన్ని చూసి మాట్లాడలేకపోయింది. స్వయంగా వెళ్ళి అతన్ని తను కలుసుకోటం అసంభవం—ఎట్లా ఈ సమస్య! ఆమె ఇలాగే ఆలోచనలో పడుతూ వుంటుంది అప్పుడప్పుడు.

మూణ్నెల్లకి శేఖరాని కొక తీరని సమస్య వచ్చిపడింది. అతను రోజులతరబడి పద్మదగ్గిరే వుండేందుకు వీల్లేకండా, సరోజినికి జబ్బు ముదిరిపోయింది.

భార్యని వొదిలివస్తే ఆర్థికంగా చిక్కులువస్తాయి. ఆమె సవ్యంగా వుంటేనే, ఆమె అనురాగం చల్లారకుండా వున్నంతవరకే తన ఆటలు సాగుతాయి. అటువంటప్పుడు, ఆమెని జబ్బుస్థితిలో వొదిలి, పద్మ ఇంటిదగ్గిరే వుండటం అసంభవమై పోతూవుంది.

మామగారు దిగులుపడిపోయి తనతో మాట్లాడ్డమే మానేశాడు—హంతకుడితో పలకడమే పాపం అన్నట్టు. కాని తన భార్య! ఆమె మంచితనం ఇప్పుడిప్పుడే అర్థమౌతూంది. అంత నీరసించిపోయినా, సన్నని గొంతుతో "ఏమండీ, నన్ను వొదిలిపెట్టి వెళ్తారా" అంటుంది, కళ్ళనీళ్ళు పెట్టుకుని.

"వెళ్ళను" అంటాడు శేఖరం; వెళ్ళాలనే కోర్కె బలంగా వున్నప్పటికీ.

సరోజిని అంత బాధలోనూ జ్వరంలోనూ మెల్లిగా నవ్వుతుంది. సంతోషంతో. తిరిగీ అడుగుతుంది; "మీరేమన్నా డబ్బుకి ఇబ్బంది పడుతున్నారా?" అని.

"లేదు" అంటాడు భర్త. ఆమె హృదయాన్ని బుద్ధిపూర్వంగా గాయపరిచే ధైర్యం, క్రూరత్వం కోలుపోయాడతను. వాటిని ఆమె నిజమైన అనురాగం కాల్చి భస్మం చేసింది. సరోజిని ముందు శేఖరం ఇప్పుడు మానవత్వాన్ని చవిచూస్తున్నాడు.

# మంచి - చెడూ

వారం రోజులపాటు ఆమెదగ్గిరే వుండిపోయి పరిచర్యలు చేస్తున్నాడు, మధ్యమధ్య పద్మ జ్ఞాపకం వచ్చినప్పటికీ.

భార్యబరువు రోజుల్లో వుంది. ఈలోగా స్థిరమైన ఆర్థిక సంక్షేమం ఏర్పాటుచేసుకోవాలి, అని అతని తాపత్రయం. కాని కుదురలేదు. ఎట్లాఅడగడం? భార్యని మామగార్ని అడగడం వృథా. అడిగితే మెడబట్టి బైటికి నెట్టుతాడు. అంత చిర్రిలో వున్నాడా మనిషి. మాట్లాడితే కరవొస్తున్నాడు. ఆయన శాంత సౌమ్యంగా వుండేది కూతురు సమక్షంలోనే. శేఖరం బోనులో పడ్డ ఎలకలా బతుకుతున్నాడు. ఏమీతోచదు. మాటిమాటికీ భార్యవంక చూస్తాడు. రోజురోజుకీ క్షణక్షణానికీ కాంతి హీనమౌతూన్న ఆమెకళ్లల్లో తనమీద వాత్సల్యం ఇంకా తగ్గలేదని తెలుసు. కాని ఏంప్రయోజనం! ఆమెలేని క్షణాన తిరిగి తనకి దిక్కారితనం తప్పదు. అప్పుడింక ఎవరడుగుతారు "ఏమండి, డబ్బుకేమైనా ఇబ్బందిపడుతున్నారా?" అని? ఇనప్పెట్టె తాళాలు తనకిచ్చి "తీసుకోండి, మీకు కావలసింది" అని ఎవరంటారు? ఆమెని తను ఎంత ద్వేషించాడో, తన నామె అంతగా ప్రేమించింది; ఇంకా ప్రేమిస్తోంది; తుది క్షణంవరకూ ప్రేమిస్తుంది. ఆమె రాసిచ్చినా చెల్లదుగదా! దాన్ని మామగారు, ఆమోదించాలి గదా! కాని తను ఈ క్షణం వరకూ డబ్బుకోసమే ఇక్కడకువచ్చి భార్యను చూస్తున్నాడు, లేకపోతే వచ్చేవాడేనా! శేఖరం సరోజని మంచందగ్గిర కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు.

ఆమె రూపానికే ప్రాధాన్యం ఇచ్చి ఆమెని అసహ్యించుకున్నాడు. దానికి అలవాటుపడ్డాడు.

సరోజని బలహీనంగా చెయ్యిచాచి, కుర్చీ చేతిమీదవున్న శేఖరం చెయ్యి పట్టుకుని, "దిగులుపడుతున్నారా?" అంది హీన స్వరంతో.

"ఏమిటి?...లేదులే" అన్నాడు శేఖరం.

"మీరు...దిగులు పడకండి...నాన్నకి చెబుతా......మీరు లోటు...లేకండా...చెయ్య...మని"అంది సరోజని, రొప్పుతూ.

"నువ్వు వూరుకో. మాట్లాడకు. ఆయాసం ఎక్కువౌతుంది" అన్నాడు శేఖరం. తన భార్య తన వుద్దేశం గ్రహించినందుకు ఆశ్చర్యపడుతున్నాడు. ఇంత తీవ్రమైన జబ్బులోకూడా తన సంగతి ఆలోచిస్తోంది! ఈమె మనిషా, దేవతా? అందులోనూ, తనను రంపపుకోత పెట్టిన వ్యక్తినిగురించి! శేఖరానికి మొదటిసారి—జీవితంలోనే మొదటిసారేమో—కన్నెంట నీళ్లొచ్చాయి.

అతని కంఠం రుద్ధమైపోయింది. అతనిలో మానవత్వం స్వార్థాన్ని అణిచివేసింది. "సరోజని, నేను ద్రోహిని, సరోజని! నామీద, నువ్వు ఇంకా దయచూపడం అన్యాయం. నేను నిన్ను పెట్టిన బాధలకి శిక్ష అనుభవించవద్దా! నాకేమీ వద్దు సరోజని!" అంటూ అతను ఆమె రెండు చేతులూ పట్టుకున్నాడు.

సరోజని కళ్ళల్లోనూ నీళ్లు నిండాయి. ఆమె మాట్లాడాలని ప్రయత్నిస్తోంది, కాని, మాట్లాడలేకపోతోంది. 'వూరుకోండి' అని చేత్తో సౌజ్ఞ చేసింది. శేఖరం ఆమె చెప్పినప్రకారం కుర్చీలో కూర్చోబోతుండగానే సుదర్శనంగారొచ్చారు. సరోజని ఆయాసంతో వెక్కుతోంది; మెలికలు తిరిగిపోతోంది. తన భర్తని అన్యాయం చెయ్యొద్దని తండ్రితో చెప్పాలని ఆమె తహతహపడుతోంది. కాని మాట్లాడలేకపోతోంది. సుదర్శనంగారు శేఖరాన్ని చూసి, "ఫో—ఫో—డాక్టరుకి ఫోన్ చెయ్యి, అర్జంటుగా రమ్మని. చూస్తున్నావేం?" అన్నాడు ఉగ్రుడై. శేఖరం వెళ్ళాక కూతురుపక్కనే కూర్చుని, "ఏమమ్మా, బాధగా వుందా తల్లీ!..." అన్నాడు ఏడుపు దిగమింగలేక.

కాని సరోజనికి మాట్లాడే శక్తి లేదు. ఆమె జవసత్వాలు, అరిపోయే స్థితిలో వున్నాయి. నూనె అయిపోయి, ఆఖరున వత్తి నించి వచ్చే నీలివెలుగులా, సరోజని కళ్లలో కాంతి స్వల్పంగా మెరుస్తోంది; ఆమె తన శక్తినంతా కూడదీసుకుని తండ్రితో మాట్లాడాలని ప్రయత్నిస్తోంది. "నాన్నా" అంది, చాలా హీన స్వరంతో.

"ఏమిటి తల్లీ, చెప్పు" అన్నాడు తండ్రి ఆమె నుదురు చేత్తో సవరిస్తూ.

"అల్లుడుగారికి......" ఆమె మాట్లాడలేకపోతోంది. ఆమె శక్తి ఆఖరైంది. తండ్రికి అల్లుడంటే కోపం.

"నిన్నీ స్థితిలో కూడా డబ్బడిగాడా రాక్షసుడు! రానీ చెబుతా" అంటున్నాడాయన. ఆయనకేం తెలుసు, తన కూతురి వాత్సల్యం, హృదయ నైర్మల్యం!

అది కాదనీ, అతని కన్యాయం చెయ్యొద్దని చెప్పాలనీ, సరోజని లోలోపల చాలా బాధపడింది ఐదు నిమిషాలు. శేఖరం డాక్టరూ, గదిలో అడుగుపెట్టిన క్షణాన, శేఖరం ఆమె దగ్గరగా వచ్చి ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకోగానే, ఆమె పరమ శాంతితో కళ్లు మూసింది. డాక్టర్ మాట్లాడకండా తలవంచుకుని వెళ్ళిపోయాడు....క్షణం క్రితం 'నాన్నా' అని పిలిచిన కూతురు...ఇప్పుడు కట్టె అయిపోయిన కూతురుమీద పడి భోరున ఏడవసాగాడు తండ్రి. ఆయనకి మతిస్థిరం పోయింది. జుట్టు పీక్కుంటున్నాడు, కమలమ్మగారు కూడా గదిలోకి వచ్చింది, ఏడుపు విని. శేఖరం కొయ్యబారిపోయి నుల్చుండిపోయినాడు.

పది నిముషాలా గదిలో, వెక్కిళ్ళూ ఏడ్పులూ మాత్రమే వినిపించాయి, గోడలు ప్రతిధ్వనించాయి. గదిబైట, పనివాళ్ళు వంటమనిషీ నుల్చుని కళ్లు తుడుచుకుంటున్నారు. సుదర్శనం కఠినుడైనా, సరోజని అందరిపట్లా ప్రేమగా ప్రవర్తించేది.

సుదర్శనం కూతురుమీద పడి ఏడుస్తున్నవాడల్లా గభాల్న లేచాడు. ఆయన కళ్లు నిప్పుకణాల్లా వున్నాయి. ఆయన దృష్టంతా శేఖరంమీదే వుంది. అతను యమదూతలా కనిపిస్తున్నాడు. ఆయన మండిపోతున్నాడు. "ఫో—బైటికి ఫో, కుక్కా!..." అంటూ అల్లుణ్ణి, మెడ పట్టుకుని మేడమీంచి కిందికి లాక్కొచ్చాడు. శేఖరం వణికిపోతున్నాడు. అతనికింక అక్కడ స్థానం లేదు... ఆలోచించటానికైనా అవకాశం లేకండా, సుదర్శనం శేఖరాన్ని జరజరా లాక్కొచ్చి గడప అవతల రోడ్డుమీదికి నెట్టాడు; తలుపు వేశాడు. శేఖరం దభేలుమని రోడ్డుమీద దుమ్ములో వెల్లకిలా పడ్డాడు. అతని జేబులో మిగిలిన చిల్లర డబ్బులు ఘల్లుమని రోడ్డుమీద పడి నలువేపులా పరిగెత్తినాయి. (ఇంకా వుంది)

# తప్పని సరి

## పురాణం సూర్యప్రకాశరావు

రాంబాబుగారింట్లో వివాహ సన్నాహాలు అట్టహాసంగా జరిగిపోతున్నాయి. చుట్టపక్కాలంతా ఇసక వేస్తే రాలకుండా ఇల్లంతా నిండిపోయారు. పిల్లలంతా బయటరోడ్డు కడ్డంపడి అల్లరి చేస్తున్నారు. బాజా బజంత్రీల సమ్మేళన ధ్వనులకి ఆవూరువూరంతా మారు మ్రోగిపోతోంది.

ఆ తెల్లవారుఝామునే ఆత్మీయులూ, అభిమానులూ అయినవాళ్ళ ఆశీర్వచనాల మధ్య అనూరాధ వివాహం అతివైభవంగా జరిగిపోయింది.

"ఎంతఘనంగా జరిపారు!" అని మెచ్చుకున్నారంతాను!

* * *

ఆరోజు ఆదివారం. అనూరాధ వివాహం జరిగి ఆనాటికి వారం అయింది. దూరపు బంధువులు, స్నేహితులు పెళ్ళి అయిపోయిన రెండవనాడే తిరిగి వెళ్ళిపోయారు. ఇక మిగిలిందల్లా భార్య తోబుట్టువులు, తన వేపు దగ్గిరబంధువులు కొంతమంది ఉండిపోయారు. వారుకూడా రేప ఎల్లుండిలో వెళ్ళిపోవచ్చు.

రాంబాబు నెత్తిమీదనించి పెళ్లి తాలూకు బాధ్యతలు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. చుట్టపక్కాలకి వీడ్కోలు ఇవ్వటంలోనూ, పెళ్ళికి తెచ్చిన చిన్నా పెద్దా ఎరువు సామానులు ఎవరివి వారికి అప్పచెప్పటంలోనూ ఊపిరి సలపకుండా ఉంది.

వీధి అరుగుమీద కూర్చుని రాసుకుంటూన్న రాంబాబు ముఖమెత్తి ఆశ్చర్యంగా "ఎప్పుడొచ్చావుపార్వతీఊర్నించి" అన్నాడు.

పార్వతి అరుగుమీద కూర్చుంటూ "ఈ ఉదయమే వచ్చాం" అంది.

"మీ నాన్నకూడా వచ్చాడా?"

"ఆc!"

"అంత్యక్రియలు సవ్యంగా జరిగాయా అమ్మా"—రాంబాబు చేతిలో కలం క్రింద పెడుతూ అడిగాడు.

"ఏదో ఉన్నదానిలో ఉన్నంతగా జరుపుతున్నారు. ఏముంది బాబూ! ఇంటికయిన పెద్ద చనిపోతే సామాన్యసంసారాలు కోలుకోవటం మాటలా? ఊరంతా అప్పులు. [illegible]

తెలియదు. ఎటొచ్చి ఏం చూసుకున్నా ఒక్కగా నొక్క కొడుకు నెత్తిమీదపడింది బాధ్యత" - పార్వతి కళ్లు చెమ్మగిల్లాయ్.

రాంబాబు సానుభూతి వ్యక్తం చేశాడు. క్షణంపోయింతర్వాత అతనే "ఆడపిల్లలున్నారా?" అని ప్రశ్నించాడు.

"ఒక్కతే ఉంది. పెళ్ళి అయిందిలెండి. గుడ్డిలో మెల్ల. లేకుంటే మా అన్నయ్య నయ్యో గొయ్యో చూసుకోవాల్సిందే."

"అమ్మాయి పదేపదే బాధపడింది. నువ్వు లేకుండానే నీ పరోక్షంలో ఆమెవివాహం జరిగిపోయింది. పైన ఉన్నట్టుంది వెళ్లమ్మా." అంటూతనపనిలో తనునిమగ్నుడైపోయాడు.

పార్వతిమధ్యహాలులో కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్న కొత్త ముఖాల వేపుచూస్తూ పైకివెళ్ళి గుమ్మంముందు నిలబడి "అనూరాధా" అని పిలిచింది మెల్లగా.

ముందు బాల్కనీలో నిలబడి అన్యమనస్కయైఉన్న అనూరాధ కీ గొంతు వినిపించలేదు. ఆమె ఆలోచనలో ఆమె ఉండిపోయింది.

పార్వతి బిగ్గరగా నవ్వుతూ "ఇప్పుడాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందిలే" అంటూ ప్రవేశించింది.

అనూరాధ ఈ ధోరణికి సిగ్గుపడుతూ "ఎప్పుడొచ్చావు పార్వతీ ఊర్నించి?" అని ప్రశ్నించింది.

పార్వతి చాపమీద కూర్చుంటూ "ఉదయం బండిలో" అంది.

"అయితే ఇప్పటికి తీరిందన్నమాట రావటానికి?"—అనూరాధ కోపం నటించింది.

"ఫర్వాలేదు అనూ! ఈమాత్రం కోపానికైతే తట్టుకోగల్ను. గుండెలు చేత్తో పట్టుకుని మేడ మెట్లు ఎక్కాను. పిడుగులు పడలేదుగాని మెరుపు మెరిసింది. అంతే!" అంది వ్యంగ్యంగా నవ్వుతూ పార్వతి.

"అయితే నన్నంత మూర్ఖురాలుగా భావిస్తున్నావన్నమాట?"

"కేవలం అవసరాలకే? [illegible]

ఏముంది? నీ వివాహానికి నే రాలేకపోయానంటే నువ్వు బాధపడ్డంలో ఆశ్చర్యం ఏముంది; బాధపడి కోపగించటంలో అసందర్భం ఏముంది? అందుకని అలాగన్నాను."

అనూరాధ మెత్తబడి "పోనీలే పార్వతీ! ఒక్కొక్కప్పుడు పరిస్థితులు అలా తటస్థపడతాయి. కోపగించుకోలేదు గాని బాధపడ్డాను" అంది. క్షణం పోయింతర్వాత "జోనుగాని ఇందాకేమిటే అన్నావు?" అంటూ ఉత్సుకతతో ప్రశ్నించింది.

"ఏమన్నాను?"

"ఎందు కాలోచించాలి. అంత అవసరమేముంది?"

"అదా! భర్తదగ్గర అనువయిన వినయాలు ఎలా నటించాలా అని ఆలోచించాలి"

అనూరాధ "నటించటమా!? అదేమిటే పార్వతీ అలా మాట్లాడుతావు.?" అంది ఆశ్చర్యంగా.

"అవును మరి. ఒకవేళ అతని ప్రవర్తన మనం ఆశించినదానికి విరుద్ధంగా ఉంటే తెచ్చిపెట్టుకున్న ఆప్యాయత ప్రదర్శించటం కంటె గత్యంతరం ఏముంటుంది."

"అలా ఎందుకనుకోవాలి. నేనావ్యక్తిని చెడుగా భావించటం లేదు. నేను విన్నంతవరకూ అతన్ని గురించి ఎవరూ చెడుగా చెప్పలేదు."

"అహాc! అవిమాత్రం ముందే ఎలా తెలుస్తుంది. జీవితంలో సంఘటనలు మనం ఊహించుకున్నదానికి భిన్నంగా జరగటంలో ఆశ్చర్యం ఏముంది?" - పార్వతి క్షణం పోయింతర్వాత నవ్వుతూ "ఊరికే పరిహాసాని కన్న మాటలు. అలా ఎప్పటికీ జరగదనే నమ్ముతున్నాను. మీ దంపతులు చిరకాలం అన్యోన్యంగా ఆదరాభిమానాల్తో జీవించాలనే ఆశీర్వదిస్తున్నాను" అంటూ దీవించింది పార్వతి.

అనూరాధ పెదవులమీద చిరునవ్వు మెరిసింది. ఆమె ముఖం సిగ్గుతో ఎఱ్ఱబడింది.

పార్వతి అనూరాధ మెళ్ళోని మంగళసూత్రం వేపు చూస్తూ పగలబడి నవ్వుతూ "ఒక్క ముహూర్తంలో, రెప్పపాటులో పెద్దమార్పు. ఇప్పుడతన్ని గురించి నీ నేమన్నా నా మర్యాద దక్కదు" అంది.

ఎందువల్ల?

[illegible]

# ★ తప్పనిసరి ★

హఠాత్తుగా ఓ కొత్త వ్యక్తి ప్రవేశించి తన బాధ్యతల్ని, హక్కుల్ని, సహజధర్మాలనీ తన వంతు మేరకు భుక్తం చేసుకుని అధికారకంఠంతో ఆదేశాలూ, సలహాలూ ఇస్తూ మనసులో మనసుగా వ్యవహరించే వ్యక్తి ఎవరన్నా ఉన్నారంటే ఆమె భార్య మాత్రమే అని చెప్పాలి. ఇదో విచిత్రమైన అవిభాజ్యమైన కలయిక. కొన్ని రోజుల క్రితం నీకు తెలియని అపరిచితవ్యక్తి హృదయంలో 'నీకు సగభాగం పంచి ఇచ్చాడు ఈనాడు. ఇది చాలా విచిత్రమైన విషయం కదూ అనూ?"—పార్వతి ఆగి అనూరాధ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది.

అనూరాధ తల వంచుకుని వింటూన్నదల్లా ముఖమెత్తి "ఏమో నాకేమీ తెలియదు" అంది అయోమయంగా.

పార్వతి పెద్దపెట్టున నవ్వేసింది.

ఉన్నట్టుండి పార్వతి తమాషా ప్రశ్న వేసింది. "నువ్వు స్వయంగా ఆయన్నిదివరకెప్పుడైనా చూశావా అనూ?"

"లేదు!" సహజమైన ధోరణిలోనే సమాధానం చెప్పింది అనూరాధ.

"చూడలేదూ? ఒక్కసారైనా?"

"లేదు. సంబంధం నిశ్చయమైందని నాన్నగారు అమ్మతో చెప్పటం విన్నాను. అంతే!"

పార్వతి నివ్వెరబోయింది. "ఆయన్ని గురించి ఒక్కమాట కూడా మీ అమ్మ నీతో చెప్పలేదూ?" అంది.

"లేదు. పెళ్ళి నిశ్చయమైందని మటుకు చెప్పింది. ఆయన గుణగణాలు అమ్మా, నాన్నగారూ మాట్లాడుకుంటుంటే విన్నాను. పెద్దవాళ్ళు అనుభవజ్ఞులు వాళ్ళకంటే మన కెక్కువ తెలుస్తాయా పార్వతీ?"

"వాళ్ళ అనుభవాన్ని, వాళ్ళ కళ్ళనీ విశ్వసించి నీ వ్యక్తిగతవిషయంలో నీ ప్రమేయం లేకుండా చేసుకున్నావన్న మాట!"

అనూరాధ చిరాగ్గా "పోనిద్దూ! ఇప్పుడా గొడ వెందుకు?" అంది.

పార్వతి ఇంతవరకూ తన ధోరణికి తనే సిగ్గుపడింది. పొరబాటు సర్దుకుంటూ "అహా! ఊరికే అడుగుతున్నాను. మరేమీ లేదు" అంటూ నవ్వేసింది.

అనూరాధ "అలా దేవాలయానికి వెళ్దాం పద" అంటూ లేచి బట్టలు మార్చుకుంటుండగా

పార్వతి ఏదో ఆలోచనలో పడిపోయింది.

ఉన్నట్టుండి హఠాత్తుగా పెద్దగొడవగా కేకలు వినిపించాయి. గదిలోంచి అనూరాధ, హాల్లోంచి పార్వతీ ఒకేసారి బాల్కనీలోకి పరుగెత్తారు. అసలు విషయమేమిటో బోధపడకపోయినా ఒక ఆడవ్యక్తిమాత్రం జుట్టు విరబోసుకుని గుండెలు బాదుకుంటూండటం గమనించారు. ఎదురుగా ఎవరో ఒకడు నిల్చుని ఉన్నాడు. కళ్ళు చింతనిప్పుల్లా ఎఱ్ఱబడ్డాయి. చామనచాయ. లుంగీ కట్టి బనీను తొడుక్కున్నాడు. తలకు జేబురుమాలు చుట్టుకున్నాడు. ఈ ఆకారాన్ని గమనిస్తూ "ఎవడో రౌడీలా ఉన్నాడు. వాడి కళ్ళు చూడు ఎంత క్రూరంగా ఉన్నాయో" అంది అనూరాధ.

పార్వతి తల అడ్డంగా ఊపుతూ "వీడు మా వంశంలో చెడబుట్టాడు అనూ! ఎటువంటి ఘోర అత్యాచారాలు చెయ్యటానికైనా సంకోచించడు. వాడికి అబ్బని దురలవాటు లేదు."

"వాడు నీకు చుట్టమా?!" అంది అనూరాధ ఆశ్చర్యంగా.

"దూరపుచుట్టరికం ఉందిట. కన్న తల్లిని కూడా చంపేశాడంటారు. ఎంతవరకూ నిజమో తెలియదు."

"వీడి పేరు?"

"'గంగులు' అని పిలిచేవాళ్ళు. అసలు పేరు గుర్తులేదు. వాడి చేష్టల్ని బట్టి అలా పిలిచేవాళ్ళు."

"అటువంటి దారుణకృత్యాలు చెయ్యటానికి మనసెలా ఒప్పుతుందో?"

పార్వతి నవ్వుతూ "అందరి మనసులూ నీలాటివే అనుకున్నావా?" అంది.

"సరేలే గుడికి పోదాం పద" అంటూ మెట్లు దిగి కిందికి వచ్చారిద్దరూ... ఇంటి ముందు గలభా చిలికి-చిలికి గాలివానయ్యింది. అంతవరకూ తనకు ప్రమేయం లేనట్టుగా నిర్లిప్తంగా కూచుని రాసుకుంటూన్న రాంబాబు జోక్యం చేసుకోక తప్పలేదు. ఆడమనిషి రెక్కపుచ్చుకులాగుతూ "అసలు తగాదా ఏమిటి?" అంటూ రాంబాబు మధ్యవర్తిత్వం వహించటం గుమ్మం వార నిల్చున్న అనూరాధ, పార్వతి గమనిస్తూనే ఉన్నారు. ఆడమనిషి తలబాదుకుంటూ "చూడు బాబు. నాను ఈమనిషి దగ్గర పదిరూపాయలు అప్పుతీసుకున్న మాట నిజమే. మాటప్రకారం తీర్చలేకపోనాను. ఇంకోవారం గడువిమ్మంటే ఎంత తగాదా పెంచినాడో చూడండి. ఒళ్ళంతా హూనం సేసినాడు. ఉంగరం కాజేసినాడు. బాబ్బాబు మీరు కనికరించాలి. నాసొమ్ము నాకిప్పించండి. అబ్బాకీ రేపీపాటికి తీర్చకపోతే నాను ఈ రేవ కూతుర్నే కాదు." అంటూ కాళ్ళావేళ్ళా పడింది.

బహుశః ఆవీరేశే అన్నవాడు ఒకప్పుడు ఆచుట్టుపక్కల బాగా పేరుమోసినవాడయి ఉండాలి.

గంగులు గుడ్లు పెద్దవిచేస్తూ సాభినయంగా "ఈ పెద్దమనిషి చెప్పారు కాబట్టి ఒదిలేస్తున్నాను. రేపీపాటికి నాసొమ్ము నాకందకపోవాలి నీప్రాణం తోడేస్తాను." అంటూ బొడ్లో దోపుకున్న ఉంగరం దానిముందుకు విసిరేసి మరుక్షణంలో అక్కణ్ణించి అదృశ్యమైపోయాడు.

ఆడమనిషి రాంబాబుని మాటల్లో ఆకాశాని కెత్తేసింది. రాంబాబు లోపలికివస్తూ "పాడు వెధవ! ముష్టి పదిరూపాయల కోసం ఆడమనిషిని చెయ్యి చేసుకుంటాడా" అని గొణుక్కున్నాడు.

అనూరాధా పార్వతీ దేవాలయానికి బయల్దేరారు. చీకటి మసకమసగ్గా అలుముకుంటోంది. వీధివార దీపాలు మినుకు మినుకు మంటూ వెలుగుతున్నాయి.

ఉన్నట్టుండి అనూరాధ "గంగులు గురించి మా నాన్న అలా అన్నందుకు నువ్వేమీ అనుకోలేదు గదా?" అంది.

"అయితే ఇంతసేపూ అదే ఆలోచిస్తున్నావన్నమాట. ఒకవేళ మనసు కష్టపెట్టుకున్నాననుకో నువ్వేం చెయ్యగలవు?"

"క్షమాపణ చెప్పుకుంటాను" అంది అనూరాధ.

"అయితే క్షమాపణ చెప్పుకోవాల్సిన అవసరం లేదులే. వాడిగురించి అభిమానం, సానుభూతి నాకేకోశానా లేవు." అంది పార్వతి.

అనూరాధ తలవంచుకుని నడుస్తోంది. పార్వతి ఏవేవో చెబుతోంది. చనిపోయిన పెదనాన్న గురించి ఆయనభార్య పెత్తనం గురించి చెప్పుకొస్తుంటే అనూరాధ ఆశ్చర్యంగా వినసాగింది. మధ్యమధ్య పార్వతి కంటనీరు పెట్టుకోవటం కూడా అనూరాధ గమనించకపోలేదు.

ఆఖరికి పార్వతి అంది. "ఇంటి బాధ్యతలన్నీ మా అన్నయ్య నెత్తిన పడ్డాయి. వీడిలాగా గాలితిరుగుళ్ళు తిరిగేవాడే అయితే ఆసంసారం వీధినపడేది. చాలా నెమ్మదైన వాడు." అని.

ఆమాటా ఈమాటా చెప్పుకుంటూ దేవాలయం చేరుకుని ఓ అరగంట గడిచింతర్వాత తిరిగి ఇంటికి బయల్దేరారిద్దరూ. పార్వతి

సందుమలుపుదగ్గిర ఆగిపోయి "వస్తాను. అనూ! రేపు కలుసుకుంటాను" అంది.

"తప్పకుండా రావాలిసుమా!" అంటూ అనూరాధ వెళ్లిపోయింది.

పార్వతి ఇల్లు చేరుకునేసరికి ఆరుబయట నులకమంచంమీద తండ్రి చుట్ట కాలుస్తూ కూచుని ఉన్నాడు. ముందు జాబిరీలో హరికేన్‌లాంతరు మసక మసగ్గా వెలుగుతోంది. పెరట్లో రావిచెట్టు జుంయ్‌మని గోలచేస్తోంది.

"ఎక్కడికి వెళ్లావమ్మా?" అన్నాడు ముసలితండ్రి.

"అనూరాధని చూట్టానికి వెళ్లాను" అంది పార్వతి.

"కులాసాగా ఉన్నారా?"

"ఆఁ!" వివాహానికి నే లేకుండా పోయినందుకు ఎంతో బాధ పడింది."

"కాకుమరి. చిన్నప్పట్నుంచి పరిచయం" అన్నాడు తండ్రి. క్షణం పోయింతర్వాత మంచంమీదనుంచి లేస్తూ "అన్నం పెట్టమ్మా! ఆకలేస్తోంది." అంటూ లోపలికి నడిచాడు. పార్వతి తండ్రిని అనుసరించింది.

భోజనం చేస్తున్నంతసేపూ అనూరాధ వివాహాన్నిగురించి, కట్నాలూ కానుకలూ, లాంఛనాలు, బహుమతులూ—తను విన్నవన్నీ పార్వతి తండ్రితో, చెబుతూనే వుంది.

తండ్రి 'ఊఁ!' కొడుతున్నాడు.

భోజనం ముగిసింతర్వాత తండ్రిని ఓమారు రాంబాబుగారింటికి వెళ్ళమని బలవంతం చేసింది పార్వతి.

"వెళ్లకపోతే నేం?" అన్నాడు తండ్రి.

"కాదు వెళ్లిరా. బాగుండదు. చాలా సంతోషిస్తాడాయన" అంది పార్వతి. సరేనంటూ ముసలి తండ్రి బయల్దేరాడు. వీధి గుమ్మంలో నిలబడి "బాగా పొద్దు పోయేవరకూ ఉండకుండా త్వరగా వచ్చెయ్" అంది పార్వతి. అలాగే నంటూ ముసలి తండ్రి నడుంవంచి చేతికర్రఊతంతో అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు. పార్వతి కళ్లు అప్రయత్నంగా చెమ్మగిలాయి.

"తండ్రి పెద్దవాడైపోయాడు. డెబ్బై ఏళ్లే పెదనాన్న చనిపోయాడు.

తండ్రి వయస్సుకూడా అరవైదాటాయి. తనకింకా వివాహం కాలేదు. తన తండ్రికి ఏ బాధ్యతా తీరలేదు. వయస్సు ముదురుతోంది. తనున్నంతకాలం ఇంత వండి పడేస్తుంది. తనకు వివాహం జరిగి అత్తవారింటికి వెళ్ళిపోతే తండ్రిని చూసేవాళ్లెవరు? ఆత్మాభిమానం చంపుకుని అల్లుడి పంచలో కాలక్షేపం చెయ్యాలి. ఛీ! ఏం జీవితాలు!


అయితే తను ఆశ్చర్యపడే విషయం ఒకటి ఉంది. తన తండ్రి విచారంగా, నిరుత్సాహంగా ఉండటం తనెప్పుడూ చూడలేదు. ఆఖరికి అన్నగారు చనిపోయినప్పుడుకూడా భార్యా, కొడుకు, కూతురు నేలకు అలుముకుపోయి హృదయవిదారకంగా ఆక్రందిస్తుంటే స్థైర్యంగా నిలబడి అంత్యక్రియలకి ఏర్పాట్లన్నీ తనే చేయించాడు. తన కాశ్చర్యం వేసింది. అన్నీ ఉన్నవాడు, సంపన్న గృహస్థు రాంబాబుగారే అప్పుడప్పుడు అనూరాధ వివాహంగురించి తన దగ్గిర ఎత్తుకొస్తూ దిగాలుపడిపోయేవాడు. అటువంటిది తన్నిగురించి తండ్రి ఎంత బెంగపెట్టుకోవాలి. అనూరాధకంటె తను రెండేళ్లు పెద్ద. రెక్కాడితే డొక్కాడుతుంది. తన ముందుగాని చాటుగా గాని ఏ విధమైన దైన్యాన్ని, అసహాయతని, నిరుత్సాహాన్ని వ్యక్తం చేసేవాడు కాడు. ఎంత నిబ్బరం! ఏం చూసుకుని అంత ధైర్యంగా మసులుతున్నాడో. లోకులు నలుగురూ నాలుగు విధాల చెప్పుకుంటున్నారు. అయినా స్తంభంలా నిలబడగలిగాడు తండ్రి.

లోపల గిన్నెల చప్పుడు వినిపించి పార్వతి ఆలోచనల్లోంచి తేప్పరిల్లి ఇంట్లోకి వెళ్ళిపోయింది. పిల్లి అంట్లగిన్నెలు దొర్లించేసింది. ఎంగిళ్ళ విస్తళ్లు ఎత్తుకుని వీధి గదిలో పక్కలు వేసి నడుం వాల్చింది పార్వతి.

"చేతనైనంతవరకూ సంబంధాలకోసం వెతుకుతునే ఉన్నాడు. ఈ ప్రయత్నంలో ఎన్నిమార్లు విఫలుడైనా, ఎంతో మంది కర్కోటకత్వం ప్రదర్శించినా సరే ఒక్క మాట వాళ్ళనిగురించి నిందాపూర్వకంగా తన ముందెప్పుడూ అనడు. ఈమధ్య ఓ సంబంధం చూశాడు. అన్నీ బాగానే ఉన్నాయి. కట్నందగ్గిర పేచీ వచ్చింది. "నాకు తోచింది నేనిస్తాను. వేలమీద కట్నాలు నే పొయ్యలేను" అని తండ్రి ఖచ్చితంగా చెప్పేసరికి మాటలు మిరుచుకుంటూ వాళ్ళు వెళ్ళిపోయారు. అయినా ప్రయత్నానికి లోపం లేకుండా వాకబులు చేస్తూనే ఉన్నాడు." పార్వతి క్షణం గడిచింతర్వాత అనుకుంది. "అనూరాధ అదృష్టవంతురాలు" అని. తను దురదృష్టవంతురాలనే తలపు గాఢంగా పట్టుకుంది పార్వతికి.

* * *

అనూరాధ అత్తవారింటికి వెళ్ళిపోతోంది. ఆనాడు ఉదయం పనిపాటలు తొందరగా తెమల్చుకుని ఆదరాబాదరాగా తను నాలుగు మెతుకులు కతికి త. 22



బృందావనంలో కాళియమర్దనం
(మైసూరు బృందావన్ గార్డెన్స్) —ఫోటో: ఎస్. జగన్నాథరావు (బరంపురం.)

# ★ తప్పనిసరి ★

అన్నం పెట్టి అయిన్నీ వంటింటికి తలుపు తాళం వేసి అనూరాధ ఇంటికి బయల్దేరింది పార్వతి

గుమ్మంలో నిలబడి ఎవరికోసమో అన్నట్టుగా ఎదురుచూస్తోంది అనూరాధ. పార్వతి కనిపించగానే ఇంత ముఖం చేసుకుని "నీకోసమే చూస్తున్నాను పార్వతీ, ఇంత ఆలస్యం అయిందేం?" అంటూ చెయ్యి పుచ్చుకుని లోపలికి తీసుకెళ్ళింది. లోపల గదిలో ప్రయాణ సన్నాహాలు జరుగుతున్నాయి. ఉండి ఉండి రాంబాబు ఊరంత గొంతుతో హెచ్చరిస్తున్నాడు "త్వరగా తెమలమంటూ"ను.

అనూరాధ "నేను సిద్ధంగా ఉన్నాను"

అని "మళ్ళీ ఎప్పుడొస్తావు అనూ?" అంది.

"నాకు ఎప్పుడు రావాలని బుద్ధి పుడితే అప్పుడు రెక్కలు కట్టుకుని వాల్తాను" అంది అనూరాధ.

పార్వతి నవ్వుతూ "బుద్ధి పుట్టినప్పుడల్లా రావటానికి నీ యిష్టంతో అయిపోయే పని గాదు" అంది.

"ఏం?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది అనూరాధ.

"పెళ్ళి లేదు కో!" అంటూ వెక్కిరించింది పార్వతి.

"ఎప్పుడొచ్చినా రాకపోయినా నీకోసమున్నా ఓసారు రాకతప్పదు. ఈ సంవత్సరం [illegible]

త్వరలో ఒస్తే బాగుణ్ణు" అంది అనూరాధ.

పార్వతి సిగ్గుపడింది. పైకి చిన్నగా నవ్వినా మనసులో బాధగా మూలిగింది. మరో అరగంటలో అన్నీ పూర్తయిపోయాయి. అనూరాధ బండి ఎక్కుతూ కళ్ళనీళ్లు పెట్టుకుని "ఒస్తాను పార్వతీ" అంది. పార్వతి నోట మాట పెగల్లేదు. తలవాల్తం అడ్డంగా ఊపింది. అనూరాధతల్లి గుమ్మంవార నిలబడి అతిప్రయత్నంమీద పొంగి వచ్చే దుఃఖాన్ని అపుకుంటోంది. రాంబాబు భార్యని ఓదారుస్తున్నాడు. ఇది సర్వసాధారణ విషయమే. పార్వతి కిదేమీ కొత్త గాదు. అనేకమార్లు ఇటువంటి సంఘటనలు ఆమె చూసింది. అయినా పార్వతి కళ్ళనీళ్లు పెట్టుకుంది.

ఆమెకు తల్లి లేదు!

* * *

"అనూరాధ కాపరానికి వెళ్లిపోయింది" అని పార్వతి తండ్రితో చెప్పింది.

"అదృష్టవంతురాలు!" అని మాత్రం అన్నాడు అస్పష్టంగా.

పార్వతి నివ్వెరబోయింది. తనింతవరకూ తండ్రి కళ్ళ నీళ్ళలో ఎప్పుడూ చూడలేదు. అతను కళ్లు తుడుచుకుంటూ భుజంమీద తువ్వాలు కప్పుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు. పార్వతి వెనకాలే వెళ్ళి వీధిగుమ్మందగ్గిర నిలబడి తండ్రి సందు మలుపు తిరిగేవరకూ చూస్తూ ఉండిపోయింది. ఇంతవరకూ తండ్రి ధైర్యాన్ని బట్టి తనూ నిగ్రహంగా నిబ్బరంగా ఉండగలుగుతోంది. కేవలం అతని బాహ్య ప్రవర్తనతో వటన అనీ లోలోపల నిప్పులు చెరిగే బాధతో తండ్రి ఎంతగా కుమిలిపోతున్నదీ పార్వతి ఊహించుకునే సరికి కాళ్లు వణికాయి. మనసు చెంచేలు పడిపోయింది. తలుపుకు అంటుకుపోయి వలవలా ఏడ్చింది. ఆమె కొతుణంలో ఏమి చెయ్యటానికీ పాలుపోలేదు. వంటగదిలోకి వెళ్ళి గోడవార కూర్చుండిపోయింది. కంఠంలో అన్నం పిల్లి ముట్టుకుంటున్నా అలా చూస్తూ ఉండిపోయింది పరాగ్గా.

* * *

ముసలితండ్రి రాత్రి చాలా సేపటివరకూ నిద్రపట్టక ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఇవ్వాళో సంబంధం చూశాడు. కట్నం దమ్మిడీ ఇవ్వాల్సిన అవసరం లేదు. అన్ని విధాలా తనకు నచ్చింది. అయితే పార్వతి అంగీకరిస్తుందో లేదో అని ఆలోచించసాగాడు.

తెల్లవారింతర్వాత ఈ సంబంధంవిషయం పార్వతిముందు ప్రస్తావించటానికే మనసు నొచ్చుకొంది. ఎందుకో? చివరికి ధైర్యం చేసి

ఆనాడల్లా ఆలోచించి రాత్రి భోజనాలయింతర్వాత ఈ ప్రస్తావన తెచ్చాడు.

పార్వతి ఒక్క ఉదుటున లేచి నిల్చుని "నీకు మతిపోయిందా నాన్నా?" అంది తీక్ష్ణంగా.

తండ్రి ఏమీ మాట్లాడలేదు.

"అతణ్ణిగురించి నీకేమీ తెలియదనుకుంటాను" మనిషిలో ఉండకూడని ఏహ్యమైనగుణాలన్నీ వాడిలో మూర్తీభవించి ఉన్నాయి." అంది ఆవేశంగా.

తండ్రి ఈమారు నిదానంగా "నాకన్నీ తెలుసు" అన్నాడు.

"తెలిసే ఇందుకు సిద్ధపడ్డావా?" ఈమారు కంఠం రుద్ధమైంది.

ముసలితండ్రి గంభీరంగా నవ్వుతూ "నువ్వంతగా బాధపడాల్సిన అవసరం లేదమ్మా. నీ కంతగా ఇష్టం లేకపోతే మరో సంబంధం చూసుకుందాం. వాడి పొరబాటే. కట్నం దమ్మిడీ అవసరం లేదని వాడంటే కక్కుర్తిపడ్డాను." అన్నాడు.

పార్వతిగుండెలు కుదుటపడ్డాయి. మరో గంటలో ఆమె గాఢసుషుప్తిలో మునిగిపోయింది.

అర్ధరాత్రి ఓమారు ఆమెకు మెలకువ వచ్చింది. కళ్లు తెరచి చూసింది. మంచం మీద కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు తండ్రి. గుడ్డినార దీపం మసకమసగ్గా వెలుగుతోంది. తెల్లవారుఝామున మెలకువవచ్చి చూస్తే తండ్రి చావిట్లో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఇంకా చీకటిగానే ఉంది బయట.

పార్వతి లేచి కూర్చుని "రాత్రంతా నిద్రపోలేదు కాబోలు" అనుకుంది. తెల్లవారింతర్వాత చూస్తే తండ్రిముఖం నిగారించి ఉంది. కళ్లు ఎఱ్ఱబడ్డాయి. బహుశః ఆ సంబంధంగురించే ఆలోచించి ఉంటాడు. కట్నం అవసరంలేదట!"

ఈవారంరోజుల్లోనూ తండ్రి బాగా నీరసించిపోయినట్టుగా అవుపించాడు. పార్వతి కంగారుపడింది. ఎప్పుడూ లేంది అస్తమానూ పరాగ్గా ఒంటరిగా ఆలోచిస్తూ గంటలతరబడి కూర్చుండిపోయేవాడు. పార్వతి జ్ఞాపకంచేస్తే నాలుగు మెతుకులు కతికి చేతికర్ర అవసరం ఉన్నా మర్చిపోయి వీధిగుమ్మంవరకూ నడిచి తిరిగి వెనక్కి వచ్చేవాడు. పార్వతి చేతికర్ర అందిచ్చేది. ఒకొక్కప్పుడు భోజనం చెయ్యటం కూడా అలక్ష్యం చేసేవాడు. పార్వతి బలవంతంచేస్తే ఆకలి లేదంటూ నసిగేవాడు.

రాత్రి ఒంటిగంటవరకూ పార్వతి ఆలోచిస్తూనే ఉంది. మంచు బాగా కురుస్తోంది. ఎముకలు కొరికే చలి. ఎన్నోవిధాల ఆలోచించింది. తర్జనభర్జనలు చేసింది. మనసంతా పాడుచేసుకుంది. చివరికి ఓ నిర్ణయానికొచ్చింతర్వాత పార్వతి కళ్ళనీళ్లు తుడుచుకుంటూ అతిప్రయత్నంమీద పొంగివస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూనే నిద్రపోయింది.

ఉదయం భగవధ్యానం చేసుకుంటున్న తండ్రిపక్కగా వచ్చి కూర్చుని "నేనా సంబంధం చేసుకుంటాను నాన్నా" అంది పార్వతి.

ముసలితండ్రి "ఆశ్చర్యంగా అదేమిటి?" అన్నాడు.

"ఆనాడు ఊరికే అలాగన్నాను. నాకేమీ లేదు. ఈ సంబంధం చేసుకోటానికి నా కేవిధమైన అభ్యంతరం లేదు. నిశ్చయం చెయ్యి." అంది పార్వతి.

ఆమె తొణకలేదు బెణకలేదు. ముసలి తండ్రినోట మాట పెగలేదు.

రాంబాబుగారికీమధ్య ఒంట్లో ఆరోగ్యం బాగుండటంలేదని తెలిసి పార్వతి ఓమారు ఆయన్ని చూట్టానికని బయల్దేరింది. ఎంతో ఆదరంగా మాట్లాడాడు రాంబాబు. అనూరాధకి నిన్ననే ఉత్తరం రాశారట. బహుశః నాలుగయిదురోజుల్లో ఆమె రావచ్చని వారు ఎదురుచూస్తున్నారు. ఆయనఆరోగ్యం గురించి అంతగా బాధపడాల్సిన అవసరం లేకపోయినా ఆయన స్వభావాన్ని బట్టి అలా ఉత్తరం రాయాల్సివచ్చిందని పార్వతి అనుకుంది. ఏదైనా అంతే! గోరంతని కొండంత చేసుకుని బాధపడిపోతాడు.

మరోగంట గడిచింతర్వాత సెలవు తీసుకుంది పార్వతి.

* * *

ఉత్తరం రాసిన ఐదోనాటికల్లా ఆదరాబాదరాగా గుండెలు గొట్టుకుంటూ వచ్చేసింది అనూరాధ. గుమ్మంలోనుంచే రుద్ధకంఠంతో తండ్రి ఆరోగ్యం గురించి ప్రశ్నలమీద ప్రశ్నలు వేసింది. వీటన్నిటికీ సమాధానంగా రాంబాబు చిరునవ్వు నవ్వుతూ మేడమీంచి "అమ్మాయీ! పైకి రావే!" ఆనందాతిశయంతో పిట్టగోడ మీద చేతులానించి ముందుకూ వెనక్కూ ఊగుతూ అన్నారు.

అప్పటికి అనూరాధగుండెలు కుదుటపడ్డాయి. ఆతర్వాతగాని పక్కగా నిల్చుని ఉన్న పార్వతిని ఆమె గమనించలేదు. సంతోషంతో పార్వతి రెండుచేతులూ పుచ్చుకుని లోపలికి తీసుకువెళ్ళింది.

ఆసాయంత్రం ఇద్దరూ కలిసి దేవాలయానికి బయల్దేరారు. పార్వతి ముందు విముఖత ప్రదర్శించినా అనూరాధలబలవంతంమీద వెళ్లకతప్పలేదు. అనూరాధలో ఈ కొన్నాళ్లలోనూ అనుకోని మార్పు కనిపించింది పార్వతికి. ఆమె వివిధవిషయాల గురించి మాట్లాడినా ఆ విషయం భర్తకు సంబంధించినదే అయిఉండటం పార్వతికి చాలా ఆశ్చర్యం వేసింది.

చివరికి ఆ ధోరణి భరించటం కష్టమైపోయింది పార్వతికి. ప్రసంగవిషయం మార్చాలని పార్వతి చేసిన ప్రయత్నాలు విఫలమయిపోయాయి.

ఆరోజు శుక్రవారం కావటంవల్ల దేవదర్శనం కావటం అంత సులభమయిన విషయం కాదు. గర్భగుడిముందు జనం తోసుకుంటున్నారు. మ్రొక్కొట్టునీడని ఆశీసులయ్యారిద్దరూ.

అనూరాధ "ఇప్పుడప్పుడే రావటం పడుతుందనుకోలేదు. బహుశః మళ్ళీ రావటం అంటూ జరిగితే అది నీగురించే అనుకున్నాను" అంది.

"అయితే మళ్లీ రావాల్సిన అవసరం ఉంటుందిలే" అంది పార్వతి.

"ఏం?" అంది అనూరాధ.

"నాగురించే" నిర్వికారంగా అతిసామాన్యమైన విషయం ప్రస్తావిస్తున్నట్టు అంది పార్వతి.

"ఆఁ!!! నీపెళ్లి నిశ్చయమైందా పార్వతీ?" అనూరాధ ఆనందాశ్చర్యాల్లో ఉక్కిరిబిక్కిరై పోయింది.

"అవును."

"చాలా సంతోషం. కట్నం?" అనూరాధ ప్రశ్నించింది.

"ఆయన కట్నం పుచ్చుకోరట!"

"గొప్పవిషయం. ఆయనేం చేస్తుంటారు?"

"అది నాకు తెలియదు"

"ఆయన పేరు?"

"గం...గు...లు!"

"ఆఁ!!" అనూరాధ స్తంభించిపోయింది. లిప్తలో ఆమెముఖం ఎఱ్ఱబడిపోయింది. క్షణంపోయింతర్వాత ఆవేశంగా "నీకేమైనా మతిపోయిందా పార్వతీ. నీఅంతటిను వ్వే ఇందుకు అంగీకరించావా?" అంది.

"అవును!"

"వాడొక ఖూనీకోరు! గూండా! అమర్యాదస్తుడు. మోటుమనిషి..." అనూరాధ తన ఉనికినే మరిచిపోయింది.

పార్వతి లేచి "వస్తాను అనూ! ఇంటికి వెళ్తాను." అంటూ రెండుచేతుల్లో గుండెల్ని అదిమి పట్టుకుని చరచరా వెళ్లిపోయింది. అనూరాధ "దేవుడి ప్రసాదం పుచ్చుకోవూ పార్వతీ?" అంటూ వెంటబడినా ఆమె వినిపించుకోలేదు.

గుడిగంటలు గణగణమని చెవులు హోరెత్తిస్తున్నాయి. అనూరాధ అయోమయంగా చూస్తూ నిలబడిపోయింది. ★



స్నేహితులు

# వనితాలోకం

## అసూయ

కొమ్మూరి ఉషారాణి

మనుష్యుల్ని ఉక్కిరి బిక్కిరి చేసి చిత్రహింస పెట్టే లక్షణం అసూయ కొంతయినా వుంది అది హృదయాన్నీ మనస్సునీ దహించి వేస్తుంది. స్థైర్యం, హేతుజ్ఞానం తప్పి సంస్కార సభ్యతలకి దూరమయేటట్లు చేస్తుంది. అసూయ అరిషడ్వర్గంలో ఒకటి.

ఈ ప్రపంచంలో మనం వాంఛించేవన్నీ మనకి సంక్రమిస్తాయనుకోవటం పొరబాటు. ఒక వ్యక్తిలో వుండే సద్గుణాలు మరో వ్యక్తిలో వుండవు. ఒక వ్యక్తికి లభించే సదవకాశాలు మరో వ్యక్తికి లభించవు. ఇవి కొంతవరకు వ్యక్తుల యొక్క ప్రత్యేక కృషీ సమర్థతమీదా ఆధారపడివుంటాయి. అందుబాటులో లేని ఆనందాన్ని తల్చుకుని కుమిలిపోయి, ఆ ఆనందాన్ని పంచుకునేవారిమీద అసూయ ప్రకటించడం అవివేకం. లోకం, వాస్తవ పరిస్థితులూ గ్రహించేవాళ్లు అటువంటి పరిస్థితులలో కలిగే ఆవేదననీ బాధనీ చాలా మటుకు తప్పించుకోగలుగుతారు.

సమాజంలో హెచ్చుతగ్గులూ దారిద్ర్యం అనేవి వున్నంతకాలం ఈ అసూయ మనుష్యుల్ని పీడిస్తూనే వుంటుంది. తమ భోగభాగ్యాలనీ స్థితిగతులనీ యితరులతో పోల్చుకుని కృశించిపోవడం జరుగుతుంది. అంతే కాదు. కొందరు చిన్నతనంనుంచీ కొన్ని విచిత్రమైన కోరికలు పెంచుకుంటారు. అవి అందుబాటులో వుండవనే విషయం వారికి తెలియదు. ఆ జ్ఞానమే వికసించినప్పుడు, పరిస్థితులు తారుమారైతే అసూయతో క్రుంగిపోతారు.

మనకు తెలియకుండానే మన మాటలూ చేష్టలూ కొంత అసూయని వ్యక్తపరుస్తూంటాయి. 'ఈ చీర ఖరీదెంత?' 'ఈ గాజులు ఏ షాపులో చేయించారు?' అనే ప్రశ్నలలోనే అసూయ చూచాయగా తొంగిచూస్తూవుంటుంది. క్లాసులో, ఏ పిల్లలకైనా కాస్త మంచి మార్కులు వస్తే కాపీ కొట్టిందనో, మార్కులు వేయించుకుందనో గుబుక్కున అనేస్తూంటారు కొందరు. 'ఎంత అందమైన అమ్మాయి కనపడినా 'ఆ! పోనిద్దూ ఏమంత బాగుంది' అని అక్కసు వెళ్ళగక్కుకుంటారు మరికొందరు. అసూయతో అవినయంగా ప్రవర్తిస్తున్నారనే విషయం దురదృష్టవశాత్తూ వారికంటె ముందు ఎదటివారే గ్రహించటం జరుగుతుంది

ఈ అసూయ అనే ఉద్రేకాన్ని వాస్తవంగా చిత్రించడానికి తరుచు స్త్రీల దృష్టాంతాలుగా ఉపయోగిస్తూంటా కొందరు రచయితలు. పురుషులకం స్త్రీలకే అసూయ ఎక్కువనే దుర ప్రాయాన్ని ప్రకటిస్తూంటారు కొంద ఇది తప్పు. నాలుగు గోడలమధ్యా పనిపాటు తోనూ పిల్లలతోనూ సతమతమవుతూ, అస తృప్తితో క్రుంగిపోయే స్త్రీలని అసూయ బాధిస్తే, ఆఫీసులో కృషికి తగినంత ఫలిత దక్కకపోయినా, అసమర్థుడికి ప్రమోష వచ్చినా పురుషులకి అసూయ కలుగుతుం సమాజంలో స్త్రీ పురుషుల పరిస్థితులల గల తేడాలనిబట్టి అసూయ వ్యక్తమయే రూపాలు వేరు వేరుగా వుంటాయి.

సాధారణంగా అతిశయమూ అహంకారమూ గల స్త్రీలలో అసూయ ఎక్కు వుంటుంది గనుక ఇవే కూడా అసూయ కారణాలనుకుందాం. 'నేను' 'నాది' అ స్వార్థం లోంచికూడా అసూయ పుట్ట కొస్తుంది. అసూయకి ముఖ్యకారణం అస తృప్తి అంటారు కొందరు.

తృప్తి అనేది ప్రతిమనిషికీ వుండదనిమా నిజమే. కాని 'నాకు లేదే' అనే చింత ఒకరకమైనది. 'యింకొకరికి వున్నదే' అ బాధ మరొకరకమైనది. అన్నిట్లో నే తక్కువ, తతిమ్మావారంతా నాకంటె ఎక్కువగా సుఖంగా వున్నారనే భావ అసూయని రెచ్చగొడుతుంది. అసం తృప్తి లేకుండా, స్వార్థాన్ని జయించ గలిగే శక్తి అందరికీ వుండదు

# ★ అసూయ ★

కష్టం అక్కా మొగుడు ఒక గెజిటెడ్ ఆఫీసరయి తన భర్త గుమాస్తా అయితే మూతి విరిచే చెల్లెళ్ళు, 'మీ వదిన చక్కగా వంటచేస్తుంది' అంటే ముఖం ముడుచుకునే ఆడబిడ్డలూ, కోడలు ఇంట్లో అడుగు పెడుతూనే తన స్థానం ఆక్రమించుకుంటుందని బాధపడే అత్తగార్లూ మనకి తరుచూ పుస్తకాల్లోనూ, తెరమీద కనిపిస్తూనే వుంటారు. అతి సామాన్యమైన ఈరకం అసూయ వారివారి సంస్కార సభ్యతలని నిరూపిస్తుంది.

అసూయ మనల్ని ఎక్కువ బాధ పెట్టకుండా, ఎదటివారికి హాని కలిగించనంత కాలం ప్రమాదకరంగా పరిణమించదు. తీవ్రమైన అసూయ కలిగిన స్త్రీలు ఒక్కొక్కప్పుడు ఎంతటి రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తారో, ఎంత నీచానికి ఒడిగడతారో తలుచుకుంటే భయమేస్తుంది. ఒక పాశ్చాత్య నవలలో అటువంటి స్త్రీని ఈవిధంగా ఊహించాడు రచయిత—అందులో నాయిక అసూయ భరించలేక చెల్లెల్ని యింట్లోంచి తరిమేస్తుంది. కుంటివాడూ పసివాడూ అయిన పదేళ్ళ తన మరిదిమీద భర్త అపారమైన అనురాగాన్ని కనబరుస్తున్నాడని, ఒంటరిగా పడవ షికారుకి తీసుకెళ్లి, నీళ్ళలోకి తోసేసి చంపేస్తుంది. అంతే కాదు! తనకు పుట్టబోయే శిశువు భర్త ప్రేమని ఎక్కడ పంచుకుంటుందో అనే భయంతో మెట్లమీంచి దొర్లిపడుతుంది! నలుగురు ఆడవాళ్లు ఒకచోట చేరినప్పుడు వారి మధ్య లేనటువంటి వ్యక్తినిగురించి తమకు తెలిసినవి కొంతా, ఊహించుకున్నవి అసభ్యంగా మాట్లాడి పుకార్లు లేవదీసి అసూయని ప్రకటిస్తూంటారు కొందరు స్త్రీలు. ఈ రకం అసూయవల్ల యితరులకి హాని కలగటమే గాకుండా, అసూయాపరుల అభిరుచీ సంస్కారం హీనమైపోతుంది.

సాధారణంగా స్త్రీలలో వుండే అసూయ పురుషుల అహంకారాన్ని రెచ్చగొడుతుంది. దాంపత్య జీవితంలో అసూయ విపరీతంగా కలుగుతే అనవసరమైన అపోహలకీ మనఃక్లేశాలకీ నిలయమై ఆ యిల్లు ఓనరకంలా తయారవుతుందనటంలో సందేహంలేదు. కానీ భార్యాభర్తలమధ్య అసూయ పరస్పర అనురాగాన్ని కొంతమటుకు వ్యక్తపరుస్తుంది. భర్త పరస్త్రీతో మాట్లాడితే అన్నం సయించక బాధపడుతుంటారు యిల్లాలు. సినిమా చూసినప్పుడు అందులో నాయిక అందంగా వున్నదని భర్త పైకి అంటే, 'చూశావా! నిన్ను ఆ సౌందర్యవతితో పోల్చుకుని విచారిస్తున్నాడు' అంటుంది ఓ యిల్లాలి హృదయం. కానీ అలా బాధపడే భార్యకి భర్తమీద అంతో యింతో ఆపేక్ష వున్నదన్నమాటే. ఒక వ్యక్తిమీద మరొక వ్యక్తికి వున్న యిష్టాయిష్టాలని అసూయ చాలామటుకు తెలుపుతుంది. కానీ భర్త ఆఫీసునుంచి ఆలస్యంగా యింటికి వస్తే ఏంచేస్తున్నాడో అని బాధపడే భార్య, భార్య పరపురుషుని వంక చూస్తేనే పాతివ్రత్యం మంటగలిసి పోతుందనుకునే భర్త మనకి తరుచు ఎదురవుతూ వుంటారు. ఈ రకం మనుష్యుల్లో సంకుచిత అభిప్రాయాలమాట ఎలావున్నా, నిజమైన అనురాగంకంటె స్వార్థం ఎక్కువుంటుంది.

ఇతర ఉద్రేకాలూ ఆవేశాల మాదిరి అసూయనిగూడా అణచుకుంటేనే సంస్కార సభ్యతలు అలవడతాయి. అంతమాత్రాన అసూయని ఒక పాపంకింద జమకట్ట నక్కరలేదు. అది ఒక బలహీనత. అసూయ, మూర్ఖత్వంవంటివి జాలిపడవలసినవిగాని, అసహ్యించుకోవలసినవి గావు. ★

# ★ స్త్రీలు - ఉద్యోగాలు ★

## ఇల్లిందల సరస్వతీదేవి
(హైదరాబాద్)

“స్త్రీలు - ఉద్యోగాలు” అన్నది ఒక తాజా సమస్య. ఈ సమస్య దీని పరిణామము పురుషులకొక విధముగాను స్త్రీలకొక విధముగాను ఆలోచనలకు తావిస్తున్నది.

స్త్రీలందరూ ఉద్యోగాలు చేస్తే గార్హస్థ్య ధర్మాలకు భంగము వస్తుందేమో - స్త్రీలు నైతికముగా పతనము చెందుతారేమో - బిడ్డల పోషణ, గృహబాధ్యతలను విడనాడుతారేమోననే సందేహపరంపర కొంతమందికి కలుగుతున్నది.

నిరుద్యోగసమస్య పురుషులనే కలవరపెట్టుతూ దేశాన్ని క్షోభింపచేస్తూండగా స్త్రీలుకూడా ఉద్యోగాలు కావలెనని పరుగులెత్తితే ఉన్న సమస్య మరింత తీవ్రమవుతుంది. అయినా స్త్రీలను ఉద్యోగాలలో పెట్టినప్పటినుంచీ అనేక సమస్యలు—'*Scandals* తగాదాలు, గృహిణులయితే భార్యాభర్తల నొకచోట్నే ఉంచే ప్రయత్నాలు' బయలుదేరుతాయి. 'స్త్రీలు ప్రవేశించిన ఆఫీసులలో పని సరిగా సాగదు' మొదలైన అనుమానాలు కొందరిని బాధిస్తున్నాయి.

అనుమానాలు సంశయాలు అపోహలూ అటుంచి - అసలు స్త్రీలు ఉద్యోగాలు చేయుటము అవసరమా - లాభకరమా - ఉపయోగకరమా - దీనివల్ల కలిగే లాభనష్టాలు ఏమిటి? మన సంసారాలు ప్రస్తుతము ఏ స్థితిలో వున్నాయి? దేశపరిస్థితి ప్రస్తుతము ఎట్లా ఉన్నది? ఈ ప్రశ్నలూ వాటి జవాబులను గురించి ముందుగా బాగా అర్థము చేసుకొని చర్చించాలి.

### దేశపరిస్థితి - సామాన్య సంసారాలు

ఈ కాలములో ఏ సామాన్యగృహములో కాలు పెట్టినా ఆ గృహస్థు భరించలేనన్ని సాంసారికమైన చిక్కులు పిల్లల చదువులు, చిన్నపిల్లల జబ్బులు, పురుళ్ళు, పెళ్ళిళ్లు అనేకముగా కనబడుతూంటాయి. ఆ గృహస్థు భరించలేని ఖర్చులు బాధిస్తూ ఉంటాయి. దానికి తగినట్లు పట్టణాలలోనూ పల్లెలలోనూ ఎక్కడికి తగినట్లు అక్కడ జీవితావసరాలు రోజుకు రోజు పెరుగుతున్నాయి. మానవుడికి ఆహారమెంత అవసరమో హోటళ్ళు, సినిమాలు, టాయిలెట్ సామగ్రి అంత అవసరములైనాయి. ఇదిగాక - ఆర్థికమాంద్య మొక ప్రక్క పీడిస్తూఉండగా జీవిత పరిమాణము హెచ్చినందువల్ల కొన్ని కష్టాలను ఎదుర్కోనవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పిల్లల చదువుల పేరుమీద చాలా సంసారాలు నగరాలను చేరుతున్నాయి. చాలా సంసారాలలో భూవసతి చదువులక్రింద వ్యయమైపోయింది. కాలప్రవాహము ఉత్తుంగతరంగాలలో అలజడికలిగిస్తూ పరిగెత్తుకొనివస్తుంటే

దాని నెదుర్కొనే శక్తి మానవుడి దగ్గర ఉన్నదా!

సంఘములో బాలికల పరిస్థితి కాలమునను సరించి జీవితవిధానాలుకూడా మారిపోయాయి. శారదాబిల్లు తరువాత కన్యల వివాహకాలపరిమాణాన్ని పొడి

# ★ స్త్రీలు - ఉద్యోగాలు ★

గించటమువల్ల బాలికలలో విద్యాప్రాబల్యము హెచ్చింది. బిల్లులో నిర్ణయింపబడిన వయసు అనగా 14 సంవత్సరాలకు వి బాలికా సామాన్యముగా మెట్రికుల్యు పరీక్ష పూర్తిచేయజాలదు. అది పూర్తిచేసిన తరువాత వివాహప్రయత్నాలు ప్రారంభమయితే తగిన సంబంధము కుదిరేవరకూ బాలిక చదువు సాగిస్తూ ఉంటుంది. ఈ కాలములో గృహస్థుకు ఖర్చులు పెరిగిన కారణాలలో ఇది ఒకటి. మగపిల్లలకు ఆడపిల్లలకు విద్య సమానమే అయినా ఆడపిల్లల కోసం డబ్బు ఎక్కువ ఖర్చవుతుంది. వివాహ సమస్య తేలకముందే బాలికలు కళాశాల విద్య ముగించటము కూడా జరుగుతున్నది. ఆపైన ధనవ్యయము చేసి ఉన్నత విద్య నభ్యసించిన బాలికలు వివాహసంగమూ లేకుండా ఉండటము ఎంతవరకూ ఉచితము?

## గృహిణి

సామాన్య సంసారాలలో సంతానముతో గృహిణి పడేపాట్లు కంటితో చూసి తెలిసికొనవలసినదే కాని ఊహించ నలవి కావు. ఈ కాలములో ఆహారపదార్థాలలో దేనిలో ఉండవలసిన పుష్టి శక్తి దానిలో ఉండటము లేదు. మందుల సహాయము లేనిదే సామాన్యముగా బిడ్డలు పెరగటము లేదు. వైద్యసహాయము మందులసహాయము లేనిదే గర్భిణి తొమ్మిదినెలలూ మోసి బిడ్డను కనలేకుండా ఉన్నది. ఈ పరిస్థితులలో ప్రతి సంసారములోనూ వైద్యోపచారాల కింద ఎంత ధనము వ్యయమవుతున్నదో లెక్క లేదు. బాల్యదశ విడిన బిడ్డలు, బాల్యదశలో ఉన్న బిడ్డలు పాఠశాలకు వెళ్ళి చదువుకొనేవారే. వాళ్ళకు తగినట్లుగా పుస్తకాలు స్కూలుఫీజు బట్టలు మొదలైనవాటి క్రింద అయే ఖర్చులు ఉండనే ఉన్నాయి. ఒక్కొక్క సంసారములో గృహిణి ఎంత కష్టపడినా నిర్వహించలేకపోతున్నది. ఇంత సంసారభారము ఒక వ్యక్తి సంపాదనమీద ఆధారపడి ఉన్నందువల్ల ఈ భారము భరించరానిదవుతున్నది. ఈ పరిస్థితులలో గృహిణి ఆరోగ్యముగా ఉండి, తగిన సామర్థ్యము కలదైనప్పుడు ఉద్యోగము చేయపూనుకొనటము దోషమా?

## అవరోధాలు

గృహిణి, ఉద్యోగము చేయటమువల్ల మామూలు గృహజీవనానికి భంగము కలుగుతుందేమోననే శంక కలగటము సహజము. ఆర్థిక సదుపాయాలను వృద్ధిపరచుకోవటమూ కుటుంబాభ్యుదయమూ ప్రధానాశయాలయినప్పుడు స్త్రీ ఉద్యోగము చేయటానికి పూనుకుంటే పెనిమిటి అపార్థము చేసుకోకూడదు. న్యూనతగా భావించకూడదు. దంపతులిద్దరూ తమ సంసార బాధ్యతలను గురించి చక్కగా అర్థముచేసుకుని వాటిని పరిష్కరించుకొనే నిమిత్తము ఉద్యోగమొక సాధనగా తీసుకుంటే ఆటంక మెక్కడిది? ఇద్దరి అభిప్రాయాలూ ఒకటైనప్పుడు-ఇంటిలో తగిన సర్దుబాటు చేసుకోవటము చాలా తేలికైన పని. దంపతులిద్దరూ సంసారాభ్యుదయముకొరకు ఏపని తలపెట్టినా సర్దుబాటు చేసుకొనగలుగుతారు. కాని ఇద్దరిలో ఏ ఒక్కరికి స్వార్థముస్నా అభిప్రాయాలు కలవకపోయినా ఆ సంసారము విరిగిన పాలవలెనే ఉంటుంది.

స్త్రీలు ఉద్యోగాలలో ప్రవేశిస్తే మన 'సంస్కృతీ, మన సంప్రదాయాలూ నశించిపోతాయి - మన విజ్ఞానము క్రమముగా అంతరించిపోతుంది' అనే సందేహాలు ఉన్నాయి. ఉగ్గుపాలతో నేర్పిన మన సంస్కృతినీ సంప్రదాయసిద్ధమైన ఆచారాలను స్త్రీలు ఉద్యోగాలలో ప్రవేశించగానే మరచిపోతారా? వాళ్ళు ఒకవేళ మరచిపోయినట్లైతే ఆ దోషము వాళ్ళది కాదు. వాళ్ళకటువంటి లోపభూయిష్ఠమైన శిక్షణ నిచ్చిన తల్లిదండ్రులదవుతుంది.

'బిడ్డల పోషణకు ఆటంకము కలుగుతుందేమో - వాళ్ళను సేవకులమీద వదలిపెట్టటమువలన సుశిక్షితులు కారేమో' అనే సందేహాలకు కూడా అవకాశమున్నది. దానికి తగిన సదుపాయాలు చేసుకొనిగాని స్త్రీ ఉద్యోగానికి బయలుదేరకపోవటము మంచిది.

## నైతిక పతనము

స్త్రీలు ఉద్యోగాలకు బయలుదేరితే నైతికముగా పతనము తప్పదనే వాదమొకటి ఉన్నది. దీనిలో కొంత నిజము లేకపోలేదు. కొన్నికొన్ని శాఖలలో అధికారుల వద్ద మెలగటము స్త్రీలకు కష్టముగానే ఉంటున్నది. స్త్రీఉద్యోగుల వినయవిధేయతలను దుర్వినియోగము చేసే అధికారులు ఉండటము అరుదు కాదు. తనకు లోబడని వ్యక్తులను పైకి రానివ్వనివారు అధికారులలో చాలామంది ఉన్నమాట నిజమే. పంతులమ్మలను ఇబ్బందులు పెట్టే ప్రధానోపాధ్యాయులు, ఇన్‌స్పెక్టర్లూ, నర్సులను ఏడిపించే డాక్టర్లూ, విద్యార్థినులను అగచాట్లపాలు చేసే అధ్యాపకులూ అనేకులున్నారు. స్త్రీలు పురుషులు ఎక్కడ చేరుతారో అక్కడ ఇటువంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు చాలా ఉన్నాయి. వీటిలో సగమువంతు సంధికాలపు తొట్రుపాటు మాత్రమే. ఏ పరిస్థితులలోనయినా శీలాన్ని కాపాడుకొనటానికి తగిన కట్టుదిట్టాలను చేసుకోవటము అవసరమే కదా!

## సదుపాయాలు

స్త్రీలు ఉద్యోగాలు చేయటానికి నిర్ణయించుకొన్న తరువాత ఇళ్ళలోనే కాకుండా ఆఫీసులలో కూడా కొన్ని మార్పులు చేయటము చాలా ముఖ్యము. పసిబిడ్డ తల్లులకు బిడ్డలను వెంటతీసుకొని వచ్చి అక్కడ ఉంచుకొనే ఏర్పాట్లు జరగాలి. తగు ఏర్పాటుతో ప్రత్యేకంగా స్త్రీల కొరకు విశ్రాంతిగదులు ఉండాలి. స్త్రీలకు పసిబిడ్డ ఎలవెన్సు ఉండాలి. వాళ్ళకు ప్రత్యేకమైన సెలవునియమాలు ఉండాలి. ప్రతి శాఖలోనూ స్త్రీల గౌరవభంగము లేకుండా ఉద్యోగాలు చేయగలిగేటట్లు భద్రతానియమాలు, హాస్టళ్ళు, తగిన వసతులు ప్రభుత్వము కల్పించాలి.

ప్రతిగ్రామము నగరములోనూ మూడు సంవత్సరముల బిడ్డలను పంపటానికి వీలైనకిండరుగార్టెనుస్కూళ్ళను విరివిగా స్థాపించాలి. వాటిలో తక్కువ ఆదాయము గలవారి బిడ్డలకు ఉచితముగా ప్రవేశము కలిగించాలి. ఆరోగ్యవంతమైన పుష్టికరమైన ఆహారము స్కూళ్ళలోనే బిడ్డలకు లభించాలి. వారికి ఉచిత వైద్యసహాయము జరగాలి.

ఉద్యోగాలు ప్రభుత్వపరమైనవి కాక మరే యితరములైనా ఈ సౌకర్యాలు ప్రతి స్త్రీ ఉద్యోగికీ అవసరము. స్త్రీల ఉద్యోగ సమయము వారికనుకూలముగా మార్చటము చాలా ముఖ్యము. హైదరాబాదులో ఉద్యోగులకు కూడా కళాశాల విద్యాసౌకర్యాలను కలిగించటానికని సాయంకాల కళాశాలలు స్థాపించారు. వాటిలో విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణులయినవారి సంఖ్య చాలా తృప్తికరముగా ఉన్నదని విద్యాధికారులే చెప్పుతున్నారు. అవిధముగానే స్త్రీలు ఉద్యోగాలు చేయటానికి వారికనుకూలమైన సమయము మధ్యాహ్నము 11 గంటలనుండి మూడువరకు గాని సాయంకాలము 4 గంటలనుండి ఎనిమిదింటి వరకూ

గాని ఉండాలి. స్త్రీ ఉద్యోగులకు సాధ్యమైనంతవరకూ బదిలీ ఉండకూడదు. ఒకవేళ ఉన్నా భర్త ఉన్న చోటనే ఆమెను కూడా ఉంచే ఏర్పాటు చేయాలి. చిన్న విషయములలో కూడా తగిన కన్సెషను చూపించాలి. స్త్రీలు ఉద్యోగాలు చేయటములో ఆక్షేపణ చూపించకుండా సమాజము తగిన ప్రోత్సాహ మివ్వాలి. ప్రభుత్వము తగిన సౌకర్యాలను వసతులను కలిగించాలి.

# ★ స్త్రీలు - ఉద్యోగాలు ★

## స్త్రీల పరిస్థితులు

ఉద్యోగాలు చేయటానికి తగిన సౌకర్యాలు వసతులు కల్పించబడ్డాయని ప్రస్తుత పరిస్థితులలో ఎంతమంది స్త్రీలు ఉద్యోగాలకు బయలుదేర గలుగుతారు? ఎంతమంది దగ్గర ఉద్యోగాలు చేయటానికి తగిన యోగ్యత (*qualifications*) ఉన్నది? ఇంటా బయటా కూడా సర్దుకొనిపోయే సామర్థ్యమూ ఆరోగ్యమూ ఎంతమందికి ఉన్నాయి? రెండు కాన్పులతోనే నడుము వంగిపోయి రక్తహీనతకు పాల్పడిన గృహిణిని 'ఉద్యోగము చేస్తావా?' అని అడిగి చూడండి? ఉద్యోగాలు చేయటానికి స్త్రీలందరూ బయలుదేరుతారేమో ననుకోవటము భ్రమ. దానికి తగిన ఆరోగ్యము, సామర్థ్యము, యోగ్యత, సంసారములో తగిన సర్దుబాటుగల స్త్రీలే ఉద్యోగాలలో ప్రవేశిస్తారు.

'ఆఫీసులకు వెళ్లి చేస్తేనే ఉద్యోగము' అని స్త్రీలందరూ బైటకివెళ్ళాలని కాంక్షించటము కానిపని. బయటికి వెళ్ళి ఉద్యోగము చేయటానికి తగిన అవకాశము తమకు లేదని స్త్రీలు నిరుత్సాహపడకూడదు. ఆర్థిక సదుపాయాలను వృద్ధిచేసుకోవటమే ప్రధానాశయ మనుకొన్న స్త్రీలకు అనేక ఉపాయాలు ఉన్నాయి.

ఉద్యోగాలు చేయవలెనన్న ఉత్సాహము సామర్థ్యమూ కలవారికి దానికి తగిన విద్య లేనప్పుడు ఏం చెయ్యాలి? చాలా మంది తీరిక సమయాలలో హిందీ నేర్చుకుంటున్నారు. ఆవిధముగానే ఓరియంటల్ పరీక్షలలో ఉత్తీర్ణులు కావచ్చును. ఈ యోగ్యత కలిగినవారికి ఉపాధ్యాయినీపదవులు లభించగలవు. పగటిపూట విద్యగరపే ట్యుటోరియల్ సంసలు బనారసు, ఆంధ్ర, నాగపూర్ మెట్రిక్ పరీక్షలకు విద్యార్థులను తయారుచేస్తున్నాయి. వాటివల్లకూడా లాభము పొందవచ్చును.

జాతీయప్రణాళిక ననుసరించి నర్సుల శిక్షణకేంద్రాలు అనేకము స్థాపింపబడుతున్నాయి. స్త్రీలు వాటిలో శిక్షణ పొందవచ్చు లేక శిక్షణ నివ్వవచ్చు. చేతిపనుల కేంద్రాలు అనేక మున్నాయి. వాటిలో కూడా పనిచేయవచ్చును. వయోజన పాఠశాలలు విరివిగా స్థాపించుతున్నారు. వాటిలో స్త్రీలు పాల్గొనవచ్చు. జాతీయ ప్రణాళికలో పనిచేయగల స్త్రీలకు చాలా అవకాశమున్నది.

గానకళలో ప్రవేశముగల స్త్రీలు పగటివేళ నడుపబడే పాఠశాలలో పనిచేయవచ్చును. అన్నిరకముల దుస్తుల కత్తిరింపులను నేర్చుకొని పగటివేళ తోడిస్త్రీలకు నేర్పవచ్చును. బట్టలను కుట్టించి అమ్మటానికి కోఆపరేటివు సంస్థలు స్థాపించుకొని వాటిలో పనిచేయవచ్చును.

పచ్చళ్లు పిండ్లు అప్పడాలు వడియాలు నేతులు మొదలైన పదార్థాలను పెద్దఎత్తున తయారుచేయించి కోఆపరేటివు స్టోర్సుకు పంపవచ్చును. ఈవిధముగానే చేతిపనులను సార్థకపరుచుకొనవచ్చును.

స్త్రీలకు గ్రంథాలయాలలో పనిచేయటము ఏమంత కష్టమైన పనికాదు. సాయంకాలము వేళ చేయతగిన పని కనుక ఏవిధమయిన అభ్యంతరమూ లేకపోవచ్చును.

ఈవిధముగానే స్త్రీలు గృహబాధ్యతలను నిర్వహించుకొంటూ ఇతరముగా పనులు చేయటానికి అనుకూలించేవి చాలా ఉన్నవి. అన్నివిధములైన వసతులు స్త్రీల కొరకు ప్రత్యేకముగా కల్పింపబడటము ముఖ్యము. స్త్రీలు సంపాదనకు దిగటము గౌరవహీనమని సమాజము తలచకుండా ఉండటము మరింత ముఖ్యము.

## ప్రధానాశయము

స్త్రీలు ఉద్యోగాలలో ప్రవేశించినంత మాత్రాన వివాహాలు అనవసరమని ఎంత మాత్రమూ తలచకూడదు. అందరికీ జీవితములో ద్రవ్యసంపాదనే ప్రధానాశయమని భావించకూడదు. గౌరవముగా ఉద్యోగాలు చేస్తూ తగిన యువకుడు లభిస్తే వివాహాలు చేసుకోవాలని చాలామంది స్త్రీలు ఆశిస్తున్నారు. అయితే విద్యావతియైన బాలికను వివాహము చేసుకోవటానికి విద్యాధికుడైన యువకుడు ఎంత వెనుకతీస్తున్నాడో - ఉద్యోగము చేసే స్త్రీని వివాహము చేసుకోవటానికికూడా అంతే వెనుకడుగు వేస్తున్నాడు. పురుషుడికంటె స్త్రీ వయసులో తక్కువ ఉండాలని పెద్దలు నిర్ణయించారు. పోనీ జోడు కుదరటానికని కొంత ఎత్తు కూడా తక్కువగా ఉంటే బాగుంటుందనుకున్నారుగాని తెలివి, సామర్థ్యమూ కూడా అన్నివిధాలా తక్కువగా ఉండే పిల్లను చూసి చేసుకొమ్మని అనలేదుకదా! తనతో సమానముగా చదువుకొని ఉద్యోగము చేయగల బాలికలను వివాహము చేసుకొనగల ధైర్యము యువకలోకము పెంపొందించుకోవటము జాతీయాభివృద్ధికి ముఖ్యము. యువతీ యువకులలో - భార్యాభర్తలలో ఉండే ఈ విధమైన కాంప్లెక్సు (*Complex*) ఎంత తొందరగా నశిస్తే అంత తొందరగా మన సంసారాలు బాగుపడి దేశాభ్యుదయానికి దోహదమివ్వగలవు. ఇంతకూ చెప్పవచ్చిన దేమంటే ఉద్యోగము చేయదలచినంత మాత్రాన స్త్రీ సంసారాన్ని త్యజించి పారిపోతుందని భయపడ నవసరములేదు - ఉద్యోగము చేస్తున్నంత మాత్రాన స్త్రీ తన శీలము పోగొట్టుకొనదు. ★

వనితాలోకం సీరియల్

# స్వయంసిద్ధ



## 4

బాపులీ జమీందారుగారి సంపత్తి - ప్రతిపత్తి చూసినవారంతా ఈయన క్రితం జన్మలో ఎంతో మహాపుణ్యం చేసుకుని ఉండకపోయినట్లయితే ఇంత ఐశ్వర్యవంతుడు కాగలిగేవాడు కాడని అనుకునేవాళ్లు. కాని ఈభాగ్యశాలి సాంసారిక విషయాలు వారికంతగా తెలియనట్లేఉంది. తెలిసిఉన్నట్లయితే ఇంత ఐశ్వర్యం, ఇంత అధికారం ఉన్నా ఈ విచిత్రవ్యక్తికి ఇంతకుమించిన దుఃఖంకూడా ఉన్నదన్న సంగతి గ్రహించేవారే.


హరినారాయణబాబుకి తండ్రి చిన్నతనంలోనే పోయాడు. కాని ఆత్మీయుల సహకారంవల్ల, వాత్సల్యమూర్తి అయిన తల్లి గారాబంగా సాకటంవల్లఅప్పుడాలోటు అతడికి లోటుగానే అనిపించలేదు. యౌవనదశలో ఉండగా తల్లి గతించినప్పుడు సహధర్మచారిణి అయిన సులోచన సాహచర్యం అతడికెంతో సాంత్వనం కలిగించింది. కాని యౌవనంకూడా వెనక్కి దిగజారి ప్రౌఢదశలో పాదం పెడుతున్న రోజుల్లో సులోచన భర్తబాహుబంధాన్ని విడగొట్టుకుని పరలోకానికి ప్రయాణమైంది. అప్పుడే జమీందారీగాని, ఈ విపులైశ్వర్యంకాని, ధైర్యసాహసాలుకాని అతడికేమాత్రం రక్షణ కలిగించలేక పోయాయి. దుఃఖమనేది ఎంత పీడిస్తుందో, మనస్సుని ఎంతగా కోస్తుందో హరినారాయణబాబుకి అప్పుడే ప్రప్రథమంగా అనుభవంలోకి వచ్చింది. ప్రియావిరహంలో అతీతస్మృతులెన్నో అనుక్షణం కాటు వేస్తూనే ఉంటాయి. వారి దేవిడీలో ఆశ్రితులైన ఆత్మీయులకి కొదువేం లేదు. అయినా సాంత్వనమెవరు కలిగించగలరు! పరమసాధ్విఅయిన సులోచన వీరినందర్నీ ఒక కంట కనిపెట్టి కాపాడుతూండేది. ఆ కరుణామయి అంతర్ధానం కావటం వల్ల అందరికీ మతిపోయినట్లయింది. రెండు సంవత్సరాల శిశువుని-గోవిందుని భర్తకప్పగించి పరలోకగతురాలైంది సులోచన. హరినారాయణబాబు ఆ పసికందుని చూసుకుంటూ భార్యావియోగదుఃఖాన్ని మరచిపోవాలని ప్రయత్నించాడు. కాని సాధ్యం కాలేదు. తండ్రి గారాబం చేసినంతమాత్రాన పిల్లవాడు తల్లిని మరిచిపోలేదు. ఇంట్లో ఉన్న పరిచారికలూ, పరిజనులూ అందరూ అస్తమానం ఏడుస్తూఉంటే పిల్లవాణ్ణి చూసి కంగారుపడసాగారు. ఏం చేసినా ఊరుకునేవాడుకాదు. 'అమ్మదగ్గిరికి పోతాను' అని ఒకటేయేడుపు. పుట్టెడు దుఃఖంలో మునిగిఉన్నా హరినారాయణబాబు ఈవిషయమై చాలా ఆలోచించాడు. అతడికి శైశవంలోనే తండ్రిపోయాడు. యౌవనంలో తల్లిగతించింది. అయినా అతడెంతగా బెంబేలుపడిపోలేదు.

పౌరుషం, అభిమానం ఆ నలభైసంవత్సరాల జమీందారుహృదయాన్ని కలచివేశాయి. మామూలు మానవులలాగా తానుకూడా పదిమంది సానుభూతివాక్యాల కోసం అపేక్షపడితే, ఇదివరకుదాకా తన యెదుట పడటానికి కూడా సాహసం లేనివారంతా ఈ అవకాశాన్ని ఊతగా తీసుకుని మరీ దగ్గిరికి చేరటానికి ప్రయత్నిస్తారు. ఈ ఆలోచన రావటంతో అయన దుఃఖాన్నంతా అతిప్రయత్నం మీద ఎలాగో దిగమ్రింగి మళ్లీ ఎంతో ఉత్సాహం తెచ్చిపెట్టుకుని జమీందారీ వ్యవహారాలు చూసుకోటం మొదలెట్టాడు. దుఃఖవిహ్వలుడైన జమీందారుగారు హఠాత్తుగా మళ్లీ వ్యవహారాల్లో ఇంత ఆసక్తిని కనపరచటం చూసి అందరూ హడలిపోయారు. 'పిల్లవాడి యేడుపు నా చెవిని పడిందంటే ఊరుకోను ఇహ. జాగ్రత్త' అని పరిచారికలనందర్నీ హెచ్చరించాడు. యజమానికి సంబంధించిన విషయాల్లో అందరూ ఎంతో జాగ్రత్తగా ఉండేవాళ్లు. పిల్లవాడి యేడుపు ఆయన చెవిని పడిందంటే తమకెవ్వరికీ ఇంక అక్కడ ఉండేందుకు ఆస్కారం ఉండదని తెలుసు వాళ్లకి. పిల్లవాడ్ని చూద్దామా రెండు నిమిషాలైనా ఏడుపుమాని ఊరుకునేట్లు లేడు. చివరికి, ఏడుపు మాన్పించటం ఎలా అనేది నిశ్చయించుకున్నారు. వీళ్ళలో ఒక పరిచారిక కలకత్తాలో ఓజమీందారు యింట్లో కొన్నాళ్లు పనిచేసింది. జమీందార్ల యిళ్లలో ఏడుస్తూ ఉండే బిడ్డల్ని ఏడుపు మాన్పించటం ఎలాగో తెలుసుకునే అది ఈ బాపులీజమీందారుగారి హవేలీలో ప్రవేశించింది. ఆపనే ఇక్కడా చేస్తే ప్రయోజనం ఉండకపోదు. కొద్ది పరిమాణంలో ఇంత నల్లమందు పాలుపట్టేటప్పుడు ఆ పాలల్లో కలిపిపట్టి - బిడ్డని నిద్రపోయేట్లు చేయటం మొదలెట్టింది. ఇహ ఎప్పుడూ పిల్లవాడు నిద్రమత్తుగానే ఉండేవాడు. తర్వాత యెప్పుడూ పసివాడి యేడుపు ప్రభువుగారిచెవిని పడనేలేదు.


పైకి జమీందారు చాలా కఠినుడిలా కన్పించేవాడు. ఇంత దుఃఖాన్ని ఈయన ఎలా దిగమ్రింగగలిగాడా అని అందరూ అనుకునేవాళ్లు. కాని మనస్సులో ఎంత

(30-వ పేజీ చూడండి)

మూలం : మణిలాల్ వందోపాధ్యాయ    అనువాదం : మదిపట్ల సూరి



కెరటాలతో చెలగాటం



—ఫొటో: జి. జి. కె. మూర్తి, గుంటూరు.

# ★ స్వయంసిద్ధ ★

బాధపడుతున్నాడో ఆదేవరికి తెలుస్తుంది: తెల్లవారేసరికి కన్నీటితో తడిసి ఉండే అతడి తలగడాను చూసి. ఈకతిరుడి మనః ప్రవృత్తి ఎలాంటిదయిందీ తెలుసుకునేందు కెవరికి పట్టింది?

ఆరేళ్ళు ఇలా గడిచిపోయాయి. జమీందారుగారు పగలల్లా ఆఫీసులో కూచుని శాసించటంతోనూ, మధ్యాహ్నమప్పుడు - రాత్రిళ్ళూ తన గదిలో కూచుని స్వర్గీయురాలైన సహధర్మచారిణిని తలచుకుంటూనూ కాలక్షేపం చెయ్యసాగాడు. కాని తలవని తలంపుగా జరిగిన ఓసంఘటనతో అతడి దిగుళ్లన్నీ మాయమైనాయి. బాసలీ జమీందారుకి పొరుగు జమీందారయిన రేవతీ మోహనరాయచౌధురీ అప్పుల్లో మునిగి హరినారాయణబాబుని ఆశ్రయించాడు. హరినారాయణబాబు పన్నెండులక్షల రూపాయలు అప్పుగా యిచ్చి అతడ్ని అప్పులబారినుంచి తప్పించాడు. రాయచౌధురీకూడా అందుకు కృతజ్ఞతగా తన యెస్టేట్ మీద అధికారాలన్నీ హరినారాయణబాబుకి దఖల్ పరిచాడు. ఈ కారణం మూలంగా ఈ రెండు కుటుంబాలకీ బాగా సన్నిహితత్వం ఏర్పడింది. తర్వాత రాయచౌధురీగారి కుమార్తె మాధురీదేవి - పదిహేడేండ్లయువతి - హరినారాయణగారి అంతఃపురంలోకి రాణీ హోదాలో ప్రవేశించబోతున్నదని తెలుసుకున్నప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు.

హరినారాయణబాబుకి కొంత ఖయాలీ ఉన్నమాటయితే నిజమే కాని, ప్రభుత్వం వారిచ్చే గౌరవబిరుదాలమీద మాత్రం అతడికెన్నడూ మోజులేదు. తన ప్రజలందరికీ అతడు ప్రాణతుల్యుడు. యెస్టేట్ లో ఎక్కడచూసినా అతడికి మంచిపేరుంది. మా 'రాజబాబు' 'రాజబాబు' అని అందరూ ఘనంగా చెప్పుకునేవారాయన్ని గురించి. ప్రభుత్వసంస్థలకి ఆయనెప్పుడైనా భూరివిరాళాలిచ్చినప్పుడూ కూడా అక్కడుండే కలెక్టర్ తో - కమీషనర్ తో - 'ఈ విరాళమిచ్చినందుకుగాను మీరు నాకు బిరుదేమైనా యిచ్చి నన్నుమాత్రం సిగ్గుపడేట్లు చేయకండి' అని ముందుగానే ప్రార్థించేవాడు.

హరినారాయణబాబు తనకేదైనా ఖయాలీ పుట్టినప్పుడు అసాధ్యమైన పనులనుకూడా ఎన్నో ఎలా చేసేవాడో, రేవతీ మోహనుడి కూతుర్ని కూడా దటుక్కున అలాగే వివాహమాడాడు. రేవతీ మోహనుడికి అప్పు పెట్టిన అష్టకోట జమీందారు పెద్ద వంశ గౌరవం లేనివాడు. అయినా అతడు మాధురీదేవిని తన కివ్వమని కోరాడు. రేవతీ మోహనుడికి రెండు చెవులూ చిల్లిపడ్డాయి. హరినారాయణబాబు అతడ్ని ఋణవిముక్తుణ్ణి చేశాడు. కాని చరిత్రహీనుడయిన అష్టకోటజమీందారు మాధురీదేవిని ఎలాగైనా వివాహం చేసుకోవాలని కుట్రలు పన్నసాగాడు. రేవతీమోహనుడు తన రాజ్యాన్ని రక్షించుకోటానికి ఎంతైనా ఖర్చుపెట్టేవాడు కాని, తగాదాలన్నా, కోర్టువ్యవహారాలన్నా అంత పట్టించుకునేవాడు కాదు. ఆ జమీందారు ఇలాంటి వాటిల్లో ఆరితేరినవాడు. తన కూతుర్నివ్వలేదనే కోపంతో అతడింకా ఏం చేస్తాడో అన్న భయంతో రేవతీమోహనుడు మరోసారి హరినారాయణబాబుని ఆశ్రయించాడు. వీరికీ - ఆ జమీందార్లకీ ఆదికాలం నుంచి ఏవో మనస్పర్థలుంటూఉండేవి. అతడిదంతా విని మండిపడ్డాడు. అష్టకోట జమీందారు కుతంత్రాలు పన్నుతూ ఉండగానే - హరినారాయణబాబు అందరూ విస్తుపోయేట్లు రేవతీమోహనుడి కూతుర్ని హఠాత్తుగా తానే వివాహం చేసుకుని, తన కోటలోకి రప్పించుకున్నాడు.

ఇది జరిగికూడా ఇరవై రెండు సంవత్సరాలు కావొచ్చింది. ఈ బాసలీ వారి దేవిడీలో ఎన్నో పరిణామాలొచ్చాయి. మాతృవిహీనుడైన గోవిందు డిప్పుడు ఇరవైనాలుగు సంవత్సరాల యువకుడు. తల్లిపోయిన క్రొత్తల్లో ఇతడు తండ్రికెంత సమస్యగా కన్పించాడో - అలాగే ఈనాటికీ సమస్యగానే కన్పిస్తున్నాడు. తండ్రి కీనాటికీ ఆ ఆందోళన, అదుర్దా తీరనే లేదు.

సిరి వంశంలో వారి వంశర్ని సృష్టించిన విధాతే ఇతణ్ణీ సృష్టించాడు. రూపురేఖల్లో దేహసౌష్ఠవంలో గోవింద గంగూలీ అందరిలాగానే ఉంటాడు. కాని ఈ వయస్సులో ఇంతటి కులీనులబిడ్డలకి సహజంగా ఉండే లావణ్యమూ, సుకుమారతమాత్రం అతడిలో లోపించాయి. పచ్చని దేహచ్ఛాయ అయినా కాంతివంతంగా ఉన్నట్లుండదు. ముఖంలో జడత్వం అచ్చుగుద్దినట్లుంటుంది. శరీరం సరియైన పోషణ లేక నేమో బిగుసువారినట్లుంటుంది. లేతవయస్సయినా కొంచెం ముదురువయసువాడిలా కనిస్తాడు. జుట్టు రాగిరంగుకు తిరిగింది. అతడి రూపురేఖల్లో ఈలోపాలతోపాటు కొన్ని ప్రశస్తమైన లక్షణాలుకూడా ఉన్నాయి. అరడుగుల పొడవు, ఆజానుబాహువు, కోటేరువేసినట్లుండే ముక్కు, చారడేసి కళ్లు - ఈలక్షణాలవల్ల చూపరులను ఇట్టే ఆకర్షిస్తాడు.

ఇంతవరకిది ఆకారవైఖరులకు సంబంధించిన గాథ. ఇక అతడి మనస్తత్వాన్ని గురించి ఆలోచిస్తే మాత్రం అన్నీలోపాలే. అతడిలో ముఖ్యమైనలోపం మానసిక దౌర్బల్యం. ఒత్తివద్దమ్మలా, [illegible] వాడిలా ఉంటాడు. అతడు బయట ఎవరితోనూ కలిసిమెలిసి తిరిగేందుకు వీల్లేదు. అలా తిరగగల స్తోమతా లేదు అతడికి. పేరుకిమాత్రమే జ్యేష్ఠుడు. ప్రాపంచిక జ్ఞానం మాట అలాఉంచి - అసలు ఆత్మగౌరవం కాపాడుకోవటంకూడా తెలియని జడుడు. పరిచారికలు పరిచారకులు ఎవరూ అతడ్ని లక్ష్యపెట్టరు. ఆశ్రితులూ - ఆత్మీయులూ అతడ్ని గురించి అసలుపట్టించుకోరు. ఎవరైనా అతడ్ని ఆక్షేపించినా అభిమానపడడు. ఎవరైనా అతడిమీద అధికారం చలాయించబోయినా కోపం తెచ్చుకోడు. కనుక ఇంత 'సుద్ద-మొద్దు-స్వరూపు'డైన కుమారుడివిషయమై తండ్రికి అనవరతమూ ఆందోళనే అంటే అందులో ఆశ్చర్యం ఏముంది?

ఇక జమీందారుగారి రెండో భార్య కొడుకు - గోవిందుడి సవితి తమ్ముడు. నివారణు డున్నాడు. అతడు ఇతడికన్నా నాలుగేళ్లు చిన్నవాడైనా - అన్ని విషయాల్లోనూ అన్నగారిని వెనక్కులాగేసి, తండ్రితో సమానస్థాయిని అందుకోగలిగాడు. అవసరమొచ్చిందంటే జమీందారు ఎంత ముఖ్యమైన కార్యభారాన్నయినా అతడిమీద వేస్తాడు. అతడికి తండ్రిగుణాలు చాలా అబ్బినై. ఇంత చిన్నవాడైనా అతడంటే వారి కచేరిలో అందరికీ హడలే. ఇంట్లో దాసదాసీలు - ఆత్మీయులు - ఎవరైనాసరే, అతడి ఎదుటికివచ్చి మాట్లాడాలంటే గజగజలాడిపోతుంటారు. అతడి ఔద్ధత్యం ప్రతాపం తండ్రికంటే ముద్దటగా ఉండేవి. అతడ్ని చూసుకునవచ్చి - "ఇదే కావలసింది. ఈమాత్రం కరుకుతనం చూపగలిగితేనే - [illegible] అధికారం సాగుతూ ఉంటుంది." అనేవాడు తండ్రి.

జమీందారుగారికి పెద్దకొడుకంటే చాలా చులకనైనభావం ఉండటం, చిన్న

కొడుకంటే అపరిమితమైన ఆదరానురాగాలుండటం ఎస్టేట్‌లోని ప్రజలందరూ గ్రహించారు. అచిరకాలంలో నివారణుడే తమ 'భాగ్యవిధాత' అయేవాడు - అని అనుకుంటూ ఉండేవాళ్లు ప్రజలు.

ప్రజలకిలాంటి అనుమానం రావటానికి కూడా కారణం లేకపోలేదు.

తరతరాలనుంచీ వారి వంశంలో వస్తున్న పద్ధతి ఏమిటంటే ఆస్తి ఎవరూ పంచుకోటానికి వీల్లేదు. వంశంలో జ్యేష్ఠుడే ఎస్టేట్‌కి అధికారి. కనిష్ఠుంటే - వారికేదో నెలకింతనో, ఏడాదికింతనో జీవనభృతి యివ్వటమే. అందుచేతనే వారి ఐశ్వర్యం ఇప్పటివరకూ అవిచ్ఛిన్నంగా ఉంటూవచ్చింది. వారికి ఐశ్వర్యానికి తగినంత సంతానవృద్ధి ఎన్నడూ లేదు. భగవంతుడేదో ఆలోచించి సృష్టించినట్లు - ఆవంశంలో ఎవరికి చూసినా ఒక్కడే పుత్రుడుండేవాడు. ప్రస్తుతపు జమీందారైన హరినారాయణబాబు విషయంలోనే విధాత ఆ నియమానికి భంగం కలిగించాడు. ఈ వంశంలో రెండుపెళ్లిళ్లు చేసుకున్నదీ- ఇద్దరు పుత్రులున్నదీ ఈయన ఒక్కడే. కనుక ఇప్పుడు అధికారం ఏకొడుక్కి సంక్రమింపచేస్తాడన్న ప్రశ్న బయలుదేరటం సహజం కనుక ప్రజలలా ఊహించగలిగారు.

## 5

శ్యామాపురంలోని తమ ఏజెంటు చండిని గురించి అన్ని విషయాలూ విపులంగా రాసి పంపగానే హరినారాయణబాబు మాధురీదేవినిపిలిచి, "ఒక విలక్షణమయిన పిల్ల ఉన్నదని తెలిసింది" అని చెప్పాడు.

"గోవిందునిలాంటి వెర్రి బాగులవాడికి, తెలివితక్కువ దద్దమ్మకి పెళ్లి కూడా చెయ్యటం భావ్యంకాదు" అని మాధురీదేవి భర్తతో ఇదివరకు చాలా సార్లు చెప్పింది.

భార్య అలా అంటూంటే హరినారాయణబాబు ఆమె ముఖంకేసి నిదానించిచూసి, పెద్దనిట్టూర్పువిడిచి, "అవును. అదీ ఆలోచించాల్సిన సంగతే"అంటూ ఉండేవాడు.

ఆతర్వాత ఇహ ఎప్పుడువచ్చినా గోవిందుడివిషయం అలా ఉంచి, నివారణుడిపెళ్లి ప్రస్తావనే వస్తూ ఉండేది. భర్త తన మాటలువిన్నాక చేసిన సూచన్నిబట్టి ఆమె నిర్ణయానికి వచ్చింది. గోవిందుడు జ్యేష్ఠుడన్న హోదాలోనే ఉంటూ, కనిష్ఠులు తీసుకునేట్లు జీవనభృతిమాత్రం పుచ్చుకుంటూ ఒంటరిగానే కాలం గడుపుతాడని, ఆరోగ్యం విషయంలో, ఆయుర్దాయం విషయంలో - ప్రతి విషయంలోనూ సందేహాభాజనుడైన గోవిందుడు ఇకముందు సాంసారిక జీవితానికి దూరంగా ఉండేటట్లే - బాకులీజమీందారీ గద్దెకికూడా దూరంగా ఉండగలడని ఊహిస్తూవచ్చింది.

అంచేత భర్త విలక్షణమైన పిల్ల అని చెప్పగానే అది తనకుమారుడు నివారణుడ్ని ఉద్దేశించే చెప్పినమాటయి ఉంటుందని మాధురీదేవి గ్రహించింది. గ్రహించి కొంచెం వెటకారంగా - "పిల్ల అద్భుతమైన పిల్లయితే ఏమయినట్లు? వాళ్ల వంశంకూడా గొప్పదై ఉండొద్దూ?" అన్నది.

"శాస్త్రకారుడేమన్నాడో తెలుసా? 'స్త్రీరత్నం దుష్కులాదపి' అన్నాడు" అంటూ హరినారాయణబాబు నవ్వాడు.

మాధురీదేవి రుసరుసలాడుతూ "ఆ శాస్త్రాలూ అవీ తుంగలోతొక్కండి. రాజపుత్రిక కాకపోతే నివారణుడికీ నచ్చదసలు. నా ముచ్చటతీరదు. మీకు తెలియనిదేముంది? అసలింతకీ పిల్ల యొక్క జేమిటి?" అని అడిగింది.

భర్త గంభీరంగా తాను చెప్పిన దాన్ని ఉపసంహరించుకుంటూ "అయితే ఇహ విని మాత్రం ఏం ప్రయోజనం? నీముచ్చట సంగతి నాకు జ్ఞాపకమే లేదు. ఇహ ఏమయితే యేం - సంగతి గుర్తుపెట్టుకునే - నివారణుడికి తగిన పిల్లకోసం ప్రయత్నిస్తాను" అన్నాడు.

రెండురోజులు పోయాక మళ్లీ భార్యని పిలిచి, "గోవిందుడి వివాహం నిశ్చయం చేశాను. వచ్చేత్రయోదశినాడే ముహూర్తం" అని చెప్పాడు-హరినారాయణబాబు.

భర్తమాటలు వింటూంటే మాధురీదేవికి- పిడుగుపడ్డట్టు - చెవులు ఘుడియలుపడ్డాయి. గోవిందుడిపెళ్లా! తాను పొరపాటుగా వినలేదుకదా! ఆశ్చర్యంతో తడబడుతూ "ఎవరి పెళ్లిసంగతీ మీ రన్నది?" అని అడిగింది.

విన్నబోయిన భార్యముఖంకేసి రెప్పవాల్చకుండా చూస్తూ "నీపెద్దకొడుకు పెళ్లిసంగతి" అన్నాడు హరినారాయణబాబు.

మరుక్షణంలోనే ఆమె కొంచెం ఎత్తిపొడుపుగా - "నిజమే, అయితే పెద్దకొడుకుకి వచ్చిన ముదురుబెండకాయ అన్నపేరును ఎలాగైనా సరే పోయేట్లు చేయటానికి నడుంకట్టారన్నమాట! అవును అదీ అవసరమే" అన్నది.

భార్యకెందుకింత అయిష్టతో గ్రహించే హరినారాయణబాబు జవాబుచెప్పాడు - "ఇన్నాళ్లనుంచీ ఇది అంత అవసరమున్న సంగతి ఆలోచించలేదు. కాని పిల్లను చూశాక ఎప్పుడైతే నచ్చిందో అప్పుడే మా అబ్బాయికి చేసుకుంటామని మాటకూడా ఇచ్చివచ్చాను. పేదయింటిపిల్ల. ఆమె ఎంత రూపవతీ, గుణవతీ అయినా కానీ - తండ్రి అంత పేరుప్రతిష్ఠలున్నవాడూ - ఐశ్వర్యవంతుడూ, గొప్పవాడూ మాత్రం కాదు. నివారణుడి పెళ్లి విషయంలో అయితే మరి నీప్రతిజ్ఞ ఒకటి నెరవేరాలిగా! అంతంతమాత్రం సంబంధమయితే నీకు నచ్చదుగా! రాజపుత్రిక కావాలాయె. అందుకని నేను ఇచ్చినమాట నిలబెట్టుకోటానికి ఆ పేదపిల్లని గోవిందుడి కంఠానికి కట్టి - వాడికున్న ముదురుబెండకాయ అన్న పేరును తొలిగిపోయేట్లు చేయతలచుకున్నాను."

మాధురీదేవి భర్తమాటలన్నీ శ్రద్ధగావిని, ఈసారి పైకి కొంచెం గంభీరంగా "మంచిపని చేశారు. జడభరతుడులాంటి జమీందారుబిడ్డ - ఓ పేదయింటి విచిత్రమైన పడుచు! ఈ ఇద్దరిపొత్తూ చాలా బావుంటుంది!" అన్నది.

భర్త ఉత్సాహంతో "సరియైనమాట చెప్పావు. నేననుకున్నదీ అదే. అంచేతనే నేనూ చాలాదూరం ఆలోచించి మన ఈ మందకొడి రాదారి పడవని - ధాటీగా పరుగెత్తే 'సీమ్‌లాంచ్'ని తీసుకొచ్చి కట్టేందుకు యేర్పాట్లు చేశాను. బహుశా దీనివల్ల కలిగేఫలితం మంచిదే అయి ఉండొచ్చు" అన్నాడు.

ఈ విషయమై ఇంక వేరేమాట లేపీ రాలేదు. కాని అర్థం చేసుకోగలిగితే ఆ మాటలే చాలు. భర్త చివరికన్నమాటలు మాధురీదేవి హృదయాన్ని పురుగు తొలిచినట్లు తొలిచి, చురుకు చురుకు మంటలు పుట్టించసాగాయి. ఇరవైరెండు సంవత్సరాలనుంచీ తాను ఈకుటుంబ శకటాన్ని తప్పుదారిని నడిపిస్తూ వచ్చిందా? భర్త హృదయంలోని ఆంతర్యం తానిన్నాళ్ళనుంచీ గ్రహించనే లేకపోయిందా? తన పుత్రుడు నివారణుడు గద్దెయెక్కి సుస్థిరంగా ఉండేందుకుగాను - మెల్లిమెల్లిగా అన్నివైపులనుంచీ ఆటంకాలను తొలగించటానికి చేస్తున్న ప్రయత్నమంతా వృథాప్రయాసే అవుతుందా?... (సశేషం)

# నా కథానికా రచన

రోజూ రాత్రిపూట భోజనాల దగ్గర గంటల తరబడి లోకాభిరామాయణం వేసుకోవటం మా ముగ్గురికీ అలవాటు. ఆ అలవాటు చొప్పునే నిన్న రాత్రి ఒక టాపిక్ లోంచి ఒక టాపిక్ లోకి కప్పగంతులేస్తూ చివరికి సాహిత్యంలో పడ్డాము. మా మరది అంటాడు, 'పూర్వజన్మసుకృతం లేందే ఎవరికీ కవిత్వం అలవడదు' అని. నేనేమో 'మహాకావ్యాలు వ్రాయటానికైతే పూర్వజన్మ సుకృతం ఉండాలిగానీ, చిన్న చిన్న కథలు వ్రాయటం ఏమంత కష్టం కాదు, ఎవరైనా వ్రాయగలరు' అంటాను. మా మరది ససేమిరా ఒప్పుకోడు. ఇల్లాగే గంటన్నర గావుకేకలతో వాదన జరిగాక మా వారు మా యిద్దరి మధ్యా రాజీ చేసేరు. అదేమిటంటే, రేపు రాత్రి లోపుగా ఇద్దరిలో ఎవరైతే ఒక కథ రాయగలరో, వారికి రెండోవారు క్షమార్పణ చెప్పుకుని తమ భావం మార్చుకోవాలి. సరే అంటే సరే అనుకున్నాము.

ఇంట్లో పని ముగించుకుని పక్కమీదికి చేరనే గాని, రేపు గెల్చే విధమేమిటా అని ఒకటే ఆలోచనతో సరిపోయింది. మా మరది నిరుద్యోగ డిపార్టుమెంటులో సెక్రటరీ. ఆ పదవి చాలక ఆయన ఇరవైనాలుగు గంటలూ కథలు వ్రాస్తూనే ఉంటాడు. ఆయన రాసిన కథలు పత్రికలవారికి అర్థం కాక తిరిగి వచ్చేస్తూ వుంటాయి. అయితేనేం ఒక్కొక్క కథ తిరిగివస్తూ ఉంటే మరింత ఉత్సాహంతో వ్రాసేస్తూనే ఉంటాడు. అటువంటి జగజెట్టితో నేను పందెం వేసుకోటం అనుచితం అని తోచింది కానీ, ఇంతలో అభిమానం అడ్డువచ్చింది. ఇన్ని పత్రికలు, పుస్తకాలు చదువుతున్నాం గదా, ఒక్కటుంటే ఒక్కటి ఏదో వ్రాయలేకపోతానా అని ధీమా. ఏమిరాద్దామా అని ఆలోచించటం మొదలుపెట్టాను. కానీ ఏదీ అంతు చిక్కటంలేదు. ఆలోచించి, ఆలోచించి బుర్ర వేడెక్కిపోయి, ఒక్క కథ అన్నా అల్లలేని నా అశక్తతను నిందించుకుంటూ కళ్ళుమూశాను.

"అమ్మగారూ, అమ్మగారూ" అని పనిమనిషి పిలుస్తుంటే - ఉలిక్కిపడి లేచాను. తెల్లగా తెల్లవారింది. అయ్యో, ఆలస్యమయిందే అని లేచి, రోజువారీ కార్యక్రమంలో లీనమయాను. మాటిమాటికీ రాత్రిసంగతే గుర్తుకువచ్చి, కథావస్తువు గురించి మనస్సులో మెదుల్తూంటే ఆ భావాలని బలవంతంగా నొక్కేసి పని చేసుకోవాల్సి వచ్చింది. మిన్నువిరిగి మీదపడ్డా వంటపని తప్పదుగా! ఎనిమిదిగంటలకి వంటఇంట్లో ప్రవేశించి మళ్ళీ బైటపడేసరికి గోడగడియారం టంగు టంగున పన్నెండుకొట్టింది.

**యస్. యస్. ప్రసూన**

పిల్లలు స్కూలుకి వెళ్ళేరు, శ్రీవారు మామూలు డ్యూటీ బుజాన వేసుకుని ఆఫీసుకు దయచేసేరు. ఇదే నా కథ వ్రాసేటందుకు అనుకూలమైన సమయం అనుకుని, కలం కాగితాలు ముందేసుక్కూచున్నాను మళ్ళీ రాత్రి ఆలోచనే ఏమి కథ వ్రాయను? ఇదివరలో చదివిన కథలన్నీ ఓమాటు మనస్సులో తిరగేసుకున్నాను. ఊహూ! ఒక్కటీ గుర్తుకు రావటంలేదు. పోనీ మానేద్దామా అనుకున్నా. ఛీ. ఇంత మనోధైర్యం లేకపోవట మేమిటి? పట్టుదలతో కృషిచెయ్యాలి గాని, అని మళ్లీ మనస్సుని దిటవు పర్చుకున్నా. ఇంతలోనే మెరుపులాంటి ఆలోచన ఒకటి వచ్చింది. అటువంటి ఆలోచన వచ్చినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను. అదేమిటంటే-నాకు చిన్నప్పటినుంచీ జానపద కథలంటే చాల ఇష్టం. అందుకని ఒక రాజకుమారుడు, రాజకుమార్తెని సృష్టించి, వారిద్దరు ప్రేమించుకునేట్టు చేసి వారి ప్రేమ సఫలత కోసం వారిచేత అద్భుతమైన సాహసకృత్యాలు చేయిస్తే సరి; ఓ మంచి కథ తయారవుతుంది అనుకున్నాను.

మొదలుపెట్టటం ఎట్లాగా అని మళ్ళీ ఆలోచన. ముందు రాజకుమార్తెని, రాజకుమారుణ్ణి ఒకరికొకర్ని పరిచయం చేద్దాం అనుకున్నా. ప్రేమికులు కలుసుకునేది సాధారణంగా వెన్నెల రాత్రులని చాలామంది కవులు వ్రాస్తారు. రాజోద్యానవనంలో రాజకుమారి నిద్రపట్టక విహరిస్తూ వుంటుంది. అది చీకటిరాత్రి. ఆకాశమంతా విరగబూసిన మల్లెపందిరిలా వున్నది. వనంలో పుష్పరాజాలన్నీ తమ తమ సౌరభాల్ని పవనకుమారునికి కానుకగా ఇచ్చే శుభసమయం.

ఇల్లా కొంత మొదలెట్టానో లేదో, "ఏం చేస్తున్నావమ్మా" అంటూ పక్క ఇంటి అవ్వగారు ప్రత్యక్షం. చచ్చాంరా బాబూ అనుకున్నా. ఇంకేం వుంది. గుండెల్లో రాయి పడి, ఐడియాకి బ్రేకు పడింది.

లేని నవ్వు తెచ్చుకుని "రండి బామ్మగారూ" అని ఆహ్వానించాను.

"ఏం చేస్తున్నావమ్మా లలితమ్మా" అని ఆమె అడుగుతుంటే ఏమి చెప్పాలో తోచలేదు. చేస్తున్న పని చెప్పినా లేక ఏదన్నా చదువుతున్నానని చెప్పినా ఆమె వూరుకుంటుందా? రామాయణ, మహాభారతాలు తప్ప ఇంకేవీ మన స్త్రీలు చదవరాదనీ, అల్లా ఇంకేవయినా చదివినవాళ్ళందరూ చెడిపోయినవాళ్లకింద లెక్కనీ ఆమె అభిప్రాయం. అందుకని, "ఏమీ లేదు బామ్మగారూ. మా తమ్ముడు క్షేమం తెలిసి చాలా రోజులయింది. వాడికో వుత్తరం వ్రాస్తున్నాను" అని సర్ది చెప్పేను.

ఇహ ఆమెగారు తమ రామాయణం విప్పేరు. వారింట్లో సంగతులు, వీరింట్లో తగూలు ధారాపాతంగా చెప్పుకుపోతున్నారు. నేను 'వూ' కొడుతున్నా నన్నమాటేగానీ, ఈవిడని ఎల్లా వదిలించుకోనా అని ఆలోచిస్తున్నాను. ఉన్నట్టుండి, "ఇది విన్నావుటమ్మా లలితా, ఎంత విపరీతమో!

కలియుగమమ్మా తల్లీ; కలియుగం మండిపోతోంది!" అంటూ ఏదో ప్రమాదకరమయిన వార్త చెప్పబోయారు. నేనూ ఏమిటా అని విస్తుపోయి "ఏమిటి బామ్మగారూ" అని అడిగేను.

"నువ్వు వినలేదూ, అయ్యో పిచ్చితల్లీ! లోకమంతా కోడయి కూస్తున్నదమ్మా! ఏమిటో నీ సంసారం పిల్లలూ తప్ప మరోటి అక్కర్లేదు, సత్తెకాలపు పిల్లవి." అని నన్ను ఉబ్బేసి, అతి రహస్యం చెప్తున్నట్టు చెవిదగ్గరగా వచ్చి, "కొత్తగా వూళ్ళోకి రాలా, హెడ్డు గుమాస్తాగారు, వారి కోడలుట! మొగాడిలాగా బెజవాడలో ఉద్యోగం చేస్తున్నదిట! అయ్యో... అయ్యో ఇవేమన్నా బాగుపడే బుద్ధులేనా చెప్పు" అని రెండు బుగ్గలూ నొక్కుకున్నారు. నాకు ఈ సంగతి ఇదివరకే తెలుసు. కానీ, ఆమెముందు తెలిసినట్టు ప్రవర్తించటం మంచిదిగాదు. పైగా ఇటువంటి విషయాలు ఆమెకి నచ్చచెప్పటానికి ప్రయత్నించామో, ఇహ ఇటు ఏడుతరాలు అటు ఏడుతరాల వారినీ దీవించి మరీ వెళ్తుతుంది. ఆమె చెప్పినవన్నీ విని వూరుకోటమే మంచిది. నేనేమీ మాట్లాడలేదు.

తన పాచిక పారలేదనుకున్నది కాబోలు "వెళ్ళొస్తా తల్లీ, మళ్ళీ ఈ సంగతి ఎవరితోనూ అనకు సుమా" అని ఆమె నిష్క్రమించారు.

బతికేంరా బాబూ అని మళ్ళీ కలం తీసుకున్నాను. ఇంతలో గదిలోంచి తేలు కుట్టినట్టుగా ఒక్క గావుకేక పెట్టేడు మా మరది. ఏమిటో అని పోయి చూద్దును కదా, పొట్టపట్టుకుని నవ్వుతున్నాడు.

"మీ సంభాషణ అప్పుడే అయిందేం?" అంటూ మళ్ళీ నవ్వడం మొదలుపెట్టేడు. అప్పటికి తెలిసింది. "అవును గానీ వదినా రోజుకి ఇరవైసార్లయినా నీ ఆదర్శాలు ఆశయాలు వల్లెవేస్తూవుంటావు. మరి ఒక్క ముసలిఆమెకే జవాబు చెప్పలేకపోయావేం? మంచి ఆదర్శవంతురాలవేలే" అంటూ ఎద్దేవా మొదలుపెట్టేడు. నాకు కోపం వచ్చింది.

"అవునులే ఎప్పుడు పీలుచిక్కుతుందా హేళనచెయ్యటానికి అని కనిపెట్టి కూర్చుంటావులే."

ఇంత చదువుకున్నా నే చెప్పేది నీకే అర్థం కాదయ్యె; ఇహ ఆమెగారికా చెప్పేది. మన మాట అర్థంచేసుకు నేపాటి సంస్కారం లేనివాళ్ళతో మనం వాదించేకంటే నోరుమూసుక్కూచోటమే మంచిది. నువ్వు నవ్వినంతమాత్రాన నా ఆదర్శాలకేమీ లోటు రాలేదులే" అని కోపంగా ఇవతలకి వచ్చేసేను.

"వదినా, వదినా" అంటూ మళ్ళీ వెనకాలే వచ్చాడు.

"కథ రాద్దామంటే ఒకటే గొడవ. వెళ్లు అవతలకి" అని కసిరేను.

"వదినా కాస్త విను" అన్నాడు.

"ఏమిటో చెప్పరాదూ" అన్నాను.

"వదినా కాస్త కాఫీ నా మొహాన పోశావా అంటే, మళ్ళీ ఏడు గంటలదాకా నీతో మాట్లాడితే వొట్టు" అన్నాడు.

టైము చూస్తే రెండున్నర అయింది. నాకూ కాస్త కాఫీ తాగితే బాగుండు ననిపించి స్టౌ వెలిగించాను.

కాఫీ అయి మళ్ళీ కాగితాలు ముందేసుకూచున్నానన్న మాటేగానీ, ఇందాకటి భావాలన్నీ గజిబిజిగా అల్లుకుపోయాయి. ఏ వొక్కటీ విడదీసి ఒక రూపం కల్పించలేక తికమకపడుతున్నాను. ఏదో భావం మెరుపులాగా మెరిసి, పట్టుకోబోయేసరికి మరుపులో మాయమవటం ఇల్లాగ సతమతమయి, ఒక్కో భావాన్ని ఏర్చి కూర్చుకుని, చివరికి కథ వ్రాయటానికి ఉపక్రమించాను. ఇంతలో ఆఫీసుప్యూన్ ప్రత్యక్షం. కాఫీ రెడీగానే ఉన్నదిగా! ఫ్లాస్కు ఇచ్చి "ఇదిగో వీరాస్వామీ కాఫీ అయ్యగారికి ఇచ్చి అల్లా మార్కెట్టుకి వెళ్ళి కూరలు పట్రా" అని సంచీ రెండు రూపాయలనోటు అతనికి అందించి, కుర్చీదగ్గరికి వెళ్ళేను. కొంతదూరం వెళ్ళి తిరిగివచ్చాడు వీరాస్వామి.

"ఏమిటోయ్ మళ్ళీ ఎందుకు వచ్చావ్?"

"తమరికండీ అయ్యగోరు ఓ సీటీ ఇచ్చినారండీ" అంటూ ఓ చీటి ఇచ్చి వెళ్ళిపోయాడు. అయ్యగార్లకి చీట్లు ఇవ్వటం, జవాన్లకి తీసుకురావటం తప్ప మరోపని లేదనుకుంటూ చీటీ విప్పిచూసుకున్నాను. ఏమున్నది! అర్జంటుగా కాంపువెళ్ళాలి, హోల్డాలూ అవీ సిద్ధపరిచి, వంట వేగిరం కానీయి. అయిదుగంటల బండికే వెళ్ళాలి" అని వున్నది అందులో. అప్పుడే గడియారం చిన్నముల్లు నాలుదగ్గరికి రాబోతున్నది. ఇంకేమున్నది. కథ కంచికి నేను వంటఇంట్లోకి.

ఇదంతా మా మరది గది కిటికీలోంచి చూస్తున్నాడు గాబోలు "వదినా అప్పుడే కథ వ్రాశావా ఏమిటి ఏదీ ఇల్లా ఇవ్వు" అంటున్నాడు, వచ్చేనవ్వు దాచుకుంటూ.

"అవునవును నీ మల్లే రోజల్లా వాలుకుర్చీకి అతుక్కుపోయి, వదినగారు క్రమం తప్పకుండా కాఫీ ఫలహారాలు అందిస్తూంటే, కమ్మ కమ్మగా సేవించి, శ్వేత కాస్తాలు తగలేస్తూ కూచున్నవాళ్లు రోజుకి ఒక్కొక్కఠేం ఖర్మ, పదయినా రాస్తారులే" అని సమాధానానికయినా ఎదురుచూడకుండా వంటఇంట్లోకి వచ్చిపడ్డాను. నిజంగా మీరే చెప్పండి, నేనే ఓడిపోయానంటారా? ఇన్ని అవాంతరాలు వస్తే ఎంతచెయ్యితిరిగిన రచయిత అయినా కథ వ్రాయగలడా? ఇంతకీ నేను వోడిపోయానన్న విచారంకంటే, రాజకుమారుడికి చాలా అన్యాయం జరిగిందని విచారంగా వున్నది. రాజకుమారుడు అజ్ఞాతంగానే ఉండిపోయాడు. ★

# "ఉంగరము-బొంగరము"

అలపర్తి వెంకట సుబ్బారావు

తల్లి: ఉంగర మిదిగో!
బొంగర మిదిగో!!
పాప! తీసుకో
నీకేది యిష్టమో!

పాప: ఉంగరం నాకెందుకమ్మా?
బొంగరం నాకివ్వుతల్లీ!

తల్లి: ఖరీదైన ఉంగరంబు
కాలదన్ని వేసినావు
అహా కాని బొంగరం బు
మాయకంగ కోరినావు

పాప: బొంగరమును పారవేస్తె
కోపపడవు నన్ను నీవు -
ఉంగరమును పారవేస్తె
ఉరిమి నన్ను తన్నుతావు -

తల్లి: చేతికి ఉంగరముంటె
చిందిపోవు నందము

పాప: బొంగరముతో ఆడుకుంటె
పొందెద నానందము
ఆటలాడి, అమ్మ! నేను
ఆనందం పొందుతాను.
ఆనందమె నాకు, సదా
ఆరోగ్యం బానగునుకద!
ఉంగరం నాకెందుకమ్మా?
బొంగరం నాకివ్వు తల్లీ!

తల్లి: నిజము నిజము నిజము నిజము
నీవన్నది నిజము సుమా
బొంగరం యిదిగోనుపాపా!
ఉంగరమునూఉంచుకొనుము!
ఆరోగ్యము పొందుటకై
ఆటలాడుకొనుము పొమ్మ.

పాప: అయితే, అమ్మా! నేను
ఆడుకోబోతున్నాను -
అందరు తల్లుల కీనీతి
అందించుము ఏదో రీతి.

# తీయ మామిడి చెట్టు


మ. సత్యభారతి

కొన్ని వందల సంవత్సరాల క్రితం కాశీనగరంలో బసవరాజు అనే ధనవంతుడు ఉండేవాడు. ఆయనకు నలుగురు కొడుకులు. వారికి ఆనందుడు, పరమానందుడు, సదానందుడు, చిదానందుడు అని పేర్లు పెట్టాడు. వీరంతా పెరిగి పెద్దవాళ్లయే సరికి బసవరాజు కోటికి పడగలెత్తాడు. అయినా పుత్రుల అదృష్టమని తండ్రి మురిసిపోతూండేవాడు. కాని, నలుగురు కొడుకులూ సకల విద్యలూ సమగ్రంగా చదువుకోవటంవల్ల వారికి వైరాగ్యం పెరిగింది. జీవితం గాలిబుడగ వంటిదనీ, శరీరం క్షణభంగురమనీ నలుగురు కొడుకులూ తండ్రిముందట వేదాంతం చెబుతూండేవారు.



వీరి వేదాంతం వింటూంటే తండ్రికి విసుగు పుట్టేది. నలుగుర్నీ నాలుగు వృత్తులలోనూ ప్రవేశ పెట్టినట్లయితే ఒకదారికి వస్తారని ఆలోచించి బసవరాజు తన పెద్ద కుమారుడైన ఆనందుణ్ణి పొలంపనిలోను, పరమానందుణ్ణి వర్తకంలోను, సదానందుణ్ణి పైఊళ్ళ సంతల బేరాలలోను, చిదానందుణ్ణి గృహనిర్వహణలోను ప్రవేశ పెట్టాడు. ఒకఏడాది గడవకముందే వారు తండ్రి ధనాగారానికి దెబ్బతీశారు. పొలంమీద పంటను కర్ణుడిలా పంచాడు ఆనందుడు—"ఏం శాశ్వతం?" అనే తత్వంతో.

సంతల బేరాలలో సరకు ధరకు మించిన ధనంఇచ్చి నష్టపోతూండేవాడు సదానందుడు. వర్తకంలో చెయ్యిపెట్టిన పరమానందుడికి బేరగాండ్లకు తేరగా సరకులివ్వటం సరదా అయింది. ఇంక చిదానందుడు రోజుకి ఇరవైమంది సన్యాసులకు ఆతిథ్యం ఇస్తేగాని నిద్రపోయేవాడు కాదు. నిలవ వెయ్యాలనే తండ్రిబుద్ధికీ, వ్యయం చెయ్యాలనే కొడుకుల బుద్ధికీ తూకం సరిపోయింది. ఒక్క ఏడాదికే తండ్రి తన కొడుకులంతా తనకు పనికిరాని కుపుత్రులని గ్రహించి "మీరేం పనిపాటు లేకుండా, ముక్కుమూసుకుని ఇంట్లో కూచోండి...మీరు



తల్లిప్రేమ

## ★ తీయమామిడి చెట్టు ★

వంలోటు రాదు" అని ఆజ్ఞాపించాడు.

"మేం ముక్కు మూసుకు నేకూ చోదలచుకున్నాం. ఐతే ఇంట్లో కాదు...హిమాలయా పర్వతాలదగ్గర" అని నలుగురు కొడుకులూ జవాబిచ్చేసరికి బసవరాజుకి మతిపోయింది.

"సిరి ఉందనీ, సంపదతోబాటు సంతానం ఉందనీ సంతోషిస్తున్న నాకు ఎటువంటి కొడుకులు పుట్టార్రా! కూడబలుక్కుని కట్టకట్టుకుని బైరాగులవాలని యెందుకు బుద్ధి పుట్టిందిరా మీకు?" అని తండ్రి ప్రశ్నించాడు.


"సర్వం మిథ్య నాన్నగారూ! మీరు మిథ్య, మేము మిథ్య- అన్నీ మిథ్య, ఐశ్వర్యం మిథ్య అనే జీవిత సారం కనుక్కున్నాం" అన్నాడు పెద్దవాడు ఆనందంగా.

"గంగలో దిగండి...ఈ గంగ వెర్రులు తగ్గుతాయి" అన్నాడు తండ్రి కోపంతో.

"ఐతే మాకు అనుజ్ఞ ఇవ్వండి" అన్నారు కొడుకులు.

ఆనందస్వరూపులు నలుగురూ ఒక శుభముహూర్తాన హిమాలయా పర్వతశ్రేణి పాదాలదగ్గరకు బయలుదేరారు. దండ కమండల కాషాయాది అలంకారాలతో భగవద్ధ్యానం చేస్తూ ఊరిలోని వారందరివద్ద సెలవు పుచ్చుకున్నారు ఈ వేదాంతులు.

నెలరోజులకు వారు తమ గమ్యస్థానం చేరుకున్నారు. ఈశ్వర ధ్యానం చేయటానికి మైలుదూరాని కొకటిలాగున గుడిసెలు వేసుకుని, నాలుగు కుటీరాల్లోనూ నలుగురూ జపం చేయటం ప్రారంభించారు. నెలలుగడిచినవి. ఆనందుడు తపోనిష్ఠ



పిల్లి ప్రేమ

ఫొటోలు: మలిశెట్టి సూర్య నారాయణరావు—కాకినాడ.

నుంచి మేల్కొనేసరికి ఆంజనేయుడు అవతరించాడు.

"నీ తమ్ముళ్ళని ఓసారి చూసిరా ఆనందస్వామీ! ఈసంచి దగ్గర పెట్టుకో" అని ఆంజనేయుడు తన భక్తుడికి ఒక సంచీనిచ్చి అంతర్ధానమయాడు.

సంచీని బుజాన వేసుకుని ఆనందుడు మైలుదూరంలో ఉన్న పరమానందుడికుటీరం చేరుకున్నాడు.

"అన్నా! ఆనందా! ఇక్కడ ఈ చలిలో తపస్సు చేయలేక పోతున్నాను...అగ్ని దొరికే ఉపాయం ఉంటే చెప్పు" అన్నాడు పరమానందుడు.

ఆనందుడు వరప్రసాదంగా లభించిన సంచీవైపు దృష్టిని సారించగానే అందులోనుంచి చిన్న గొడ్డలి పైకి వచ్చింది. క్షణం సేపు అతడు స్మరించి,

"పరమానందా! ఈ గొడ్డలి దగ్గర ఉంచు...నీకెప్పుడు కావాలంటే అప్పుడీ గొడ్డల్ని అడుగు. కట్టెలుకొట్టి, కణకణలాడే అగ్నిని పుట్టిస్తుంది" అని అన్నాడు ఆనందుడు.

పరమానందుడు అమితానందం పొంది దైవదర్శనం కనుచూపు మేరలోనే ఉందని భావించాడు.

ఆనందుడు మరొక మైలుదూరం నడిచి సదానందుడి ఆశ్రమం చేరుకొని కుశలప్రశ్నలు వేశాడు.

"ఆనందా! ఇక్కడ పశుగుల బాధ ఎక్కువగా ఉంది. అవి ఘీంకారం చేసేసరికి మనస్సు చెదిరి తపస్సు చెడిపోతోంది." అన్నాడు సదానందుడు.

ఆనందుడు మళ్లీ వరప్రసాదిమైన సంచీని చూడగానే అందులో నుంచి మద్దెల పైటకు వచ్చింది. క్షణకాలం మారుతిని స్మరించి:

# తియ్యమామిడి చెట్టు

"సదానందా! ఈమద్దెలను కుడివైపు కొడితే ఏనుగులు బెదురుతాయి. ఎడంవైపు కొడితే మందలకొద్దీ వచ్చి నీకు దాసోహం చెప్తాయి" అని చెప్పాడు.

సదానందుడు చాల సంబరపడ్డాడు. అక్కడనుంచి ఆనందుడు మరొకమైలు నడిచి, చిన్నతమ్ముడైన చిదానందుడి కుటీరం చేరుకుని అతని యోగక్షేమాలు అడిగాడు.

"పెద్దన్నా! పెరుగు అన్నం లేనిదే ఎంత గింజుకున్నా దేవుడిమీదకు దృష్టి పోవటంలేదు. మన ఇంటిదగ్గర కడుపునిండా తినిన మీదట వేదాంతం కలుగుతుందేది" అన్నాడు చిదానందుడు.

చిన్నవాని చిలిపితలపులు ఆనందుడికి నవ్వు కలిగించాయి. మరొకసారి అతడు సంచీవైపు దృష్టి సారించాడు. అందులోంచి ఒకరజత పాత్ర బైటకు రాగానే అతడు క్షణకాలం మారుతిని ప్రార్థించి ఇలా అన్నాడు:

"చిదానందా! నీకీగిన్నె ఎంతో సేవచేస్తుంది. కావాలన్నప్పుడల్లా నీకు పెరుగు, పాలు తెస్తుంది. అంతేకాదు నీకు కోరికైతే నీయెదట దధిసాగరాన్నే ఏర్పరుస్తుంది. పొట్టపూజనుంచి క్రమక్రమంగా దైవపూజవైపు, మనసు లగ్నంచేయి" అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు ఆనందుడు హిమాలయాశిఖరాలకు.

"నా తమ్ముళ్ళింకా జితేంద్రియులు కాలేదు. ఏ ఇక్కట్లూ వారికి రాకుండా కాపాడాలి మారుతీ!" అని ధ్యానిస్తూ ఆనందుడు తపోనిష్ఠలో పడ్డాడు.

## 2

నలుగురు కొడుకులూ ఇల్లువదిలి వెళ్ళిన తరువాత బసవరాజుకి ఏమీతోచేది కాదు. కోటికి పడగలెత్తినప్పటికీ అతడికి ఇంట్లో ఆనందం లేదు. పిచ్చివాళ్ళయినప్పటికీ కొడుకులు ఇల్లువదలగానే బసవరాజుకి పుత్రులపై ప్రేమ పెరుగుతూ వచ్చింది. ఎందుకు వాళ్ళని దూరం చేసుకున్నానా అని అతడు దిగులు చెందుతూ వచ్చాడు. అంతేకాదు వాళ్ళని సరియైన మార్గంలోకి తీసుకురాలేకపోయినందుకు తనను తానే తిట్టుకొన్నాడు బసవరాజు. పిల్లల తల్లి ఉండి ఉంటే వాళ్ళకీ వైరాగ్యం వచ్చిఉండేది కాదని అతడు అనుకొన్నాడు.

ఇంట్లో ఇల్లాలు లేకపోవడంవల్ల కలకల్లాడే పిల్లలు లేకపోవడంవల్ల బసవరాజుకి కూడా బైరాగిగా మారదామనే ఆలోచన తట్టేదే కాని డబ్బుకీ, ఇనప్పెట్టికీ తన ప్రాణానికి లంకె ఎక్కువగా ఉన్నందువల్ల అతడు ఈబాధల్ని దూరంగా త్రోసివేశేవాడు.

వృద్ధాప్యం రావడంవల్ల బసవరాజు ఒక నిశ్చయానికి వచ్చాడు. కాళీనగరాన్ని గాలించి తనజాతిలోని బీదవాణ్ణి ఎన్నుకొని దత్తత చేసుకున్నాడు. అతడిపేరు ధనంజయుడు. అతనివయస్సు ఇరవైనంవత్సరాలు. అతడు బసవరాజుకి నచ్చిన కొడుకుగా ఏగాణికికూడా మాటలు కట్టే రకంగా కనుపించాడు. పెంచుకున్న కొడుకు

ప్రయోజకుడనే సంతృప్తితో బసవరాజు శాశ్వతంగా కన్నుమూశాడు.

ధనంజయుడికి కోటిరూపాయల ఆస్తి చేజిక్కింది. అసలు రంగు బైట పడింది. నడమంత్రపు సిరి అతడికి గిలిగింతలు పెట్టింది. చిన్ననాటి నుంచి ఈడేరని కోరిక లన్నిటినీ తీర్చుకోవటమే అతనిపని అయింది. కాశీలో కనుపించిన భోగాలన్నిటినీ అనుభవించాడు. దేశదేశాలు తిరిగి వింతలూ విశేషాలు చూద్దామని లక్షరూపాయలు బొడ్డున కట్టుకుని ప్రయాణం చేయదలచాడు. ఓడల రేవుకువచ్చి తూర్పుగా బయలుదేరే ఓడ ఎక్కాడు.

ఓడ నడిసముద్రంలోకి వచ్చింది. ఎటుచూసినా నీరేగాని నేల కనుపించటం లేదు. కెరటాలలో ఊగుతున్న ఓడలో కులుకుతూ కలలు గంటున్నాడు ధనంజయుడు. వెన్నెలవెలుగులో సాగరుడు సుందరంగా ఉన్నాడు. చీకటి రాత్రుళ్ళలో చుక్కల సొగసు వర్ణనాతీతంగా ఉంది. ఓడ ప్రయాణం చేస్తూనేఉంది. ఒకనాటి అర్ధరాత్రి ఆకాశంలోని చంద్రుడు, నక్షత్రాలు అంతర్ధానమై మబ్బులమయమైంది. గాలి పెనుగాలి అయింది. ఓడ ఉయ్యాలలా ఊగి, కెరటాల తాకిడికి తట్టుకోలేక చిల్లులుపడి బుడుంగున మునిగింది.

ధనంజయుడు మాత్రం మృత్యుంజయుడయాడు. కొయ్యముక్క ఊతతో అతడు కొన ఊపిరితో సుమిత్రాదీవిని చేరుకున్నాడు. భూదేవి కనుపించగానే అతనికి ఎంతో ధైర్యంవచ్చింది. తెల్లవారేవరకు ఒడ్డున కూచున్నాడు. సూర్యోదయమైంది. సుమిత్రాదీవి సందర్శనం అయింది. కాని, ఆదీవిపై కంటికి కనుపించే మేరలో పిట్టగాని, మనిషిగాని లేడు. సమతల ప్రదేశంలో దూరాన ఒకే ఒక చెట్టు కనుపించింది.

ఆకలితో అటమటిస్తున్న ధనంజయుడికి ఆచెట్టును చూడగానే ఆశలు పెరిగాయి. దాని దగ్గరకు కష్టంమీద నడచి వెళ్ళాడు. దానిని సమీపిస్తున్నకొలదీ అతనిలో సంతోషం పెరుగుతూ వచ్చింది. చేతులుజాపి తనను ఆహ్వానిస్తున్నట్లుగా ఉన్న పెద్దపెద్ద కొమ్మలు చూశాడు. అదొక పెద్ద మామిడి చెట్టు. చేతికి అందుతున్నాయి పండ్లు. ఒకటికోసి నోట కరిచాడు. అమృతమంతటి రుచి కలిగి ఉన్నాయి. గబగబా రెండుపళ్లు కోసి జుర్రుమంటూ తిన్నాడు. కడుపు నింపుకున్నాడు. కంటికి కునుకు వచ్చింది. చెట్టెక్కి పలవలమీద పడుకున్నాడు. కంటినిండా నిద్ర పట్టింది.

కొంతసేపటికి అతడు కన్ను తెరచాడు. చెట్టుకింద అడవిపంది నిద్రిస్తూ ఉంది. అతడికి భయం వేసింది. కాని, ఆ పందినోట్లో ఏదో ధగధగ మెరుస్తోంది. దానిని చూస్తే కండ్లు కుట్టాయి. మెల్లగా చెట్టుదిగి, ధైర్యంతో పందిదగ్గరకు వచ్చాడు. దానినోట్లో ఉన్నది ఒక వజ్రం. భలేబాగుంది అనుకుని, దాని నెలాగైనా తీసుకోవాలని అతనికి ఆశ పుట్టింది. చెట్టుక్రింద తేరిపార చూశాడు. గట్టికర్ర ఒకటి కనుపించింది. దానితో పంది నెత్తిమీద బలంగా కొట్టేడు. అది ప్రాణాలు విడిచింది. వజ్రం ధనంజయుడి చేచిక్కింది.

"ఆహా! ఎంతబాగుందీ వజ్రం.. చెట్టుమీద కూర్చుని సావకాశంగా చూద్దాం" అని అతడు అనుకున్నాడో లేదో రెక్కలువచ్చి ఎగిరినట్టుగా ఒక్కతృటిలో చెట్టు మీదకు ఎక్కాడు. అపరిమితమైన ఆశ్చర్యం కలిగింది అతనికి. ఈవ్రజంలోఉండే మహత్తు అతనికి తెలిసింది. ఈ అడవిపంది కూడా ఇలాగే ఏదేశంనుంచో ఇక్కడకు వచ్చి ఉంటుందని అనుకున్నాడు. ఇది ఎక్కణ్ణుంచి వచ్చిందో అక్కడికి వెడితే ఇంకా కొన్ని వజ్రాలు దొరుకుతాయి కదా అని అతడు అనుకుంటూ ఉండగానే కూచున్నవాడల్లా కుబేర పుష్పకంలో ప్రయాణం చేస్తున్నట్టు ఆకాశమార్గాన రయ్యిమని వెళ్లుతున్నాడు. కిందకుచూస్తే నదులు, పట్టణాలు, పురుగుల్లా ప్రజలు అతనికి కనిపించారు. ఆగి, వింతలు చూద్దామన్నా అతను ఆగలేక పోతున్నాడు. ఒక్క ఘడియలో అతడు హిమాలయపర్వతాల దగ్గర ఒక కుటీరం ముందు ఆగాడు.

"ఓహో! ఈ కుటీరంనుంచే ఈపంది వజ్రాన్ని దొంగిలించి ఉంటుంది. లోపలికి వెళ్ళి ఇంకా ఎన్ని వజ్రాలున్నాయో చూద్దామని అడుగులు మెల్లగావేస్తూ కిటికీచేరి తొంగి చూశాడు.

అందులో ఎవరో తపోనిష్ఠలో ఉన్నట్లు కనిపించింది. చలితో చేతులు కొంకర్లు పోతున్న ఈ ప్రదేశంలో ఆ కుటీరంలో వెచ్చ

# ★ తీయమామిడి చెట్టు ★

దనాన్నిచ్చే వేడి ఉంది. ధనంజయుడు తలుపు తట్టాడు.

"ఎవరు వారు?" అని లోపల తపస్సుచేసే భంగిమలో ఉన్నాయన పలకరించాడు.

"ధనంజయు డంటారు నన్ను" అన్నాడు ఇవతల నుంచి.

తలుపులు తెరుచుకున్నాయి.

"మీరెవరు?" అని ప్రశ్నించాడు ధనంజయుడు ఆమునిని.

"నాపేరు పరమానందుడు."

"మునివర్యా నమస్కారం. చలిని జయించిన సత్పురుషా నమస్కారాలు. మీమహిమ...?"

"ఇదిగో...గొడ్డలి...పరశురాముని ఆయుధం...ఒక్కత్రుటిలో నీకు కూడా చలిమంటలు వేస్తుంది చూడు" అంటూ పరమానందుడు గొడ్డలిని తీశాడు. అది గాలిలో ఎగిరివెళ్ళి నురుక్షణంలో క్రరలను తెచ్చి మంటలతో నున్న నెగడిని ధనంజయుడి ముందు ఉంచింది.

"ఆహా! స్వామీ! నేనీరాత్రి ఇక్కడ గడపవచ్చునా?" అని ప్రశ్నించాడు ధనంజయుడు.

"నిక్షేపంగా!" అన్నాడు పరమానందుడు.

"మీది ఏవూరో, నాచరిత్ర ఏమిటో చెప్పవచ్చునా?" అని అడిగాడు ధనంజయుడు.

"మాకు అవన్నీ అనవసరం. సర్వ సంగపరిత్యాగులకు మానవుల చరిత్ర అనవసరం" అన్నాడు పరమానందుడు.

ధనంజయుడు కిమ్మనకుండా కూర్చుని, వజ్రాన్ని భద్రంగా తలపాగాలో దాచుకున్నాడు. వజ్రానికి తోడు గొడ్డలిని కూడా సంపాదించాలనుకుంటూ విశ్రమించాడు.

అర్ధరాత్రి లేచాడు. పరమానందుడు గాఢనిద్రలో ఉన్నాడు. ధనంజయుడు గొడ్డల్ని చేత్తో పట్టుకుని, "కట్టెల్ని ఎందుకు కొడతావు...ఈ మనిషితల నరుకు" అన్నాడు.

గొడ్డలి రయ్యిమని వెళ్లి పరమానందుడితల నరికింది! తెల్లారింది. ధనంజయుడు గొడ్డలిని చేత బుచ్చుకుని నడిచాడు. మరొక కుటీరం కనుపించింది. అందులో అతడు మరొక మునీశ్వరుణ్ణి చూశాడు. వీడి మహిమ ఏమిటో చూద్దామని కుటీరం తలుపు తట్టాడు.

"ఎవరది?"

"ధనంజయుడంటారు నన్ను"

"రావచ్చు"

"మహాశయా! నమస్కారాలు. మీదర్శన భాగ్యంతో జన్మ తరించింది."

"కూర్చోండి...ఏం కావాలి మీకు?"

"మీమహిమ లేమిటో తెలుసుకోవాలని వచ్చాను"

"ఐతే చూడండి" అంటూ సదానందుడు మద్దెలను తీసి ఎడంవైపు వాయించాడు. ఏనుగులమంద ఘీంకారాలతో, కుటీరం చేరుకున్నాయి. ధనంజయుడు చూసి బెదిరిపోయాడు. సదానందుడు ఈసారి కుడివైపు వాయించాడు. ఏనుగులన్నీ చెల్లాచెదరై పారిపోయాయి.

"ఆహా! ఎంతటి శక్తి?" అంటూ ధనంజయుడు, తనవద్ద నున్న గొడ్డలిని నిమిరాడు. అది ఒక్క విసురులో సదానందుణ్ణి, అతని తలనూ దూరం చేసింది.

"జై మహావరాహా!" అంటూ ధనంజయుడు వజ్రాన్నిచ్చిన పందిని స్మరిస్తూ, మద్దెల్ని చంకన బెట్టుకుని, గొడ్డల్ని బుజాన వేసుకుని బయలు దేరాడు.

మరికొంత దూరంలోనే అతడికి మరొక కుటీరం కనిపించింది.

తలుపు తట్టాడు.

"ఎవరు?"

‘‘నన్ను ధనంజయుడంటారు...’’

‘‘రావచ్చు’’

‘‘నమస్కారం మహాత్మా! మీమాహాత్మ్యమేమిటో తెలుసుకుపోదామని వచ్చాను.’’

‘‘కూర్చో’’ అంటూ చిదానందుడు వెండిగిన్నె తీసి ధనంజయుడి ముందు బోర్లించాడు. పంచభక్ష్య పరమాన్నం వడ్డించింది. ‘‘ఆహా! ఎంతటి శక్తి సంపన్నులు మీరు’’ అని ధనంజయుడు ఆశ్చర్యంతో చిదానందుణ్ణి చేతులెత్తి నమస్కరించాడు.

‘‘ఇది ఆంజనేయప్రసాదమని మా పెద్దన్నగారు చెప్పారు. ఇందులో నామహత్తు ఏమీ లేదు.’’ అన్నాడు చిదానందుడు.

ఈమనిషికి ఓ పెద్దన్నగారుంటే ఆయనదగ్గర ఇంకా ఎన్నెన్ని ఇంద్రజాలశక్తు లుంటాయో అని ఆశకలిగి ధనంజయుడు ఇలా ప్రశ్నించాడు:

‘‘ఆ మహాత్ముని నివాసం ఎక్కడ స్వామీ?’’

‘‘అదిగో అక్కడ’’ అంటూ

చిదానందుడు కుటీరం కప్పువైపు చూసాడు.

ధనంజయుడు కళ్లు విప్పుకుని అటకవంటి దేదైనా ఉందేమోనని కుటీరంపైభాగాన్నంతా పరిశీలిస్తూండగా "అదృశ్యులు మా అన్నగారు" అన్నాడు చిదానందుడు. ఈ మాటలకి ధనంజయుడిలో కొంచెం పిరికితనం తలెత్తింది కాని, తనవద్ద వజ్రం, గొడ్డలి, మద్దెలలు ఉన్నంతవరకూ అపాయం లేదని ధైర్యం తెచ్చుకుని గొడ్డలిని తీసి నిమిరాడు. చిదానందుడు పెద్దల్లో కలుసుకున్నాడు. వెండిగిన్నెతో ధనంజయుడు ముందంజ వేశాడు.

* * *

నాలుగు రకాల శక్తులు తన వద్ద ఉన్నాయనే ధైర్యం రాగానే ధనంజయుడికి ఊహాలు కోటలు దాటుతూండగా, అతడి మనసులో మెరుపులా ఒక ఆలోచన మెరసింది. కాశీనగరానికి అధిపతినైతే కొదవేముంటుంది అని. ఐతే, కాశీరాజు అయిన విజయసింహుడి బలగాన్ని ఓడించగలనా అనే అనుమానం తట్టింది. కాస్సేపు ఆలోచించిన మీదట నెందుకు ఓడించలేను అనుకున్నాడు.

"జై వీరవరాహా!" అనుకుంటూ అతడు వరాహ ప్రసాదమైన వజ్రాన్ని గుప్పిట పెట్టుకుని, కళ్లు మూసుకుని "కాశీనగరం" అనుకున్నాడో లేదో కళ్లు తెరిచేటప్పటికి అతనికాళ్లు కాశీనగరవీధిలో నిలబడి ఉన్నాయి!!

కోటవైపు అడుగులు వేశాడు. కోట బురుజులు ఆకాశాన్ని అంటుతున్నట్లున్న వాటిపై కవచధారులై పహారా తిరుగుతున్న సైనిక వీరులను చూడగానే ధనంజయుడు మద్దెల ఎడంవైపు వాయించాడు. అది అతడికి యుద్ధనినాదంలాగే ఉంది కాని, విజయసింహుని సైనికులకు మాత్రం గారడీవాని మద్దెలలా గనుపించింది. కాని, మరుక్షణంలో ఆ సైనికులకు ఏనుగుల మంద ఘీంకారాలతో కోటవైపు పరుగెత్తుకుంటూ వస్తున్న దృశ్యం కనిపించింది. సైనికులు బాకాలు ఊదారు. వీరులు ఉరుకుతూ కోటగోడలపైకి వచ్చారు. ఏనుగులదండు చూశారు. ఒక్క ఏనుగుమీద ధనంజయుడు కనిపించాడు. బాణాలు సంధించారు. ఒక్కసారిగా నూరుబాణాలు ధనంజయుడి వైపు వచ్చాయి. వాటిని ఏనుగులు తమ తొండాలతో ఆపివేశాయి.

ధనంజయు డీసారి గొడ్డలితీసి మంత్రించాడు. గొడ్డలి దాహం తీరినట్లుగా సైనికులతలలు గిలగిల కొట్టుకుంటూ కిందపడ్డాయి. మిగిలిన సైనికులకు భయంవేసి కోటలోకి పరుగెత్తి రాజుగారి నెదటపడి ఎవరో విచిత్రశత్రువు దండయాత్ర సాగిస్తున్నాడని వివరాలన్నీ చెప్పారు.

గజాశ్వపదాతి దళాలతో విజయసింహుడు రణభేరి మ్రోగిస్తూ కోట ప్రాకారంవైపు వచ్చాడు. ధనంజయుడి కీసారి హడలు పుట్టింది. కాని, గుండెధైర్యంతో వెండిగిన్నెను మంత్రించగానే విజయసింహుని సేనలకు, తన ఏనుగుల మందకూ మధ్యగా పాలకాలవ లోతుగా ఏర్పడింది.

విజయసింహుడి గుఱ్ఱాలు, ఏనుగులు పాలకాలవలో బుడుంగున మునిగి, నోటికి రుచిగా ఉన్న పాలను సేవించి మత్తెక్కి అడుగు కదల్చలేక పోతున్నవి.

ధనంజయుడు విజయగర్వంతో గొడ్డలి ప్రయోగించాడు. పరశురామాయుధం విజయసింహుణ్ణి హతమార్చింది.

క్షణంలో కాశీరాజుగా ధనంజయుడు సింహాసనం ఆక్రమించాడు— "జై వీరవరాహా" అని స్మరిస్తూ.

రాజభవనం ఎంతో వింతగా ఉంది. కళ్లు కుట్టేటట్లుగా గదులు, తివాసీలు, అద్దాలు, అలంకారాలు, చెలికత్తెలు, సేవకులు!!! కోటలో అడుగుపెట్టిన క్షణంనుంచి ఈకొత్త రాజుకి పాత పరిచారికలు, సేవకులు గులాములమంటూ సలాములు చేయటం ప్రారంభించారు. ధనంజయుడికి ఆనందం అంచులు దాటింది. సింహాసనంపై కూర్చుని ఒక్కసారి గొడ్డలిని నిమిరి "సుమిత్రాదేవిలోని ఆ మామిడిచెట్టును తీసుకురా" అన్నాడు. క్షణంలో గొడ్డలి అదృశ్యమై మరుక్షణంలో మామిడిచెట్టుతో అవతరించింది. శాలతోటలో మామిడిచెట్టును నాటాడు ధనంజయుడు. పండ్లు నిండుగా ఉన్నవి. ఒకటి రుచి చూశాడు, మధురాతి మధురంగా ఉంది. "ఆఁ సరే! ఎల్లుండి రాజదర్బారుకు సామంత రాజులందర్నీ పిలిపించు మంత్రీ!" అని తొలిసారిగా రాజముద్రతో ఆజ్ఞాపత్రాన్ని ఉపయోగించాడు. మంత్రి రాజాజ్ఞ శిరసావహించాడు.

ధనంజయుడు మరుసటి

# తియ్యమామిడి చెట్టు

మామిడిపండ్లను కోసి ఒక్కొక్క సామంతరాజుకి ఒక్కొక్క పండు పంచిపెట్టాలని తలపెట్టాడు. ఇంతలోకే అతనికొక ఆలోచన తట్టింది: "సామంతరాజులంతా తానిచ్చిన పండునుతిని టెంకను పాతిపెడితే... అన్ని తియ్యమామిడిచెట్లే పెరిగితే...తనచెట్టు, తనపండు, తనూ ప్రత్యేకత కోల్పోవలసి వస్తుందే!'' అనుకున్నాడు.

వెంటనే అతనికి మరొక ఆలోచన కలిగింది. "మామిడిపండ్లను ముక్కలుగా కోసి, టెంకలలో క్రమేకు కొట్టి పంచిపెడితే సరి అంటుమామిడిమొక్క పెరగదు'' అనుకున్నాడు.

రాజదర్బారులో అలాగే అందరి సామంత రాజులకూ మామిడి పండ్లముక్కలను, పంచిపెట్టాడు. వారంతా తిని, రుచికి తన్మయులయ్యారు. "మా తోటలోనూ ఇలాంటి మొక్క ఉంటే ఎంత బాగుండును!" అనుకుని టెంకలకోసం సమరం సాగించారు. చేతికి అందిన రాజులందరూ టెంకలను పరీక్షచేసి చూశారు. ఏముంది గిపలిన టెంక! క్రమేకుతో కదిలిన టెంక! అంతా ముక్కుమీద వేలేసుకొని కొత్తరాజు తెలివికి ఆశ్చర్యపోయారు. అందులో వక్రసేనుడనే సామంతరాజుకి ఒక వింత ఆలోచన కలిగిందంటే ఆశ్చర్యం లేదు. అతని ఆలోచనలు అతని పేరునుబట్టే పుడుతుంటాయి.

"ఇందులో ఏదో మహత్తులేనిదే ఈ రాజు ఇంత పనిచేయడు. అదేదో కనుక్కుంటేనేగాని కునుకు తీయకూడదు" అని అంతరాత్మతో శపథం చేసుకుని దర్బారు సందడి ముగిశాక ఇల్లుచేరుకుని ఇల్లాలితో మంతనాలు జరిపాడు. ఆమె "మన తోటమాలిని పంపి తియ్యమామిడిని చేదుమామిడిగా చేయిద్దాం" అని బోధించింది. సరే అన్నాడు సంతోషిస్తూ వక్రసేనుడు.

తోటమాలి పెంటయ్య తన రాజాజ్ఞతోను, రాణీగారి ఉపదేశంతోనూ ఊరువిడిచి కాశీనగరం చేరుకుని ధనంజయుడి దర్బారులో అడుగుపెట్టాడు.

"ఏం కావాలి నీకు?" అని ధనంజయుడు అడిగాడు.

"మహారాజా! నాది కాశ్మీరదేశం. రకరకాల పుష్ప ఫలవృక్షములను పెంచగల దిట్టను. మీ సేవ చేయుటకై ఏతెంచితిని. నను కరుణించి నాకు ఉద్యోగము ఇప్పించు" డని రాజుతో పెంటడు విన్నవించుకున్నాడు.


"అటులనే కానిమ్ము, నేటినుండి మా కొలువులో చేరుము" అని రాజుగారు పెంటడిపై కరుణ కురిపించారు.

పెంటడు తోటలోచేరి తీపి మామిడిచెట్టునే ఆశ్రయించుకుని పనిచేస్తూండగా ధనంజయుడు వచ్చి "ఇక్కడికి వారాని కొకసారివచ్చే అలవాటుంది నాకు. ఇకనుంచి పదిహేనురోజుల కొకసారి వస్తూంటాను. మంచికాయ రుచిచూసి వెడుతూంటాను కనుక జాగ్రత్తగా పనిచేస్తూండు." అన్నాడు.


పెంటడు చాల సంతోషించాడు. పక్షంరోజులు ప్రభువు ఈ వైపుకు రానందుకు మహానందం పొంది తన కార్యక్రమంలో నిమగ్నుడయాడు. కృషి ఫలించింది. తెల్లవారితే రాజు వచ్చే గడువు... ఈ రాత్రే పెంటడు ఉడాయించాడు.

ధనంజయుడు వచ్చి మామిడిపండు కోసి నోటబెట్టాడు. ఏముంది!

## ఏయో క్యూబిజం?



కొంగ



గబ్బిలం

చిత్రకారుడు:
కె. భాస్కరరావు—గుంటూరు.

[illegible] చేదు. అతిమధురం అతి విషంగా మారింది. ఎంతపని జరిగింది అని చెట్టుచెట్టూ పరికించాడు. చెట్టు మొదలునుండి చిట్టచివర వరకూ కాకరపాదు పెనవేసుకుపోయింది. ఒకటా ... వందపాదులు! మామిడిదాద అడుగుకి ఆరుపాదుల చొప్పున...కాకరపాదులు తలెత్తి, మామిడిచెట్టును కప్పివేశాయి.

వెంటడిపై ధనంజయుడికి పట్టలేని కోపం వచ్చింది. వాణ్ణి నరికి చంపాలని నిశ్చయించుకొని, గబగబా తన గదికివచ్చి గొడ్డలిని నిమిరాడు.

గొడ్డలి కదలలేదు!! అదిలించాడు గొడ్డలిని! ఊహూఁ...శక్తి ఉడిగిపోయింది! మద్దెల వాయించాడు మహాకోపంతో మహారాజు!

ఏనుగు కాదుకదా ఈగలదండు కూడా రాలేదు!

వీటి శక్తులన్నీ పోయాయా అని మూలుగుతూ రాజు వెండిగిన్నె తీశాడు. బోర్లించాడు...భూమి బద్దలుకొట్టినా వెండిగిన్నెనుంచి మట్టిగాని మరోటి రాలేదు!!

"వీరభద్రా! రక్షించు" అనుకుంటూ పడకగదిలోకి వెళ్ళి వజ్రం తీశాడు. దానికి పూర్వజన్మ సంప్రాప్తించింది...బొగ్గై కూర్చుంది!!

"ఈమంత్రశక్తు లెందుకిప్పుడు. కాశీనగర రాజునైన నాకు ఒక్క తలకాయ...వెంటడి తలకాయ... తీయటం గొప్పా!" అనుకుంటూ దర్బారులోకివచ్చి సింహాసనంమీద కూర్చుని పహారాకోసం గంట కొట్టాడు.

వచ్చారు పలుగురు!!!

వారు సైనికులు కాదు...

ముందు వరాహం! వెనుక ఆనందుడు, అతని సోదరులూ ప్రత్యక్షమయారు!!

"దొంగ రాజా! నీ సైన్యం పచ్చడి అయింది...పోయి చూసుకొందువుగాని సింహాసనం ఖాళీ చెయ్యి" అన్నాడు చిదానందుడు.

వాళ్ళందర్నీ చూడగానే ధనంజయుడి ప్రాణాలు పంజరంలోని పిట్టలా గిలగిలా కొట్టుకున్నాయి. సింహాసనం దిగి ముందుకు నడిచాడు. వెంటనే ఇద్దరు సేవకులు వాళ్ళ [illegible] రాజుని) బంధించారు.

"ఈ పట్టణానికి చేసిన కీడు, మా తమ్ముళ్ళకు చేసిన హాని నా దివ్యదృష్టితో తెలుసుకుని వారిని బ్రతికించి వచ్చాను. భయపడకు... నీ మామిడిచెట్టే నీకు శరణు...ఈ రోజునుంచి నువ్వు తోటమాలివి. కాకరపాదు లన్నింటినీ తవ్వి లాగివేసి రోజు కొక కుండెడు చొప్పున మామిడిచెట్టుచుట్టూ పాలు, పెరుగు, తేన పోయించు... మామూలు మామిడి కాతుంది. పళ్ళు...నీ కదే శిక్ష," అన్నాడు ఆనందుడు.

వెంటనే దర్బారులోకి "మేము రాజ్యాన్ని పాలించటానికి రాలేదు. అసమర్థుడు, అతి దుర్మార్గుడూ అయిన ఈ ధనంజయుణ్ణి మీ రాజుగా తప్పించి, మీ రాజ్యం మీ ప్రజల చేతుల్లో పెట్టటానికే వచ్చాం. మాతృదేశ భక్తే మమ్మిలా విధంగా చేయించింది. మీ తోటలోని మామిడికి పూర్వపు రుచి త్వరలోనే వస్తుంది. దేశంలోఉన్న ప్రజలందరికీ ఆ మామిడిపండ్లను తినే హక్కుఉంది. మీరంతా భుజించి మీ ఇంట్లోనే మొక్కలు నాటి చెట్లను పెంచుకోండి. మేం ఏడాదికొకసారి వచ్చి గంగాస్నాన మాచరించి, దేశంచూసి వెళ్ళిపోతూంటాం." అని ఆనందుడు ప్రజలకు, సామంతరాజులకు ఉద్బోధించాడు.

సాధు ఇంటింటా నాటిన తియ్య మామిడిచెట్టే నేడుకూడా దేశమంతటా వెలిసింది. అదే తీపి మామిడి!! ★

సీరియల్:-




## మూలం: ఆల్‌ఫాన్స్ డాడే

### జరిగిన కథ

[మా నాన్నగారు—మష్యూ ఐసెట్టి—లాన్‌గ్యుడాక్‌లో పెద్ద సిల్కు వ్యాపారి. సొంత ఫ్యాక్టరి అదీ వుండేది. నేను (చిన్నా) పుట్టినరోజు లగాయతూ మా కుటుంబాన్ని ఏదో ఒక ఆపద చుట్టు ముట్టేస్తూనే వుంది. చివరికి దేశంలో వచ్చిన విప్లవం మూలంగా మా నాన్నగారిస్థితి పూర్తిగా చితికి పోయింది. కొంతకాలానికి మా నాన్నగారు దివాలా తీసి మా ఫ్యాక్టరీని అమ్మేశారు. మేము మా స్వస్థలం విడిచిపెట్టి లయన్స్ పట్టణానికి వెళ్ళిపోవలసి వచ్చింది. ఆ ప్రయాణంలో నా చిలుకను పోగొట్టుకొన్నాను. ఒక పెద్దమనిషి సహాయంతో నేనుమాత్రం లయన్స్ స్కూలులో స్కాలర్‌షిప్ విద్యార్థిగా చేరాను. చేరిన మొదటిరోజే నా బట్టలు చూసి పిల్లలు ఎగతాళి పట్టించారు. మేష్టారికి నేనంటే ఎందుకో గిట్టలేదు. నన్ను ఆయన 'డింభకొాసముడ'ని పిలవటం మొదలు పెట్టాడు. నాకా పేరే తగులుకొంది. ఇలావుండగా మా పెద్దన్న 'ఎబ్బీ'కి జబ్బుచేసిందని జాబు రావటమూ, మా అమ్మ, జాక్ అన్నయ్య అక్కడికి వెళ్ళడమూ జరిగింది. వాళ్లు వెళ్లిన కొన్ని గంటలకే పెద్దన్న పోయాడని టెలిగ్రాం వచ్చింది. అతని అంత్యక్రియలు పూర్తయ్యాక మా అమ్మా, జాక్ తిరిగివచ్చారు. ఆ తరువాత జాక్‌లో గమత్తు అయిన మార్పు వచ్చింది. పెద్ద పుస్తకం కుట్టి అందులో పన్నెండు అధ్యాయాల పద్య మహాకావ్యం రాయాలని సంకల్పించాడు. కాని రాయలేక, ఆ పుస్తకం నాకు యిచ్చేశాడు. కవిత్వం అనే జబ్బు జాక్ దగ్గరనుంచి నాకు వచ్చింది. ఆ పుస్తకం నిండా నా పద్యాలు ఎక్కించాను.]

ఈ 'డింభకుడి' జీవితగాథను యింతవరకు ఓపిగ్గా చదివిన పాఠకులకు ఒక్క మనవి;—వీడు యిక్కడ యీ విధంగా ఛందస్సులతో కిందామీదా పడుతూవుండగా, మనం ఒక్కసారిగా నాలుగైదు ఏళ్లు దాటేసి ముందుకుపోదాం. పద్ధెనిమిదివందల...నాటి వసంతంలో జరిగిన ఒకానొక విషయాన్ని గురించి చెప్ప్యాలని నాకు చాలా తొందరగ వుంది. మా ఐసెట్టీ కుటుంబంలోని వారికందరికీ ఆరోజులు, ఆరోజుల్లో జరిగిన కొన్ని సంఘటనలు చిరస్థాయిగా జ్ఞాపకం వుండిపోయాయి. బహుశః ప్రతికుటుంబానికీ యిదేమాదిరిగా మరపురాని కొన్నిరోజులు కొన్ని సంఘటనలు ఏవో వుంటా యనుకొంటాను.

అదీగాక—యీ నాలుగైదు ఏళ్ల కాలాన్ని మౌనంగా దాటేసినందువల్ల పోయిందేమీ లేదు. అప్పట్లో మా కుటుంబాన్ని ఏనాడు చూసినా ఒకటే పాట—కటిక దారిద్ర్యం, కన్నీళ్లు. ఈ రెంటికీ మించి చెప్పుకోదగింది ఏమీ లేదు. నానాటికీ మందగించిపోతున్న నాన్నగారి వ్యాపారం; బకాయిపడిపోతున్న యింటి అద్దె; డబ్బు అక్కడికక్కడ కక్కమని గుమ్మంలో తిష్ఠవేసుకు కూర్చునే యమకింకరుల్లాంటి అప్పులవాళ్లు, ఒకదానితరువాత ఒకటిగా అంగడికి నడుస్తున్న మా అమ్మగారి నదలు, తాకట్లకింద జమ అయిపోతున్న వెండి కంచాలు, గిన్నెలు; జల్లెడలా చిల్లులు పడిపోయిన బట్టలు, పక్క దుప్పట్లు; మాసికలమీద మాసికలు వేసిన లాగూలు; రోజుల తరబడి ఉపవాసాలు; రోజవారీ పరాభవాలు: ఏరోజు కారోజు "రేపనేరోజు ఎల్లా గడుస్తుందా?" అనే భయంకర సమస్య. ఘడియకొకసారి కోపంగా మోగే వీధివాకిలి గంట కోర్టు బైలిఫ్ వస్తున్నాడని యింటిల్లపాదినీ భయపెట్టేది; యింట్లోకి వచ్చేటప్పుడు, పోయేటప్పుడు గేటు దగ్గర కూచున్న కావలావాడు 'అయిందిలే! మీ బతుకుల బండారం బయటపడిందిలే!' అన్నట్లు మా వంక చూసి వెధవనవ్వు ఒకటి నవ్వుతుండేవాడు: చెల్లువడని

నోట్లు, బకాయిపడిన పద్దులు నానాటికి పెరిగిపోతుండేవి. అంతే—ఏరోజు చూసినా చర్విత చర్వణంగా యిదే విషాదగాథ.

ఆ గొడవ అంతటితో వదిలేసి పద్దెనిమిది వందల—నాటి వసంత కాలానికి వచ్చేద్దాం.

ఆ సంవత్సరంలోనే యీ 'డింభకుడు' వేదాంతంలో (ఫిలాసఫీ) పట్టభద్రుడు కాబోతున్నాడు. నాకు జ్ఞాపకం వున్నంతమటుకు ఆ రోజుల్లో వీడికి తలబిరుసు కొంచెం ఎక్కువగా వుండేదని చెప్పక తప్పదు. మూతి మీద మీసం మొలవకపోయినా తానొక మహా వేదాంతిననీ, మహాకవిననీ చాలా గర్వపడుతుండేవాడు.

వేదాంతిగా వెలయబోతున్న యీ 'డింభకుడు' ఒకరోజున స్కూలుకి పోదామని బయలుదేరబోతుండగా మష్యూ ఐసెట్టీ కొట్లోంచి ఒక్క కేకపెట్టి, వీణ్ణి లోపలికి పిలిచారు. వీడు లోపలికి రాగానే ఒక్క రంకె వేశారు:—

"ఒరేయ్ చిన్నా! ఆ పుస్తకాలు అవతల పారేయ్ ఇవ్వాళనుంచి నువ్వు స్కూలుకి పోనక్కర లేదు."

ఒక్క గుక్కలో అంత వాక్యమూ అనేసి ఆయన బోనులో పడ్డ సింహంలా రొప్పుతూ కొట్లో యిటునుంచి అటు, అటునుంచి యిటు పచారు చేయటం మొదలుపెట్టారు. మనిషి చాలా ఆవేశపడినట్లున్నారు. ఆ మాటలు విన్న యీ మహా వేదాంతికిఆవేశం ఆగటం లేదు. అయినా ఇద్దరిమధ్యా కొద్దిక్షణాలు మౌనంగా గడిచాయి. మష్యూ ఐసెట్టీయే మళ్లీ కంఠం సరిచేసుకొని మొదలుపెట్టారు:

"అదికాదు, చిన్నా! నీకో చెడువార్త చెప్పాల్సి వుంది... ఇప్పుడు యీ యింట్లోవున్న మన నలుగురం తక్షణం ఎవరికి వారుగా విడిపోవాల్సిన అవస్థ వచ్చింది..."

ఆయన ఆమాట అంటున్నంతలో, ఓరవాకిలిగా వేసివున్న తలుపువెనకనుంచి పెద్దపెట్టున ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లు వినిపించింది.

"ఒరేయ్ జాక్! నువ్వు వొంతి అడ్డగాడిదవిరా!" వెనక్కి తిరిగైనా చూడకుండా ఒక్క కేకపెట్టారు, నాన్నగారు.

ఆమాట అనేసి, తను అంతకుముందు చెప్పతున్న వాక్యాల్ని అందుకొని "ఆరేళ్ల క్రితం, ఆ దిక్కుమాలిన విప్లవం మూలంగా సర్వనాశనమై వున్నవూరు వదిలిపెట్టి ఈవూరు చేరాం. అక్కడ అన్నేళ్ళూ కష్టపడికట్టుకొచ్చిన వ్యాపారం ఒక్కసారిగా నేలమట్టానికి కూలిపోయింది. పోనీ—యిక్కడ కొచ్చాక అయినా మళ్ళీ ఆదినుంచీ మొదలుపెట్టి వ్యాపారంలో పైకి రావచ్చని ఎంతో ఆశపడ్డాను. అందునిమిత్తమై ఎంతైనా కష్టపడటానికి కూడా సిద్ధపడ్డాను. అయినా మన కుటుంబాన్ని పట్టుకొన్న శని మనని యిక్కడా వదిలిపెట్టలేదు. మళ్లీ అప్పుల్లోపడి పూర్తిగా మునిగిపోయాం. ఇందులోంచి బయటపడేందుకు ఒక్కటే ఒక్కమార్గం వుంది. మీ రిద్దరూకూడా శాస్త్ర ఎదిగిన పిల్లలు కాబట్టి, కొంపలో యింకా నగానట్రా ఏమైనా మిగిలివుంటే అవికూడా తెగనమ్మి,—అందరమూ ఎవరిపొట్ట వారు చేతపట్టుకొని తలకోదిక్కు పోదాం."

జాక్ వెక్కిళ్లు తలుపువెనకనుంచి ఒక్కసారిగా వినవచ్చాయి. నాన్నగారు వాణ్ణి కోప్పడటం అలవాటుప్రకారం యీసారి మరచిపోయారు; ప్రస్తుత పరిస్థితి ఆయన మనస్సుని అంతగా కలచివేసినట్లుంది. ఓరవాకలిగావున్న ఆ తలుపును సాంతం వేసి రమ్మన్నట్లు మాత్రం నాకు చేత్తో సంజ్ఞచేశారు. తలుపువేసి వచ్చాను.

"చివరికి యిలా చేద్దామనే నిర్ణయానికివచ్చాను. మీ అమ్మ, మళ్లీ క్షణం రమ్మని రానేవరకు, దక్షిణాదికిపోయి వాళ్లతమ్ముడు 'బాప్టిస్టీ' దగ్గరవుంటుంది. జాక్ యీ వూళ్ళోనే వుంటాడు; వాడికితగ్గ చిన్న వుద్యోగం ఒకటి చూశాను. తాకట్టువ్యాపారం చేసే ఒక కంపెనీలో వీణ్ణి గుమాస్తాగా ప్రవేశపెట్టాను. నేను, ద్రాక్షసారా వుత్పత్తిదార్ల సంఘం తరఫున వూళ్ళమీద తిరిగే వుద్యోగం ఒకటి సంపాదించాను. ఇక పోతే నీ సంగతి—నువ్వూ పొట్టచేతబట్టుకు పోక తప్పదు చిట్టినాయనా! 'రెక్టర్'దగ్గరనుంచి యీ వేళే జాబువచ్చింది. వాళ్ల కాలేజీలలో విద్యార్థులను క్రమబద్ధంగా నడిపించే 'అషర్' వుద్యోగం ఒకటి ఖాళీగా వుందట; అది నీకు యిప్పిస్తాను; పంపించమన్నాడు. ఇదిగో. ఈ జాబుచదువు; నీకే బోధపడుతుంది"అంటూ

# అన్నా - చిన్నా

నాన్నగారు తన కోటుజేబులోంచి జాబుతీసి నా చేతి కిచ్చారు.

చదివాను. సాంతం చదివాక "బయలుదేర టానికి అట్టే టైము లేనట్లుందే!" అన్నాను.

"అవును. వెళ్లదలచుకుంటే రేపు ప్రొద్దునే బయలుదేరాలి."

"సరే. వెళ్తాను."

చేతిలోవున్న జాబును చక్కగా మడతపెట్టి ఆయనచేతికిచ్చాను. నా చేతులు యిప్పుడు ప్రతిదానికీ వణకటం మానేశాయి; నేనిప్పుడు గొప్ప వేదాంతినికదా మరి !

ఇదంతా జరిగేలోగా మా అమ్మ గదిలోకి వచ్చింది. ఆమె వెనకాలే పిల్లిలాగ చప్పుడు చెయ్య కుండా వచ్చాడు, జాక్. ఇదంతా యిలా జరుగబోతుం దనేవిషయం వాళ్లిద్దరికీ క్రితంరాత్రే తెలుసుకాబోలు; యిద్దరూ సరాసరి నా దగ్గరకేవచ్చి, నన్ను కౌగలిం చుకు ముద్దుపెట్టుకున్నారు.

"ఊఁ! వాడు రేపు పొద్దుటి బోటుకే బయలు దేరాలి; సామాన్లు అవీ సర్దెయ్యండి!" (ఆ దృశ్యం చూడలేని) నాన్నగారు పైకి గంభీరంగా హుంకరిం చారు. మా అమ్మ దీర్ఘనిశ్వాసం విడిచింది. జాక్ పెద్దగా వెక్కిళ్లు లంకించుకొన్నాడు. అంతకుమించి ఎవరమూ ఒక్కమాట అయినా మాటాడలేక పోయాము.

కష్టాలను మౌనంగా భరించటం అప్పటికే మా కందరికీ అలవాటైపోయింది.

చిరస్మరణీయమైన ఆ మరునాటిరోజు ప్రాతః కాలాన్నే వుద్యోగార్థినై ప్రపంచంలోకి పోతున్న నన్ను స్టీమరుదాకా సాగనంపటంకోసం మా కుటుంబం యావత్తూ పడవలరేవుకి తరలివచ్చింది. అన్నిటికంటే ఆశ్చర్యమేమిటంటే— ఆరేళ్లక్రితం మేమంతా యీ పట్టణానికి పొట్టచేతబట్టుకు వచ్చినప్పుడు ఏ ఓడనైతే ఎక్కామో సరిగ్గా అదేఓడ యీరోజు ప్రత్యక్షమైంది. అప్పుడు ఆ ఓడలో ఎవరైతే కెప్టెన్‌గావున్నాడో అతనే యిప్పుడూ కెప్టెను. నరంగులూ ఆనాటివాళ్లే. దాంతో అలనాటి మా ప్రయాణంలో జరిగిన ప్రతి చిన్నవిష యమూ అందరికీ ఒక్కసారిగా స్ఫురణకువచ్చాయి. మా వంటలక్క ఆనీ జ్ఞాపకంవచ్చింది; ఆ రోజు ఆవిడ వేసుకువచ్చిన నీలంగౌడుగున్నంగతీ జ్ఞాపకం వచ్చింది; నా పెంపుడు చిలుకా, రాబిన్‌సన్ క్రూసో కథా— అవన్నీ జ్ఞాపకంవచ్చాయి. ఈ మాదిరి జ్ఞాపకాల మూలంగా అను నిత్యమూ విషాద మేఘాచ్ఛాదితమై వుండే మా అమ్మగారి ముఖంమీద ఆ క్షణంలో అత్యల్పమైన హాసరేఖ ఒకటి తటిల్లతలా మెరిసి మాయమైంది.

ఇంతలో స్టీమరుగంట కొట్టారు: నేనింక ఆల స్యంచెయ్యకుండాపోయ ఓడ ఎక్కెయ్యాలి.

అనునయ పూర్వకంగా నా చుట్టూ పెనవేసు కొన్న మాతృహస్తాలను వదిలించుకొని అతిగంభీర మైన వదనంతో స్టీమరు తాలుకు బ్రిడ్జిమీదగా నడిచి వెళ్లాను.

"అక్కడ వాళ్లదగ్గర పెట్టుకువుండు!"— స్టీమరు కదలబోతున్న సమయంలో నాన్నగారి కేక.

"ఆరోగ్యం జాగ్రత్త నాయనా?" వేడికోలును స్ఫురింపచేసే రుద్ధకంఠంతో మాతృశ్రీ హితవాక్కులు.

జాక్, తనుకూడా ఏదో చిన్నకు చెప్పబోయాడు కాని— నోట్లోనుంచి మాట బయటకి వచ్చేలోగానే వాడు తన కన్నీళ్లలో తనే కరిగిపోయాడు.

ఇందరు యిన్నిరకాలుగా శోకానికి లొంగి పోయారు. కాని— యీ 'డింభకుడు'మాత్రం కంటి తడైనా పెట్టలేదు. కారణం మరేమీలేదు. అతడు యిప్పుడొక గొప్ప వేదాంతి! గొప్పవేదాంతులు ఎప్పుడూ మానసికోద్రేకాలకు లొంగిపోరుకదా!!

ఒడ్డున మిగిలిపోయిన ఆ ముగ్గురిలో ఒక్కరైనా వేదాంతులుకారు. అంచేత నేను ఎక్కిన స్టీమరు కను చూపుమేర దాటి పోయేటంతవరకూ ఆ ముగ్గురూ అలా శూన్యంగా చూస్తూవుండిపోయారు. స్టీమరు మరీ దూరంగా పోయి అసలే కనిపించకుండా నలుసంత అయినాకకూడా అది వదిలిన పొగమంక సయితం ఎంతో ఆపాయంగా చూస్తూ అక్కే నిలబడిపోయివుం టారు.

వాళ్లక్కడ ఆ విధంగావుంటే, స్టీమరులో

ఎక్కిన యీ వేదాంతి చేతులు రెండూ కోటుజేబుల్లో పెట్టుకొని మోర ఆకాశం వైపుకి ఎత్తి అటూ యిటూ పచారు చేశాడు. ఏ బాధా లేని నిష్పూచీ మనిషిలా తనకు తనకు తను కనిపించాలని కాస్సేపు యీలపాట పాడాడు; ఓడలోని ఆడవాళ్ల వంక విలాసంగా చూశాడు; సరంగులు చేసేపనిని పెద్ద మహారాజులా పర్యవేక్షించాడు. గొప్పవ్యక్తిలా కనిపించాలని నలుగురూ తిరిగేచోట రొమ్ము విరుచుకు నడిచాడు. ఓడ 'విస్సి' రేవుకు చేరేలోగానే వీలైనంతమందితో తాను యూనివర్సిటీ యిలాకా పెద్దజీతగాడినని కోసేశాడు... ఆ వెర్రికుట్టులు వీడు చెప్పినమాటలన్నీ నమ్మేసి, వీణ్ణి ఎంతో మర్యాద చేయటం మొదలుపెట్టారు. మొత్తానికి ఆ కాస్సేపూ వీడు తనూ ఒక మనిషేనని తెగ గర్వపడిపోయాడు.

ఓడమీద యీ చివరనుంచి ఆ చివరిదాకా పచారు చేస్తుండగా ఒకసారి నా కాలు పొరపాటున అక్కడ లుంగచుట్టలుగా పడివున్న మోకులకి తగిలింది. ఆరేళ్లక్రితం యీ మోకులమధ్యనే నేను రాబిన్సన్ క్రూసోలా చిలుక పంజరాన్ని కాళ్లసందున పెట్టుకొని గంటలతరబడి కూర్చున్నాననే విషయం ఒక్కసారిగా జ్ఞాపకంవచ్చింది. ఆ రోజులూ, ఆ పసితనపు చేష్టలూ అవన్నీ తలుచుకుని యీ వేదాంతి బోలెడంత సిగ్గుపడి పోయాడు.

"అస్తమానం నేనా పిచ్చిపక్షినీ, అంత పెద్దపంజరాన్నీ ఎందుకు మోసుకు తిరిగినట్లు చెప్మా!" అని చాలా సేపు విస్తుపోయాను.

వెర్రి వేదాంతి! ఆశ అనే ఆకుపచ్చ రామచిలుకను భ్రాంతి అనే నీలిరంగు పంజరంలో పెట్టి జీవితాంతంవరకు తను మొయ్యక తప్పదని తెలుసుకోలేక పోయాడు—పాపం!

ఈ వాక్యాలు రాస్తున్న యీ క్షణంవరకు కానరాని పంజరమనే భ్రాంతుల్నీ, ఆశ అనే పక్షినీ వీడు మోసుకు తిరుగుతూనే వున్నాడుకదా! ఏళ్లుగడచినకొద్దీ పంజరానికి వేసిన నీలిరంగు అంతకంతకు మాసిపోయి, బీటలుపడి, పెళ్లలుపెళ్లలుగా వూడివస్తోంది; పంజరంలోని చిలుక ఒంటిమీది యీకలు ఒక్కొక్కటే రాలిపోయి, చివరి కదొక బోడిపక్షిగా తయారైంది!

కొత్త వూళ్ళో స్టీమరు దిగ్గానే, నరాసరి విశ్వవిద్యాలయానికి వెళ్ళి అక్కడ కాపురముంటున్న 'రెక్టరు'ను కలుసుకొన్నాను. (ఇంకావుంది)

---

# విజ్ఞాన వీధులు

"డాక్టర్"

## చిట్టి ప్రశ్నలకు జవాబులు

యం. అనంతరామయ్యగారు, పెదపాడు.

కృష్ణదేవరాయలను గురించి విజ్ఞాన వీధులలో 179 శీర్షికలో మేము వ్రాసినట్లు "తెలుగు వల్లభుండ"వని చెప్పినది కృష్ణరాయలు కాదనీ ఆంధ్రనాయక దేవుడనీ చెప్పి అనంతరామయ్యగారు మా తప్పు దిద్దినారు. మేము ఆ ముక్తామాల్యదను పరిశీలించి వ్రాయలేదు. అట్లు చేసియుండినచో ఆ పొరపాటు రాకపోయియుండును.

కృష్ణరాయలు తెలుగువాడేనని వాదించే వారి అనేక వాదాలలో ఈ పద్యముకూడా కృష్ణరాయల మాటగా చెప్పే వాదమును పాఠకులు అనేకచోట్ల చూచి ఉంటారు. మేమదే వ్రాసినాము. ఏ తప్పువల్లనైనా సరే కృష్ణరాయలను దక్కించుకోవాలన్న వారి వాదమే ఇది. ఇది మా స్వంతము కాదన్న స్మృతియే మాకు రక్ష. ఇది తప్పని మాకు తెలియదు. ఇంత చిన్న విషయములో విపరీతముండునని అనుమానించక పోతిమి. పాఠకులు మన్నించ ప్రార్థితులు. మా తక్కిన సూచనలు మాత్రము మావే. *

కా. శంకర నరసింహ బ్రహ్మంగారు, విశాఖపట్నం.

'తెలుగదేలయన్న' అన్న పద్యంలో మా పొరపాటు చూపించి, కృష్ణరాయలు కన్నడుడేనని చెప్పటకు మహాతంటాలుపడ్డారు. కన్నడరాయడు, కన్నడరాజ్యరమారమణా, కర్ణాటేశు, కర్ణాటాధీశ్వరే, అన్న మాటలు 'కన్నడరాజ్యాధిపతి, కన్నడరాజు' అన్న మాటనే చెప్తాయి. విజయనగరరాజ్య స్థాపనమూ, వృద్ధీ కన్నడులవల్ల జరిగినది. కర్ణాటరాజ్య సింహాసనారూఢులను కన్నడరాయలనియే అందురుకదా? తుళువ నరసరాయలు పెనుగొండలో దండనాథుడుగానుండి, ఇమ్మడి నరసింహులని యనంతరము విజయనగరరాజ్యము నాక్రమించినాడు. రాజ్యము కన్నడరాజ్యమే. పాలకులుమాత్రము తుళువ వంశమువారయిరి. 'తుళు' భాషకు లిపి లేదు నాటికీ నేటికీ కూడాను. విదేశ చరిత్రకారులు "కృష్ణరాయలు అభ్యంతర గృహములనూట్లాడేభాష దక్షిణ దేశభాషలలో ఏదీ కాద"ని రాశారు. తుళు భాషకు ప్రచారమతంగా లేదుగదా? కనుక కృష్ణరాయలు కన్నడుడు కాదు! తెలుగువాడూ కాదని చెప్పవచ్చును. అయితే అతడు శ్రీరంగము నుంచి సింహాచలమువరకూ తెలుగుభాషలో శాసనాలు చెక్కించినా డన్నది మేము అతని ప్రత్యేకాభిమానానికి దృష్టాంతముగా చెప్పినాము. దీనిని చల్లగా జారవిడిచారు బ్రహ్మంగారు.

జన్మతః కృష్ణరాయలు తెలుగువాడు కాడు. అభిమానముచే తెలుగువాడే. కాకున్న అన్ని శాసనాలూ అరవములోనే ఉన్న తిరుపతిలోనూ, చిదంబర, కంచి, శ్రీరంగ, దేవాలయములందునూ తన బిరుదు శాసనాలు కన్నడభాషలో కాక తెలుగులో ఏల చెక్కించవలెను? * * * *

బొడ్డు సుబ్బారావుగారు, విశాఖపట్నం.

—రక్తాన్ని తయారుచెయ్యడము ఇంకా నేర్వలేదుగాని, రక్తాన్నించి ప్లాస్మా అనే సంయోగపదార్థాన్ని పొడిరూపంలో తయారుచేసుకుని, సీసాల్లో నిలవచేసి దాన్ని అవసరమైనప్పుడు రోగుల శరీరంలోకి ఎక్కించడంవరకూ నేర్చారు ఆధునిక వైద్యులు.

నరుడు వానరుడే అని మీరనగలరా? వీపువైపు చూసుకుని సమాధానం చెప్పండి.

* * *

పి. వెంకయ్య శెట్టి, శ్రీనివాసపురం.

—సముద్రములో అట్టడుగుదాకా వెలుతురు ప్రసరించలేదు. జలచరాలకు కొంచెపు వెలుతురు చాలు. చాల లోతులలో నివసించే చేపలకు ఒకవిధమైన కాంతి ఉంటుంది.

చంద్రబింబమునుంచి వెలుతురు భూమిని చేరుటకు రెండు సెకనులవర పట్టును. కనక చంద్రమండలము మనకు నాలుగు లక్షల అరవై అయిదు వేల మైళ్ళుంటుంది.

జలాంతర్గాములు సాధారణముగా నీటి ఉపరితలమునకు కొంచెము దిగువగా ప్రయాణము చేయును. శత్రుభయము వచ్చినప్పుడు మాత్రమే నీటి కిందికి దిగిపోవును. అప్పుడు దానిలోని వారు గేస్ సిలెండర్లలోని గాలినీ, ప్రాణవాయువునూ వాడుకుంటారు. * * *

లాడె గంగరాజుగారు, గుణుపురం.

—శబ్దముయొక్క వేగముకన్న వెలుతురు వేగము యెక్కువే. అయినా టెలివిజనులో బొమ్మ శబ్దమూ ఒకేసారి తెలుస్తాయి నిజమే. కారణ మూహించలేరా? ఈ రెండూ కూడా మన రిసీవింగు సెట్టుదాకా (ఏరియల్ దాకా అనండి పోనీ) వెలుతురు వేగంతో రేడియో తరంగాల రూపంగా వస్తాయి. సెట్టు ఈ తరంగాల్ని పట్టి విశ్లేషించుకుని బొమ్మనీ శబ్దానీ వేరుగా (ఒకేమారు) చూపిస్తుంది.

వజ్రము స్ఫటికముకదా? దానితో సమానమైన కాంతి వక్రీభవన గుణముగల స్ఫటికమును తయారుచేస్తే అదికూడా తనలో చొచ్చిన కిరణాన్ని ఒకంతటా బయటికి పోనివ్వదు. అంటే వజ్రంలాగే మెరుస్తుందన్న మాట.

* * * *

యస్. శామ్యూలుగారు, కడవకొల్లు.

చేతి వాచీ టిక్కుటిక్కులుగాని, అన్ని గోడగడియారాలా టిక్కులుగాని సెకండ్లు కావు. సెకనుకు రెండుగానీ నాలుగుగానీ టిక్కులు ఉంటాయి సామాన్యంగా. గోడగడియారాలలో లోలకము నెమ్మదిగా ఆడుతుంది. కనక వాటిలో సెకనుకు రెండేసి టిక్కులుంటాయి. చేతి వాచీలలో స్ప్రింగుతో తిరిగే చక్రము త్వరత్వరగా తిరుగుతుంది. కనుక సెకనుకి నాలుగు టిక్కులు కూడా వుంటాయి.

నిమిషాల ముల్లుమీద దృష్టిపెట్టి టిక్కులు లెక్కపెట్టి చూడండి, మీకే తెలుస్తుంది.

—సైకిలు చక్రాల వ్యాసములు రెండూ సమానమే. కనుక ఎంత వక్రంగా తొక్కినా రెండు చక్రాలూ ఒకే వేగంతో తిరుగును.

—పక్షవాతమునకు కారణము రక్తపుపోటు హెచ్చుగా నుండుట. వెన్నెలలో పరుండుటవలనైనచో ఇది వచ్చునని మాకు తెలియదు. మీ కెవరు చెప్పినారు? వైద్యులయితేనే గాని నమ్మకండి.

డి. మాసిలామణిపిళ్లెగారు, కాకినాడ.

—పెద్దరాతిని తిరగతొయ్యవలెనంటె రాతికింద గునపపు కొసనుజొనిపి, గునపము వెనకరాతిముక్కను దన్నుగా పెట్టుకుని గునపము రెండో కొసని కిందకి నొక్కితే రాయి సుళువుగా లేచిపోతుంది. దన్నుగా పెట్టిన రాతిముక్కనుంచి, చేతితో నొక్కే కొసకి దూరము ఎక్కువైనకొద్దీ, రాయిని తిరగతొయ్యడము సులువు. ఇప్పుడు చదవండి "తగుమైన గునపమూ, అనువైన ఆధారమూ చూపితే ఈ భూగోళాన్ని కదిలించి దొర్లించి వేయగలన"న్న ఆర్కిమిడీసు వ్యాకాన్ని. అది సాధ్యమౌతుందని ఆయన అభిప్రాయం కాదు. తులాదండముయొక్క సూత్రాన్ని వివరించడమే.

—శక్తివంతమైన బోరింగు మెర్షనుతో మనదేశంలో భూమికి కన్నము చేసుకుంటూ 8000 మైళ్ళుపోతే ఆ కన్నము అమెరికాలో పడుతుంది. అయితే ఈలోపుగా ఆ బోరరు భూగర్భంలోని వేడికి కరిగిపోకుండా ఉండాలి. ★

# కాలక్షేపం

(4-వ పేజీ తరువాయి)

నకే దానిలో ఉన్న మోజు ఏమిటో దానిలో ఉన్న బూజు ఏమిటో సమగ్రంగా తెలుసు. కనుక, సంసారం అనేది బురద గుంట అని అతడు స్వానుభవంతో చెప్పిన సాక్ష్యం సన్యాసి మాటలకంటె స్పష్టమైనంగా స్వీకరించక తప్పదు. అందువల్ల యీ బురదలో దిగినకొలది దురదతప్ప మరే సరదా లేదని చివరకు గ్రహించి, "నన్ను బురదనుంచి ఉద్ధరించు వరదా! హరీ! ముకుందా!" అని ఆర్తనాదం చేస్తాడు. ఏ మహనీయుడైనా, ఏ సిద్ధుడైనా, ఉద్ధరిస్తే, "ధన్యోస్మి! ధన్యోస్మి!" అని సన్యసిస్తాడుకూడా —. అమందానందకందళిత హృదయారవిందు డవుతాడు. హృదయం అనే అరవిందం వికసించి అరవిందుని అంత వాడుకూడా కావచ్చు. హృదయపంకజం అనేది నిజంగా పంకంలోనుంచి అనగా బురదలోనుంచి ఉద్భవించినదేయని తన హృదయం తాను పరిశోధించుకోగలవానికి పరిస్ఫుటమవుతుంది. బురదలోనుంచి పుట్టినదే పద్మం. హృదయపంకజంకూడాఅంతే.

మట్టిపుట్టలోనుంచి పుట్టినవాడే వాల్మీకి. యుద్ధాలుచేసి విసువుపుట్టినవాడే సుశ్లోకుడైన అశోకచక్రవర్తి — గాంధిమహాత్మునకు సత్యాగ్రహం అంటే, ఏమిటో ఆత్మగతం చేసినది ఆయన ధర్మపత్ని కస్తూరిబా. ఆఫ్రికాలో ఒకసారి ఆమె మీద ఆయనకు ఆగ్రహంవచ్చి ఆమెను తన నిజనివాసమునుండి వెడలగొట్టినప్పుడు, "నీట ముంచినా, పాలముంచినా నీవే గతి"యని ఆమె కదలక స్తంభించినప్పుడు, "సత్యాగ్రహం ప్రేమమయపూరితం"అనే విషయం ఆయన జీవితంలో ఆనాడు గ్రహించాడు.

అయితే, సత్యాగ్రహతత్వం సాధకం చెయ్యవలెననేవాడు ఆఫ్రికాలో కొంతకాలం ఉంటేనేగాని వీలులేదని వాదించ వీలులేదు.

తపస్సు చేయవలెనంటే గంగఒడ్డుకు పోవలెనా? సంసారంలోపడి తపించేవాడిది తపస్సుకాదా! సంగ్రామంతో తపించిన లోకం తపస్సు చేయలేదా?


మన ఆత్మారాముడుకూడా సదా అయోధ్యలో ఉండడు. ఈ ఆత్మారాముడు అనేక అవస్థలపాలై "ఏదిర నాసీత! ఏదిర లక్ష్మణా:" అని ఏడుస్తూఉంటాడు; తపిస్తూ ఉంటాడు. అటువంటి అరణ్యవాసంలో తపించడమే తపస్సు. మనస్సు చీకాకుపడి, చిందరవందరయై చీమదూరని చిట్టడవిలో చెట్టుపుట్టలమధ్య చిక్కుకొన్నట్లుగా దారి తెన్నూక తీరుగా కన్పించక ఎవని హృదయం భయ సంశయ సంభరితం అవుతుందో అట్టిదే తపస్సు ప్రారంభించిన మనస్సు. అదే జ్ఞానోదయానికి ఉషస్సు. "జాలిలేక, జప్తుచేసి నా ఆయుష్కాలం ఏలం వేయుచున్నారెవరో!" అనే భావం హృదయంలో ఉదయిస్తే, జ్ఞానసూర్యుని వెంట బడినట్టే — తన జీవితకాలపువిలువ గ్రహించి నట్లే — హృదయంలో ఆదిత్య స్వరూపం సాక్షాత్కరించినట్టే నిరూపించాలి. ఆదిత్యహృదయ మాహాత్మ్యం అప్పుడు చూడాలి.

"అనిత్యపులోకంబున మానవుల్ మితనిమేషాయుష్కులై" ఉన్నారనే దిగులు మిగుల పొగడదగినదేగాని తెగడదగినది కాదు. అటువంటి చింత చేవగల చింత — తన ఆయుష్కాల నిమిషాలు గడచిపోతున్నవనే భావంతో గుండె కొట్టుకుంటూ ఉంటే, అటువంటి నిమిషతత్వ జిజ్ఞాసలోనుండియే అనిమిష తత్వం మనిషిని ఆవహిస్తుంది —. అటువంటిసంతత చింత ఉంటే —

"తపముల్ సేయుచు దేవతా
తటిని చెంతన్"
నిల్చినప్పటికీ,
"దార పరత్వంబున"
నుండినప్పటికీ
"వివిధశాస్త్ర శ్రవ్య కావ్యా
మృతం బుపభోగించి"
నప్పటికీ,
"పానీయంబులు ద్రావుచున్
గుడుచుచున్ భాషించుచున్ హాస లీ
లా నిద్రాదులు సేయుచున్"

సంతత శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాదసంధానుడే అవుతాడు. "పోతోంది కాలం!—వస్తోంది పోయేకాలం!—" అనే భయం క్షేమకరం. ఆ భయం హృదయంలో శూలంవలె గాలంవలె గ్రుచ్చుకోవలె. అదే శివంకరం. భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్కాలం; యీ త్రికాలం త్రినేత్ర త్రిశూలం. ప్రతి వ్యక్తి ముక్తి ప్రసక్తి మూలం, కీలం. మూలకీలకం అదే భక్తి ఆలవాలం.





సాహిణీవారి "అమరసందేశం" లో శ్రీరంజని, శర్మ, అమరనాథ్.

# మళ్లీ పౌరాణిక చిత్రాలు

పౌరాణిక చిత్రాలతో ప్రారంభమైన తెలుగు సినిమా పరిశ్రమ మళ్ళీ పౌరాణిక చిత్రాల ఘట్టానికి వచ్చింది. ఇటీవలి సంవత్సరాల్లో, భక్తుల జీవిత చిత్రాలు, జానపద చిత్రాలు విరివిగా తయారైనా కేవలం పురాణాల్లోంచే ఇతివృత్తాలను గ్రహించిన చిత్రాలు ఎవరూ తీయలేదు. తెలుగులో సుమారు 70 దాకా పౌరాణిక చిత్రాలు ఉన్నాయి. ప్రసిద్ధ కథలు చాలామటుకు తెర మీదికి ఎక్కాయి. ఇక పౌరాణిక ఇతివృత్తాలకు కరువేర్పడింది. అదీకాక ఆ ఇతివృత్తాలకు చివరి రోజులలో ప్రజాదరణకూడా కరువైంది అందుచేత మన నిర్మాతలు జానపద, సాంఘిక చిత్రాలు నిర్మించ సాగారు. వీటిలో కూడ క్రమంగా వైవిధ్యం తగ్గి ప్రజాదరణ లభించడం లేదు. కనుక నిర్మాతలు తిరిగి మొదటి దశకు తిరోగమిస్తున్నారు. ఈ పరిస్థితి వాంఛనీయమా, కాదా అనే విషయాన్ని గూర్చి ఈ దిగువ వ్యాసంలో ఒక రచయిత తన అభిప్రాయం వెలిబుచ్చారు. సినిమా సమస్యలలో అభిరుచి, అభినివేశం కలిగిన పాఠకులు "పౌరాణిక చిత్రాల నిర్మాణం వాంఛనీయమా, కాదా? వాటికి ప్రజాదరణ ఎంతవరకూ లభిస్తుంది?" మొదలైన ప్రశ్నలపై చర్చలో పాల్గొన వలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

# పౌరాణిక కథలవైపు తిరోగమనం

భారతదేశంలో మొట్టమొదట ఫిలిం పరిశ్రమ ఉత్తర హిందూదేశంలోనే ప్రారంభమైంది. ప్రారంభదశలో పౌరాణిక చిత్రాలు తీసినప్పటికీ సాంఘిక చిత్రాల ప్రక్కకే మొగ్గుచూపారు. అప్పటి నుంచి కొన్ని వందల సాంఘిక చిత్రాలు తీశారు. ఇవేగాక చరిత్రాత్మక చిత్రాలు కూడ అనేకం తీసి ప్రేక్షకుల మన్ననలు పొందారు. దీనిని ఆదర్శంగా తీసుకుని మన ఆంధ్రలో కూడ కొన్ని కంపెనీలవారు సాంఘికచిత్రాలు తీయటం మొదలు పెట్టారు. అయితే వీరుమాత్రం చరిత్రాత్మక చిత్రాలను ఎక్కువ ఖర్చు అవుతుందనో ఏమోగాని తీయడానికి సాహసించలేదు. ప్రారంభదశలో 'ప్రహ్లాద,' 'దశావతారాలు,' 'హరిశ్చంద్ర,' 'సావిత్రి' మొదలైన పౌరాణిక చిత్రాలు వచ్చినప్పటికీ, తరువాత 'మాలపిల్ల,' 'మల్లీపెళ్లి,' 'ఇల్లాలు,' 'గృహలక్ష్మి,' 'వందేమాతరం,' 'రైతుబిడ్డ' మొదలగు చక్కటి సాంఘిక చిత్రాలు వచ్చాయి. 'సాంఘిక చిత్రాలు తీస్తే డబ్బురాదు' అనే సిద్ధాంతాన్ని కాలదన్ని, సాంఘికచిత్రాలు తీసి విజయం సాధించి, ఒక మార్గాన్ని చూపిన కీర్తిశేషులైన గూడవల్లి రామబ్రహ్మంగారికి సాంఘిక చిత్రరంగంలో అగ్రతాంబూలం ఇవ్వాలి.

అయితే ఇప్పుడు భారతదేశంలో - ఉత్తర దక్షిణ ప్రాంతాలలో - ఎందుకు పౌరాణిక చిత్రాలవైపుకు మొగ్గుతున్నారు? సాంఘికచిత్రాలకు ప్రజాదరణ తక్కువగా వుంది గనుక వీటిని తీస్తున్నామని అంటున్నారు అంటే సాంఘిక చిత్రాలకు డబ్బు రావడంలేదు గనుక పౌరాణిక చిత్రాలు తీస్తున్నామని ప్రొడ్యూసర్లు చెప్పుతున్నారు. సాంఘిక చిత్రాలు ప్రజాదరణ ఎందుకు పొందటంలేదనే ప్రశ్న వెంటనే ఉదయిస్తుంది.

## "ప్రహారి"

సాంఘిక చిత్రాలలో అనేకలోపాలు ఉండబట్టే ప్రజాదరణ పొందటం లేదు. ఉదాహరణకు హిందీ సాంఘిక చిత్రాల కథానిర్వహణలో నూతనత్వం లోపించిందనే చెప్పాలి.

"పేదకుటుంబంలో పుట్టిన ఒక వ్యక్తి విద్య నభ్యసించటం, ఒక ధనిక స్త్రీని ప్రేమించటం, తల్లిదండ్రులు అంగీకరించక పోవటం, నాయికానాయకులు కష్టాలకు లోనై విరహగీతాలు ఆలాపించటం, చివరకు యిద్దరు సుఖంగా పెళ్ళి చేసుకోవటం" ఇదీకథ. ఈ నమూనాలోనే కొన్ని చిన్న చిన్న మార్పులు చేసి అనేక చిత్రాలు తీశారు. కథల్లో క్రొత్తదనం లేకపోవటంచేతనే ప్రేక్షకుల ఆదరణ పొందటంలేదు. కథ క్రొత్తదైనా, పాతదైనా, ప్రజాసమస్యలకు దగ్గఱ సంబంధమున్న చిత్రాలు, విజయాన్ని సాధించాయి. దీనికి ఉదాహరణగా 'హంలోగ్', 'దోబిఘా జమీన్', చక్కటి సంగీతాన్ని నూతన ఫక్కీలో సమకూర్చిన బైజూ బావరా, అనార్కలీ (చరిత్రాత్మకం) మొదలైన చిత్రాలను తీసుకోవచ్చు.

కొందరు ఆంధ్రా ఫిలింప్రొడ్యూసర్లు హిందీవారు పౌరాణికచిత్రాలు తీస్తున్నారు గనుక మనం కూడ తీద్దాం అని హిందీవారిని ఆదర్శప్రాయంగా తీసుకుంటున్నారు మంచిని ఆదర్శంగా తీసుకోవడం వాంఛనీయం. కాని దురదృష్టవశాత్తు మంచికంటె చెడునే ఎక్కువగా అనుకరించడం మనకు అలవాటైంది.

అయితే మన సాంఘిక చిత్రాలు ప్రజాదరణ ఎందుకు పొందడం లేదో చూద్దాం. కొన్ని వాస్తవ పరిస్థితుల ప్రోద్బలంవల్ల ఆంధ్రా ఫిలిం పరిశ్రమ ఆంధ్రదేశానికి దూరంగావున్న మద్రాసులో కేంద్రీకరించబడింది. అందువలన ఆంధ్ర ఫిలిం పరిశ్రమకు ప్రజలతో సంబంధం తెగుండాపోయింది. మన నిర్మాతలు ఏదో తమ చిత్రం విడుదల కాబోయే కాలంలోమాత్రం ఒకసారి తిరుపతికి (తమ చిత్రానికి ఎక్కువ డబ్బు రావాలని వెంకటేశ్వరస్వామికి మొక్కుకోడానికి వెళ్లడం అలవాటు), విడుదల అయిన తరువాత ఒకటి రెండు రోజులు నెల్లూరులో, విజయవాడలో వెళ్ళి వస్తారు. ఇంతకుమినహా ప్రజలతో వీరికి సంబంధం వుండదు. ఇంక ప్రజాసమస్యలు ఏమిటో, ప్రజలకు ఏమికావాలో వీరికి తెలియవు. తెలుసుకోడానికి ప్రయత్నాలుకూడ చాల తక్కువ. ఏ జానపదచిత్రమో విజయం పొందితే మిగతావారంతా జానపదచిత్రాలు తీస్తారు. హాస్యచిత్రం ఒకటి డబ్బు సంపాదించితే అందరూ హాస్య చిత్రాలే తీస్తారు.

ప్రజాసంబంధంలేని ఫిలిం పరిశ్రమ ఎలా వున్నదో చూద్దాం. కథ ఆలోచించక ముందే ప్రొడ్యూసరుకు కథానాయిక మనస్సులో వుంటుంది. ఆ కథానాయికకు సరిపోయిన కథను ఆలోచించి వ్రాయాలి. ఏవో కొన్ని కంపెనీలుతప్ప మిగతా అన్నీ



"సంఘం" లో స్త్రీ పురుష వేషాల్లో వైజయంతిమాల

ఇదేపద్ధతిని అనుసరిస్తున్నాయి. దీని తరువాత డైరక్టరుగారు పై కథకు కట్టుబడి, ఆ కథానాయికను దృష్టిలో పెట్టుకుని డైరక్టు చేయాలి ఆమె నటనకుగాని, నాయికా పాత్రకుగాని పనికిరాదంటే సినిమా తీయటమే వుండదు గనుక ఆమెతోనే సరిపెట్టుకుంటాడు డైరక్టరు. పోనీ యిలా లేకుండా స్వేచ్ఛవున్న డైరక్టర్లకు అనుభవంతక్కువ. వీరికికూడ ప్రజాజీవితంతో సంబంధముండదు. ప్రజామనస్తత్వం రోజురోజుకు ఎలా మారుతున్నదో వీరికి తెలియదు. బాక్సాఫీస్ సిద్ధాంతాలు వల్లించి సినిమా డైరక్టుచేస్తాడు. ఇంక ఈ డైరక్టర్ల అభివృద్ధి అంతా హిందీ, ఇంగ్లీషు చిత్రాలు చూడటంపైనే ఆధారపడి వుంటుంది.

సరే మాటలు - పాటలు వ్రాసే కవులను చూద్దామన్నా యిదే అధ్వాన్నస్థితిలో వున్నారు. వీరికి పూర్తి స్వేచ్ఛ మాటలు - పాటలు వ్రాయడంలో లభించటం లేదనే చెప్పాలి. ప్రొడ్యూసర్ చెప్పినట్లు కథ వ్రాయాలి. డైరెక్టరు చెప్పినట్లు మాటలు - పాటలు వ్రాయాలి. పోనీ వీరికి స్వేచ్ఛ లభించినా ప్రజాజీవితంతో సంబంధం చాలమందికి కరవై రచనలు చాల పేలవంగా వుంటాయి.

మన సంగీతంలో అంతా హిందీ అనుకరణే కనబడుతుంది. హిందీ సంగీతాన్నుండి మనం నేర్చుకోదగ్గ సంగతులు అనేకం వున్నాయి. మన సంగీతాన్ని ఆధారంచేసుకుని, హిందీ అనుభవాన్ని తీసుకుని సంగీతాన్ని సమకూర్చితే సరిపోతుంది. కాని హిందీ సంగీతాన్నే మక్కీకి మక్కీగా ఆంధ్ర చిత్రాలలో ఇరికించటంవలన సంగీతం చాల చౌకబారుగా వుంటోంది.

సినిమా సాంకేతిక నిపుణతలోకూడ మన పరిశ్రమలో శ్రద్ధ లోపించింది. ఇప్పుడు చిత్రం ఎలావున్నా ఎవరు ముందు తీస్తే వారిదే గొప్ప. అలా తీస్తేనే మంచి డైరక్టరు. ఈ మూడు నెలల సిద్ధాంతంవలన (3 నెలలలో సినిమా తీయటం) సాంకేతికాభివృద్ధికి అవకాశం లేకుండాపోతున్నది. పెద్ద పెద్ద ఫిలిం సంస్థలు కూడ సాంకేతికాభివృద్ధి దృష్టిలో పెట్టుకుని చిత్రాలు తీయకపోవటం శోచనీయం.

ఈ పై కారణాలవల్ల సాంఘికచిత్రాలు దెబ్బ తింటున్నాయి ఈ సంవత్సరంలో విడుదలైన సాంఘిక చిత్రాలలో 'అంతా మనవాళ్లే,' 'పెద్ద మనుషులు', 'జ్యోతి' చిత్రాలు ఎందుకు ప్రజలకు నచ్చాయి? సహకారసంస్థలలో జరిగే మోసాలను చిత్రిస్తూ, మనవాళ్లే అనుకున్నవాళ్లు మన నెత్తిమీద ఎలా చేతులు పెడతారో చూపే చిత్రం "అంతా మనవాళ్లే", ఊరూరా



హెచ్. ఎమ్. రెడ్డిగారు "గృహలక్ష్మి" చిత్రాన్ని తమిళంలో పునర్నిర్మిస్తున్నారు. ఈ నెల 12 న ప్రారంభోత్సవం జరిగింది. అసోసియేట్ డైరక్టరు బంగార్రాజు, నటుడు రఘునంద్, మధు, ప్రొడక్షన్ మేనేజర్ పురుషోత్తంరెడ్డి, కెమెరా అన్నయ్య మున్నగువారు పైఫోటోలో ఉన్నారు.

వున్న పెద్దమనుష్యుల మోసాలను బట్టబయలుచేసే చిత్రం "పెద్ద మనుషులు"; కథలో కప్పదాట్లు వున్నప్పటికి స్త్రీ స్వతంత్రజీవితాన్ని గడపటానికి సంఘంలో ఎన్ని కష్టాలు పడాలో చిత్రించిన చిత్రం "జ్యోతి." ఈ సమస్యలన్నీ ప్రజలకు దగ్గరగా వున్నాయి గనుకనే ప్రేక్షకుల ఆదరాభిమానాలు ఆ చిత్రాలకు లభించాయి.

ఈ కారణాలవలన సాంఘికచిత్రాలు ప్రేక్షకుల మన్ననలను పొందలేకపోతున్నాయి. దీనిని ప్రొడ్యూసర్లు గ్రహించటానికి నిరాకరిస్తున్నారు. అందువలననే ఆంధ్రలో కొందరు ప్రొడ్యూసర్లు సక్కుబాయి, సావిత్రి, భక్త రామదాసు, కాళహస్తి మహాత్మ్యం మొదలగు పౌరాణికచిత్రాలను తీయబోతున్నారు. అంటే ఈ ప్రొడ్యూసర్లు ప్రజల సమస్యలను, ప్రజల అభిరుచులను తెలుసుకోడానికి నిరాకరిస్తున్నారన్నమాట. ప్రజలలో పూర్వం వున్న సనాతన భావాలను ఉపయోగించుకోవాలని ఈ చిత్రాలను తీయబోతున్నారు. కాని ప్రజలు పూర్వం వున్నట్లు లేరు. ఆంధ్ర ప్రజలు సాంఘికంగా చాల అభివృద్ధి పొందారు హేతువాదం అభివృద్ధి అయిన ఈ కాలంలో తిరిగి పౌరాణిక వాదాన్ని ప్రజల నెత్తిమీద రుద్ది డబ్బును గడించాలని అనుకోవటం వెర్రితనం అవుతుంది. నూతన భావాలకు అనుగుణంగా చిత్రాలు తీసే సమర్థత లేకనే ఈ ప్రొడ్యూసర్లు తిరోగమిస్తున్నారు. ఈ తిరోగమనాన్ని ఆంధ్ర ప్రజలు హర్షించరనే తలుస్తాను. ★

# "సంఘం"

వర్ణవిభేదాలు రూపుమాసిపోవాలనీ, వర్ణవిభేదాలు పోతేనే భారతదేశం అభివృద్ధి చెందుతుందనీ, ఆ విభేదాలు పోవడానికి వర్ణాంతర వివాహాలు జరపడం మంచి మార్గమనీ ఉద్బోధించే "సంఘం" అనే చిత్రం ఇటీవల ఆంధ్రదేశంలో విడుదలైంది. ఈ నెల 17 వ తేదీన ఈ చిత్రం ఏవి. ఎమ్. స్టూడియోలో పత్రికా విలేఖరులకు చూపబడింది. దీనికి దర్శకుడు ఎమ్. వి రామన్. మాటలు, పాటలు తోలేటి వెంకటరెడ్డిగారు వ్రాశారు. అంజలీదేవి, ఎన్. టి. రామారావు, వైజయంతీమాల, బాలచందర్, ఎస్. వి. రంగారావు, నాగయ్య, సహస్రనామం, ఋష్యేంద్రమణి రమణారెడ్డి మున్నగువారు నటించారు.

# "సంఘం"

వర్ణాంతర వివాహం చేసుకున్న ఒక సంఘ సంస్కర్తకు (నాగయ్య) కామిని (అంజలీదేవి) అని ఒక కుమార్తె ఉంటుంది. కామిని కులంలేని పిల్ల కావడంచేత ఎవరూ ఆమెను పెళ్లి చేసుకోడానికి ముందుకురారు. ఆమె తండ్రి ఎప్పుడూ ఆమె పెళ్ళివిషయమై విచారిస్తూ ఉంటాడు. కామినికి రాణీ (వైజయంతీమాల) అని ఒక స్నేహితురాలు ఉంటుంది. రాణీ మంచి ధైర్యవంతురాలు; బాగా నాట్యం చేస్తుంది; ఈత, సైకిలుతొక్కడం, పరుగు, మొదలైన సమస్త విషయాల్లోనూ ఆమెని మించినవారు లేరు. (ఈమె స్వరప్రస్తారి చేస్తూ ఏమాత్రం ఆయాసమూ లేకుండా రాగతాళబద్ధమైన పాట పాడగలదని మొదటి దృశ్యంలోనే నిరూపించబడింది. ఈవిధంగా అన్నిటిలోనూ అసమానురాలైన రాణీ కారు నడపడంలోమాత్రం రాజా (ఎన్. టి. రామారావు)కు తీసికట్టేనని తరవాత దృశ్యాల్లో తెలుసుకుంటాము.)

రాజా తండ్రి సీతారామాంజనేయదాస్ (రంగారావు). ఈయన ఆడవాళ్ళమీద అకారణద్వేషంతో మండిపడుతూంటాడు. అందుచేత ఆయన కొడుక్కి పెళ్ళి చేయకూడదని పట్టుబట్టి కూర్చుంటాడు. కాని భార్య రత్నం (ఋష్యేంద్రమణి) పోరు భరించలేక పెళ్ళిచేయడానికి ఒప్పుకుంటాడు. అయితే తనకు నచ్చినపిల్లనే పెళ్ళి చేస్తానంటాడు.

ఇలాఉండగా ఒకరోజున రాజా, అతని స్నేహితుడు చంద్రం (బాలచందర్) కారులో పోతూండగా కామినీ, రాణీ మరొక కారులో పోతూ తటస్థపడతారు. రాజా కామినిని ప్రేమిస్తాడు. ఆమె కులంలేనిపిల్ల అని తెలిసికూడా ఆమెనే పెళ్ళి చేసుకుంటానంటాడు. చంద్రం సహాయం వల్ల రాజా కామినుల వివాహం రాజాతండ్రికి తెలియకుండా జరిగిపోతుంది. కామినికి పెళ్లయినందుకు ఆమె తండ్రి సంతోషిస్తాడు. అయితే ఇంతలో ఆయన మేనల్లుడైన కెప్టెన్ సుందరం (సహస్రనామం) రంగూనునుంచి తిరిగివస్తాడు. అతడు కామినిని పెళ్లిచేసుకోవాలని ఆశపెట్టుకుని వస్తాడు. కాని ఆమెకు పెళ్లయిందని తెలిసి మళ్ళీ వెళ్ళిపోతాడు. అతణ్ణి వెదుక్కుంటూ కామినితండ్రి బయలుదేరి, అతడెక్కడా కనిపించకపోతే పిచ్చెక్కిపోయి, 'బే ఆఫ్ బెంగాల్'లో పడి మునిగి చనిపోతాడు.

రాజా ఒక కులంలేనిపిల్లను పెళ్లిచేసుకున్నట్లు తెలిసి అతని తండ్రి కోపగించి కొడుకుని వెనక్కి పిలిపిస్తాడు. కులంలేని పిల్లకు గుణంకూడా ఉండదని ఆయన కొడుక్కి నూరిపోస్తాడు. కామినిని తన తల్లిదండ్రులకు చూపిస్తే వారి దురభిప్రాయం మారిపోతుందని రాజా తన భార్యని తీసుకురావడానికి వెడతాడు. అదే సమయానికి కామినిని మోహించిన కెప్టెన్ సుందరం ఆమెను బలాత్కరించడానికి ఆమె గదిలోకి వచ్చి, మళ్లీ బుద్ధిమార్చుకుని వెళ్ళిపోతాడు. వీరిద్దరూ ఒక గదిలో ఉండడం చూసిన రాజా కామిని మంచిది కాదని అభిప్రాయపడి ఆమెను వదిలివేసి

విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి "మా గోపి" లో చూపులతో మాట్లాడుతున్న జమున, నరసింహారావు



తండ్రివద్దకు పోయి 'నీ యిష్టం వచ్చిన పిల్లను పెళ్ళి చేసుకుంటా' నని మాట యిస్తాడు. తండ్రి అతనికి రాణిని వధువుగా స్థిరపరుస్తాడు.

రాణికి రాజా కామినులు వివాహమాడిన సంగతి తెలియనందువల్ల ఆమె కూడా రాజాను వివాహమాడడానికి ఒప్పుకుంటుంది. రాజా, రాణీ పెళ్లిపీటలమీద ఉండగా చంద్రం వచ్చి రాజా కిదివరకే కామినితో పెళ్ళయిందని చెబుతాడు. రాజా మోసంచేశాడని, రాణీ, ఆమె తండ్రీ అంతా నిందిస్తారు. రాజా తన భార్య కులట కనుక వదిలివేసి రెండో పెళ్ళి చేసుకుంటున్నానని చెబుతాడు. అదే సమయానికి కెప్టెన్ సుందరం హాజరై తనకూ కామినికి సోదర సోదరీసంబంధం తప్ప మరేం లేదని అంటాడు. అప్పుడు రాజా తన భార్య పతివ్రత అని గ్రహించి ఆమెను స్వీకరిస్తాడు. రాణీని చంద్రం పెళ్ళిచేసుకుంటాడు. రాజా తల్లిదండ్రులు కామిని కులంలేనిపిల్ల అయినా గుణంగల పిల్ల అయినందున ఆమెతో రాజా కాపురం చేయడానికి అంగీకరిస్తారు. అంతా సుఖంగా ఉంటారు.

ఈ చిత్రంలో సందర్భశుద్ధిలేని సన్నివేశాలు, ఔచిత్యం, ప్రయోజనం లేని పాత్రలు, నాచనప్రాయంగా వదిలివేస్తే వరిపోయే ఘట్టాల్లో మోతాదు మించిన నటన, అర్థంలేని పాటలు, నృత్యాలు, ఉపన్యాసాలు అన్నీ ఉన్నాయి. అయినా వీటన్నిటినీ భరించి కాలక్షేపం చెయ్యగలిగినవారికి సంతృప్తికరంగానే ఉంటుంది. ఎస్. వి. రంగారావు ధరించిన పాత్ర 'గుడ్డిలో మెల్లగా' ఈ చిత్రంలో వినోదం కలిగిస్తోంది. రంగారావు పాత్రపోషణం ప్రశంసనీయంగా ఉండడాన్నిబట్టి ఆయన కొంత స్వతంత్రించి నటించి ఉంటాడని అనుకోవచ్చు. ప్రొడక్షన్ విలువలలో నిర్మాతలు దమ్ములేకుండా చేసినందువల్ల ఆ విషయంలో చిత్రం ఆకర్షణీయంగానే ఉంది. మిగతా విషయాల్లో 'యావరేజ్' చిత్రమని మాత్రం చెప్పవచ్చు.

*    *    *

"రాజుగారు తలుచుకుంటే దెబ్బలకేం కొదవ" అన్నట్లు, డబ్బు పుష్కలంగా ఉన్న నిర్మాతలు తలుచుకుంటే ప్రేక్షకులకు జన్మలో కనివిని ఎరుగని వింతలు చూపించగలరు. తెరకి దగ్గరగా కూర్చునే ప్రేక్షకులను తమ దగ్గర బంధువులుగా భావిస్తారు కనుక వారినే దృష్టిలో పెట్టుకుని చిత్రాలు తీయడం నిర్మాతలకు పరిపాటి అయింది. 'ఈ కథలకి ఒక తలా తోకా ఉండనక్కరలేదా' అని అడిగే ప్రేక్షకులు తెరకి దూరంగా కూర్చుంటారు కనుక వారిమాటలు తమకు వినబడవట్లే నిర్మాతలు నటిస్తున్నారు. "తలా తోకా ఉంటే అది సినిమాకథే కా"దని వాదించే నిర్మాతలుకూడా కొందరున్నారు. తమకు తలా తోకా అంటే ఏమిటో పూర్తిగా తెలుసనీ, తెలిసికూడా కేవలం తెరదగ్గిరి ప్రేక్షకుల వినోదార్థం తలా తోకా తీసివేసి సినిమాలు నిర్మిస్తున్నామనీ వీరు చెబుతున్నారు కనుక వారిమాట నమ్మడంకంటె గత్యంతరం లేదు.

అయితే ఇరవైఏళ్ళు ఒకటోక్లాసుపిల్లలకి చదువు చెప్పడానికి అలవాటు పడినవాడు, బి. ఏ. ప్యాసయినవాడైనా, కొంచెం జాగ్రత్తగా ఉండకపోతే తనుకూడా ఒకటోక్లాసు స్టాండర్డుకు దిగజారిపోతాడు. అలాగే ఎంతకాలం చూసినా చవకబారు అభిరుచులకే ప్రాధాన్యం ఇచ్చి చిత్రాలు తీసే మన నిర్మాతలకు ఆ అభిరుచులే అలవడుతున్నాయని అనుమానించడంలో తప్పులేదు. లేకపోతే ట్రీట్‌మెంటు, స్క్రీన్‌ప్లే, డైరెక్షను, ఏదృష్ట్యా చూసినా ప్రాథమిక దశకంటే అధ్వాన్నంగా ఉన్నాయనిపించే చిత్రాలు ఎలా తయారవుతున్నాయి? ★

సోమర్సెట్ మాఘమ్ బ్రహ్మాండమైన పేరుగల రచయిత. ఎన్నో నవలలు, నాటకాలు, కథలు వ్రాసి పేరుకు పేరూ, డబ్బుకు డబ్బూ ఆర్జించాడు. ఆయన అభిమానులకు ఆయనొక మహా ప్రవక్త. ఆయన రచనలు భగవద్గీతలాగ పారాయణం చేసి, రాత్రిళ్లు, పడుకోబోయేటప్పుడు ఆయన పేరు జపించి మరీ నిద్రపోయే వ్యక్తులు ఆంధ్రదేశంలో కూడా చాలామంది కనిపిస్తారు. మాఘమ్ తన పుస్తకాల్లో మానవ స్వభావాన్ని తరిచి తరిచి చూపించాడనీ, మానవుల్లో ఎన్నిరకాల మనస్తత్వాలుండడానికి వీలుందో అన్నిరకాల మనస్తత్వాలనూ చూపించాడనీ వీరు సాధారణంగా అభిప్రాయ పడుతూంటారు.

సోమర్సెట్ మాఘమ్ వ్రాసిన "రెయిన్" కథ ఆధారంగా తీయబడిన "మిస్ సేడీ థాంప్సన్" ఈమధ్య మద్రాసు వచ్చింది. ఇది త్రీ-డీ లో తీయబడిన చిత్రం. త్రీ-డీ టెక్నిక్‌లో వస్తువులు మూడు కొలతల్లో కనిపిస్తాయని హాలీవుడ్ సినిమా వర్తకులు ప్రజల్ని చాలకాలంగా నమ్మిస్తున్నారు. మూడు కొలతల మాట దేవుడెరుగును గాని, ఫొటోగ్రఫీ లోపమో, కళ్ళజోళ్ల లోపమో, ఎంత కష్టించుకు చూసినా త్రీ-డీ చిత్రాల్లో డిస్టార్ట్ అయిన ప్రతిబింబాలే కనిపిస్తాయి.

"సేడీ థాంప్సన్" చిత్రంలో నైట్ క్లబ్ ఎంటర్‌టెయినర్ మిస్ సేడీ కథానాయిక. ఈమెను మిస్టర్ డేవిడ్‌సన్ అనే ఒక సంస్కర్త పతిత అనీ, చరిత్రహీన అనీ అసహ్యించుకుంటాడు. ఆమెకు క్రైస్తవ నీతులు బోధించి, విశుద్ధమైన కొత్త జీవితం ప్రారంభించవలసిందని సలహా ఇస్తాడు. ఆమె అతని నీతులను విని వాటిని ఆచరణలో పెట్టబోయే సమయానికి డేవిడ్‌సన్ తనే పతితుడై ఆమెను బలాత్కరించబోతాడు. అందరికీ నీతులు బోధించే తానే ఇలా పతితుడైనందుకు, తనమీద తనకే అసహ్యంపుట్టి డేవిడ్‌సన్ ఆత్మహత్య చేసుకుంటాడు.

అందరికంటె తాను నీతివంతుడని భావించేవాడు నిజంగా నీచుడై ఉంటాడనీ, వాని హృదయంలో ఎక్కడో అవినీతి దాగి ఉంటుందనీ, ఆ అవినీతిని అణచిపెట్టడానికే పైకి నీతివంతుడైనట్లు వాడు నటిస్తాడనీ, ఈ ప్రచ్ఛన్న నీచునికంటె బహిరంగంగా అవినీతిగా ప్రవర్తించేవ్యక్తే గౌరవార్హమైనదనీ ఈకథలో సారాంశం.

ఈ చిత్రం నిర్మించిన కొలంబియా కంపెనీవారు మాఘమ్ కథలో లేని కొన్ని బాక్సాఫీస్ ఆకర్షణలు చేర్చారు. పసిఫిక్ దీవులలోని అమెరికన్ మెరైన్ సైనికుల విశృంఖల జీవితం చాలా గొప్పగా ఉంటుందని చూపించబడింది.

సంఘంలో చిత్రచిత్రమైన మనస్తత్వాలుకల మనుషులుంటారు: నిజమే. ఇది అందరికీ తెలిసినదే. కొందరు బహిరంగంగా అవినీతి ఆచరించేవాళ్లుంటారు. కొందరు హృదయంలోని అవినీతిని దాచుకొని పెద్దమనుషులవలె ప్రవర్తిస్తారు. ఈ వ్యక్తులు ఎందుకలా ప్రవర్తిస్తారో, వారి ప్రవర్తనకు సాంఘికమైన కారణాలేమిటో పరిశీలించే ప్రయత్నం మాఘమ్ చెయ్యడు. అందుచేతనే అతని కథలు హాలీవుడ్ సినిమా నిర్మాణానికి చాలా అనుకూలంగా ఉంటాయి. ★

(-ఎస్నార్)



పక్షిరాజా వారి "అగ్గిరాముడు" లో భానుమతి

## "చింతామణి"

ప్రగతి ఆర్ట్ థియేటర్స్ అనే నాటక సంఘంవారు ఈ నెల 16 న ఎగ్మూర్, మ్యూజియం థియేటర్ లో "చింతామణి" నాటకం ప్రదర్శించారు. జి. ఎన్. స్వామి, జయలక్ష్మి, నిడదవోలు కుటుంబరావు, బంగారు వెంకటసుబ్బయ్య, వెల్లూరి సత్యం, రాజన్నం, గంగారత్నం మున్నగువారు నాటకంలో పాల్గొన్నారు. నాటకానికి పలువురు సినిమా ప్రముఖులు, పౌరులు హాజరయ్యారు. నాగయ్యగారు అధ్యక్షత వహించి ఉపన్యసిస్తూ, మద్రాసులో తెలుగు నాటకాలను ప్రోత్సహించడానికి తెలుగువారంతా, ఇతర ధనికులు ముందుకు రావాలని కోరారు.

ఈ సంస్థవారు ఆంధ్రదేశంలో కూడా "చింతామణి" ప్రదర్శిస్తారని తెలుస్తోంది. ★

## ఉత్తమ చిత్రాలకు ప్రభుత్వ బహుమతులు

భారతదేశమంతటిలోను ఉత్తమ చిత్రంగా ఎన్నుకొనబడినదానికి రాష్ట్రపతి పేర మీద ఒక బంగారు పతకం, వివిధ ప్రాంతీయ భాషల్లోని ఉత్తమ చిత్రాలకు వెండి పతకాలు, ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రానికి బంగారుపతకం ఇవ్వడానికి ప్రభుత్వం నిశ్చయించింది. పిల్లల చిత్రాల్లో ఉత్తమమైనదానికి భారతప్రధాని పేరు మీద ఒక ట్రోఫీ ఇవ్వబడుతుంది. ఈ పతకాలకు ఒకవైపున భారతయూనియన్ చిహ్నం, నిర్మాత పేరు, చిత్రం పేరు, బహుమతి ఇవ్వబడిన సంవత్సరం ఉంటాయట.

## "నరకద్వారాలు"

జపాన్ నుంచి పంపించబడిన "నరక ద్వారాలు" అనే ప్రసిద్ధ చిత్రానికి లొకార్నో (స్విట్జర్లెండు) లో ఈ నెలలో జరిగిన ఎనిమిదవ చలనచిత్రోత్సవంలో ఒక బహుమతి లభించింది. వివిధదేశాల చిత్రాలను పరిశీలించిన స్విస్ సినిమావిమర్శకుల సంఘంవారు ఈ చిత్రాన్ని అత్యుత్తమ చిత్రాల జాబితాలో చేర్చారు. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press. 7, Thambu Chetty St, Madras

